ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం fb.com/vaartha
PUBLISHED FROM KHAMMAM, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
5-6-2023 సోమవారం సంపుటి : 29 సంచిక : 125 పేజీలు : 10+4 వెల : 6.50

కోరమాండల్ లోకోపైలట్ చికిత్సపొందుతూ మృతి 2లో

నిజామాబాద్ జిల్లావాసి అమెరికాలో సజీవ దహనం 3లో



## కోరమాండల్ దుర్ఘటనపై
# సిబిఐ విచారణ

### మానవ తప్పిదమా! మరో కారణమా? అంశంపై దర్యాప్తు

### సిగ్నలింగ్ పాయింట్ టాంపరింగ్‌వల్లే ప్రమాదం

### పాయింట్‌ను కొందరు కావాలని మార్చినట్లు గుర్తింపు

### మృతులు 275 దాటలేదన్న అధికారులు

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ఒడిషాలోని బహనాగా రైల్వే దుర్ఘటనపై సిబిఐ విచారణకు కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆదివారం నాడు బహనాగాలో మీడియాకు వెల్లడించారు. ఈ దుర్ఘటనకు బహనాగా స్టేషన్‌లో గల సిగ్నలింగ్ పాయింట్ టాంపరింగ్ కారణమని రైల్వే భద్రత విభాగం అధికారుల విచారణలో తేలినట్లు, ఇందుకు కారకులైన వారిని గుర్తించామని, వీరిపై కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వే శాఖ మంత్రి వెల్లడించారు. మరోవైపు ఈ దుర్ఘటనలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవర్‌కు రైల్వే శాఖ క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.
దేశంలో అతిపెద్ద రైల్వే దుర్ఘటనలో ఒకటిగా నిలిచిన ఒడిషాలోని బాలాసోర్ జిల్లా బహనాగా ప్రమాదం వెనుక కుట్ర కోణం వుందని రైల్వే శాఖ బలంగా విశ్వసిస్తోంది. 275 మంది ప్రయాణీకుల దుర్మరణానికి దారితీసిన బహనాగా రైలు దుర్ఘటన కేవలం ప్రమాదవశాత్తూ జరిగిందని మొదట అనుకున్నా ఆ తరువాత వెల్లడైన వివరాల ఆధారంగా ఇందులో కుట్ర వుందని రైల్వే శాఖ అధికారులు తేల్చారు. బహనాగా రైల్వే స్టేషన్ సిగ్నలింగ్ పాయింట్‌లో ట్యాంపరింగ్ జరిగిందని రైల్వే సేఫ్టీ అ ధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. శుక్రవారం రాత్రి ఏడు గంటల సమయంలో హౌరా నుంచి చెన్నై వస్తున్న ≫2

### కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌కు క్లీన్ చిట్

బహనాగా దుర్ఘటనలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవర్‌కు రైల్వే సేఫ్టీ విభాగం క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తప్పిదం లేదని అధికారులు తేల్చారు. అతను తనకు కేటాయించిన మార్గంలోనే రైలును తీసుకు వెళుతున్నాడని, రైలు వేగం 130 కిలోమీటర్ల వరకు వుండాల్సి వుండగా ప్రమాదం జరిగిన సమయంలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ 128 కిలోమీటర్ల వేగంతోనే వెళుతుందని రైల్వే సేఫ్టీ విభాగం తేల్చింది. తీవ్రంగా గాయపడ్డ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ బహనాగాలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆయనను రైల్వే సేఫ్టీ విభాగం అధికారులు శనివారం నాడు విచారించి వాంగ్మూలం తీసుకున్నారు.



రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ మరో కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్‌తో కలిసి కోరమాండల్ ప్రమాద ఘటనా స్థలంలో ఆదివారం సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలిస్తున్న దృశ్యం

### ఇంటర్ లాకింగ్ వ్యవస్థ ఎలా పనిచేస్తుంది?

బహనాగా రైలు దుర్ఘటన వెనుక సిగ్నలింగ్ పాయింట్ ట్యాంపరింగ్ జరిగిందని తేలడంతో రైల్వే శాఖలో అత్యంత కీలకమైన ఇంటర్ లాకింగ్ వ్యవస్థ పనితీరు గురించి మరోసారి చర్చకు దారితీసింది. ఒకే మార్గంలోని పట్టాలపై ఏకకాలంలో రెండు రైళ్లు అతి దగ్గరగా లేదా ఎదురెదురుగా వుండకుండా చూసేందుకు ఏర్పాటైన వ్యవస్థ ఇది. రైలు ప్రయాణం సురక్షితంగా జరిగేలా చూడడం, సిగ్నలింగ్ వ్యవస్థలో ఎక్కడా తేడాలు, మార్పులు రాకుండా చూడడం ఇంటర్ లాకింగ్ వ్యవస్థలో కీలక మైనదిగా చెప్పాలి. ఒక్కమాటలో చెప్పాలంటే ఒక రైలు ప్రయాణించే మార్గం పూర్తిగా ≫2



ఆదివారం నిర్మల్ బహిరంగసభలో మాట్లాడుతున్న సిఎం కెసిఆర్

### మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్‌కు
# 3 మెడికల్ కాలేజీలు
### సిఎం కెసిఆర్ వరాల జల్లు

### నిర్మల్‌లో కొత్త కలెక్టరేట్, బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభించిన సిఎం

**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త :** నిర్మల్ జిల్లాకి తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు వరాల జల్లు కురిపించారు. జిల్లాకు వచ్చిన సిఎం కెసిఆర్ ఎల్లపెల్లి సమీపంలో నిర్మించిన నూతన కల్టెరేట్ భవన సముదాయాన్ని ఆదివారం రోజు సాయంత్రం ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం సమీపంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ నిర్మల్ జిల్లా అధికారులను, మంత్రులను, ఎమ్మెల్యేలను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు. జిల్లాలో 396 గ్రామపంచాయతీలకు 2 కోట్ల 50 లక్షల నిధులను ఒక్కో గ్రామపంచాయతీకి 10 లక్షలు మంజూరు చేస్తామన్నారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ మున్సిపాలిటిలకు కూడా ప్రత్యేకంగా 3 కోట్ల రూపాయలను ప్రకటిస్తున్నామన్నారు. నిర్మల్‌లోని 19 మండల కేంద్రంకు 20లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు.
రాష్ట్రంలో వచ్చిన ఎస్ఎస్‌సీ ఫలితాలలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా నిలిచిందని, అందుకు కృషిచేసిన జిల్లాకలెక్టర్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుల, విద్యార్థులను, మంత్రిని, ఎమ్మెల్యేలను అభినందిస్తున్నామని వెల్లడించారు. బాసర ఆలయాన్ని కూడా పెద్ద ఎత్తున నిర్మాణం చేసుకోబోతున్నామని అన్నారు. కాంగ్రెస్ పాలనలో భూముల వివరాలను మార్చేవారన్నారు. పట్టాలు కావాలంటే పది నిమిషాల్లోనే ≫2



ఆదివారం అచ్చంపేటలో జరిగిన సభలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. చిత్రంలో గద్దర్ ఉన్నారు

### మార్పు కోసం..
# ప్రజల ఎదురు చూపు
### తెలంగాణలో నడుస్తున్నది పోలీసు రాజ్యం: భట్టి విక్రమార్క

**అచ్చంపేట, జూన్ 4 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9ఏళ్లు గడుస్తున్న బీఆర్ఎస్ పాలనలో ప్రజలు, రైతులు నానా ఇబ్బందులకు గురై అవస్థలు పడుతున్న పాలకులు మాత్రం స్వలాభ ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని పాలన కొనసాగిస్తున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆదివారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని రంగాపూర్ గ్రామానికి చేరుకున్న పీపుల్స్ పాదయాత్రకు గ్రామ ప్రజలు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం కల్లబొల్లి మాటలు చెప్పి నీళ్లు, నిధులు నియమాకాలు అనే పేరుతో రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టి మోసం చేసి గద్దెనెక్కిన తర్వాత ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చకుండా విస్మరించిన ఘనత కల్వకుంట్ల కుటుంబానికే దక్కిందని ఆయన పేర్కొ ≫2

# పర్యావరణంలో తెలంగాణ టాప్

### • సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నివేదిక • మంత్రి కెటిఆర్ హర్షం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్4:** తెలంగాణ రాష్ట్రం మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచింది. దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్న వేళ మరో అరుదైన ఘనతను దక్కించుకుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ సంస్థ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ విడుదల చేసిన నివేదికలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రం చేపట్టిన అడువుల పెంపకం, మున్సిపల్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి అనేక పర్యావరణహిత కార్యక్రమాలను పరిగణలోకి తీసుకున్న సంస్థ, తెలంగాణ రాష్ట్రానికి అగ్రస్థానాన్ని కట్టబెట్టింది.
తెలంగాణ రాష్ట్రానికి జాతీయ స్థాయిలో పర్యావరణ రంగంలో ఈ గొప్ప గుర్తింపు లభించడం పట్ల మంత్రి కల్వకుంట్ల తారక రామారావు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం పచ్చదనంతో పరిఢవిల్లాలన్న బృహత్ సంకల్పంతో సిఎం కెసిఆర్ ప్రారంభించిన హరితహారం కార్యక్రమంతో పాటు అనేక పర్యావరణహితమైన కార్యక్రమాలకు ఈ అరుదైన ఘనత దక్కడం పట్ల మంత్రి కెటిఆర్ హర్షం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా హరితహారంతో పాటు ప్రభుత్వకార్యక్రమాలు విజయవంతం అయ్యేలా,అందులో భాగస్వాములైన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మంత్రి కెటిఆర్ అభినందనలు తెలిపారు. పర్యావరణ విధ్వంసం నుంచి తెలంగాణ ప్రాంతం కోలుకునేలా తొలినాళ్లలోనే కెసిఆర్ దీర్ఘదృష్టితో ఈ హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి,దాని అమలుకి చూపిన చంచలమైన కృషి వల్లనే ఈ ఘనత సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తు తరాల కోసం హరించుకుపోయిన అడవులను పునరుద్ధరించి,రాష్ట్రంలో పచ్చదనాన్ని 22 శాతం నుంచి 33 శాతానికి పెంచడం లక్ష్యంగా హరితహారం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని, ప్రజల సహకారంతో ఇది ఒక ఉద్యమ రూపంలో కొనసాగిందన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమం వలన అనేక సానుకూల ఫలితాలు అందుతున్న విషయాన్ని అనేక సంస్థలు పలుమార్లు గుర్తించిన విషయాన్ని కెటిఆర్ ప్రస్తావించారు. గత 9 ఏళ్లలో దాదాపు 273 కోట్ల మొక్కలను నాటామని, దీంతో 2015-16లో రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 19,854 చదరపు కిలోమీర్లు ఉండగా, 2023 నాటికి అది 26,969 చదరపు కిలోమీటర్లకు పెరిగిందన్నారు.
దేశంలోనే అత్యధికంగా తెలంగాణ విస్తీర్ణంలో అడవులు 24.06శాతంగా ఉన్నాయన్నారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమం ఫలితంగా రాష్ట్రంలో 7.70 శాతం పచ్చదనం పెరిగిందని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక పేర్కొన్న విషయాన్ని కెటిఆర్ తెలిపారు.
అడవులతో పాటు సామాజిక వనాలను, పట్టణాలు, పల్లెలు అనేక అంతరం లేకుండా పార్కులను విస్తృతంగా అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తాము తీసుకువచ్చిన నూతన పంచాయతీ రాజ్,మున్సిపల్ చట్టాల్లో హరిత బడ్జెట్ అనే వినూత్నమైన విధానాన్ని ప్రవేశపెట్టా ≫2

# జులైలో రైతు బంధు!
### కొత్త దరఖాస్తులతో ఆలస్యం
### దశాబ్ది ఉత్సవాల్లో ఇచ్చే ఆలోచన

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** ఈ నెలలో ప్రారంభమవుతున్న వానాకాలం సాగు సీజనుకు సంబంధించి రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తున్న రైతు బంధు నిధుల విడుదల ఈ సారి జాప్యం అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ నెలలో రైతు బంధు పథకం నిధులు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తారనే ప్రచారం జరిగినప్పటికీ ఇందుకు తక్కువగా అవకాశాలు కన్పిస్తున్నాయి. అయితే ప్రస్తుతం రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్న దృష్ట్యా ఇదే సమయంలో రైతు బంధు నిధులను విడుదల చేస్తే ఎలా ఉంటుందనేదానిపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. మరోపక్క ఆర్థిక శాఖ రైతు బంధుకు అవసరమైన నిధుల సమీకరణలో నిమగ్నమైంది. ఇప్పటికే కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతుల నుండి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. అయితే ఈ ప్రక్రియ ఎంత కాదన్నా మరో 15 రోజుల పాటు సమయం పడుతుందని వ్యావసాయ శాఖ అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. తదుపరి కొత్తగా రైతు బంధు లబ్దిదారుల జాబితాను అధికారులు ఖరారు చేయడానికి మరో 15 రోజులు పట్టే వీలుంది. దీంతో ఈ నెలలో రైతు బంధు నిధులు విడుదలకు అవకాశాలు అరుదుగా కన్పిస్తున్నాయి. అయితే ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసిననట్లయితే ఈ నెల చివరిలోనూ లేదా జూలై నెల మొదటి వారంలో రైతు బంధు పెట్టుబడి సాయం విడుదల చేసే అవకాశం ఉందని వ్యవసాయ అధికారవర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతీ వానాకాలం సీజనుకు జూన్, జూలై మాసాల్లో రైతు బంధు నిధులు విడుదల చేయడం సర్వసాధారణం. కానీ ఈ సారి జూన్ రెండో వారంలో నిధులను రైతు బ్యాంకు ఖాతాలకు జమ చేయాలనే దిశగా ఆలోచన చేసినా అది ఎంత వరకూ కార్య రూపం దాల్చుతుందనేది ≫2

### ఖమ్మంలో వైద్య విద్యార్థిని
# ఆత్మహత్య
### ఒంటిపై పెట్రోలు పోసుకొని బలవన్మరణం



మృతిచెందిన మానస (ఫైల్)

**ప్రభాతవార్త, ఖమ్మం క్రైం:** వైద్య విద్యార్థిని ఆత్మహత్య ఘటన ఖమ్మంలో కలకలం సృష్టించింది. ఖమ్మం లోని మమతా మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదువుతున్న సముద్రాల మానస(22) అనే విద్యార్థిని ఆదివారం రాత్రి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకొని బలవ న్మరణం చెందింది.
ఉమ్మడి వరంగల్ జిల్లా మహబూబాబాద్‌కు చెందిన మానస స్థానిక మమత మెడికల్ కళాశాలలో బీడీఎస్(మూడో సంవత్సరం) విద్యనభ్యసిస్తోంది. కాగా కళాశాల ఎదురుగా ఉన్న హాస్టల్ భవనంలోని నాలుగో అంతస్తులో ఈ ఘాతుకానికి పాల్పడింది. అయితే మానస ఆత్మహత్యకు దారితీసిన కారణాలు మాత్రం తెలియడం లేదు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మండుటెండలో జోరువాన



సికింద్రాబాద్‌లోని బొల్లారం ప్రాంతంలో ఆదివారం భారీ వర్షానికి నేలకూలిన చెట్లు

### హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం
### కూలిన చెట్లు, విద్యుత్ సరఫరాకు అంతరాయం
### మరో 4 రోజులు వర్ష సూచన

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. గత రెండు రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఆదివారం వర్షాలతో వాతావరణం చల్లబడింది. హైదరాబాద్‌తో పాటు, రాష్ట్రంలోని మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట్, ఆసిఫాబాద్ తదితర జిల్లాల్లో ఆదివారం ఒక మోస్తరు నుండి భారీ వర్షాలుకురిశాయి. ములుగు, జగదేవ్‌పూర్, రేగోడ్, నాగల్‌గిద్ది, నారాయణఖేడ్, కంది, మనూరు తదితర మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షాలకారణంగా పలు జిల్లాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరో వైపు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పర్యటిస్తున్న సమయంలో నిర్మల్ జిల్లాలో ఈదురు గాలులు వీచాయి. దీంతో బ్యానర్లు, కటౌట్లు చిరిగిపోయి, పడిపోయాయి. ఇక హైదరాబాద్‌లోనూ సాయంత్రం 5 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. పటాన్‌చెర్వు, రాజేంద్రనగర్, శేర్లింగంపల్లి, మాదాపూర్, గచ్చిబౌలి, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, సుచిత్ర, కొంపల్లి, అల్వాల్, రాజేంద్రనగర్, రాయ ≫2

### మణిపూర్ అల్లర్లపై
## త్రిసభ్య కమిటీ విచారణ 5లో



ఆదివారం నిర్మల్‌లో కొత్త కలెక్టరేట్‌ను ప్రారంభించిన కలెక్టర్‌ను అభినందిస్తున్న సిఎం కెసిఆర్. చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు

# 3 మెడికల్ కాలేజీలు

≫ అయిపోతుందన్నారు. రైతుబంధుకు రామ్ రామ్ అని, దళిత బంధుకు జైభీమ్ అవుతుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయి కాబట్టి కాంగ్రెస్ దోపిడీ పాలనకు చరమగీతం పాడుదామన్నారు. గోండు గిరిజన గూడాలను గ్రామపంచాయతీలను ఏర్పాటుచేశామన్నారు. రాజోలీ రోజుల్లో ఎవరికి సొంత జాగలు ఉన్నాయో ప్రతీ ఒక్క కుటుంబానికి రూ.3 లక్షల మంజూరు చేస్తామన్నారు. యాదవులకు రెండవ విడత గొర్రెల పంపిణీ చేస్తామన్నారు. ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మహారాష్ట్ర రైతులు మన దగ్గర ఒక ఆరికరం కొని బోరువేసుకుని వ్యవసాయం చేస్తారన్నారు. కెసిఆర్ మహారాష్ట్రపోతే మీరు మాకు రావాలని అని అన్నారని తెలిపారు. ప్రతిపక్షాల మాటలు విని ఆందోళన చెందవద్దని అన్నారు. మళ్లీ వారు అధికారం చేపడితే ఆందోళన తప్పదన్నారు. ప్రభుత్వమే వడ్లు కొనుగోలు చేసిరాని ఖాతాల్లోకి నగదును వెంటనే జమచేస్తున్నామన్నారు. 50 సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ కనీసం మంచినీరు కూడా ఇవ్వలేదని, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ కొరకు భూములను సిద్ధం చేయడం జరిగిందని, తద్వారా ప్రతీ జిల్లాలో పంట కొనుగోలు సులభం అవుతుందని, ఆదేవిధంగా స్థానికులకు ఉద్యోగాలు వస్తాయని అన్నారు. 27,28 ప్యాకేజీ త్వరలోనే పూర్తిచేస్తామని, ఎస్సారెస్పీ ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఈనెల 8వ తేదిన చదువుల పండుగను ఘనంగా జరుపుకుందామన్నారు. గతంలో విద్యుత్ కష్టాలు ఉండేవని, మోటార్లు ఎక్కువగా భిగించుకుంటే తొలగించేవారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక అలాంటి సమస్యలే లేవు అన్నారు. యాదవ సోదరులకు రెండవ విడత గొర్రెల పంపిణీ చేపడతామన్నారు. ప్రజలు ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలు విని మోసపోవద్దని అన్నారు. మళ్లీ మనమే అధికారం చేపడుతామని అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో దోపిడి లక్ష్యంగా పరిపాలన కొనసాగిందన్నారు. ఈ దోపిడిని నివారించి రైతులకు ఉపయోగకరంగా రూపొందించిన ధరణి విధానాన్ని కాంగ్రెస్ నేతలు తొలగిస్తామంటున్నారని పేర్కొన్నారు. ఇదే గనుక జరిగితే అవినీతి రాజ్యమేలుతుందని పేర్కొన్నారు.
వివిధ ప్రాంతాల్లో వీఆర్‌వోలు చేస్తున్న అవినీతికి చెక్ పెట్టేందుకే ధరణి కార్యక్రమం రూపొందించామన్నారు. నిర్మల్ జిల్లాలో 396 గ్రామపంచాయతీలకు ఒక్కొక్క గ్రామపంచాయతీకి 10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తామన్నారు. అలాగే నిర్మల్, ఖానాపూర్ ముథోల్ నియోజకవర్గాలకు ఒక్కొదానికి రూ.2.5 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. గత 50 సంవత్సరాల పాలనలో పాలించిన దుర్మార్గులు అభివృద్ధిని పూర్తిగా మరిచిపోయారన్నారు. అన్ని గ్రామాల్లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయడం చూసి మహారాష్ట్ర రైతులు ఆశ్చర్యపోతున్నారన్నారు. మిషన్ కాకతీయతో ఎండిన చెరువులు నిండాయని, వ్యవసాయం పండుగలా మారిందన్నారు. రాష్ట్రంలోని అన్ని గిరిజన తండాలను జీపీలుగా మార్చనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు రైతుబంధుతో పాటు మరణిస్తే 5 లక్షల రూపాయల భీమా సౌకర్యం కూడా తమ ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.
జిల్లాలో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చేందుకు వైద్య కళాశాల కూడా మంజూరైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, జోగురామన్న, ఎమ్మెల్సీ దండే విఠల్, జడ్పిచైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఐడిసి చైర్మెన్ వేణుగోపాల చారి, వివిధ ప్రాంతాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సిబిఐ విచారణ

≫ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు బహనాగా స్టేషన్‌లో మెయిన్ లైన్‌కు బదులు లూప్ లైన్‌లో వెళ్లి అక్కడ ఐరన్ ఓర్‌తో నిలిచి వున్న గూడ్స్ రైలును ఢీకొనడం తెలిసిందే. దీంతో ఈ రైలులోని 21 బోగీలు పట్టాలు తప్పి పక్కనే వున్న మరో మెయిన్ లైన్‌పై పడ్డాయి. ఇదే సమయంలో బెంగళూరు నుంచి హౌరా వైపు వస్తున్న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ కోరమండల్ బోగీలలో కొన్నింటిని ఢీ కొంది. ఈ ఘటనలో యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులోని చివరి రెండు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ఇప్పటి వరకు 275 మంది మరణించినట్లు తేలగా మరో వెయ్యిమంది వరకు గాయపడ్డారు. వీరిలో వంద మంది పరిస్థితి ఆందోళన కరంగా వుంది. ఈ దుర్ఘటనకు కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు మెయిన్ లైన్‌కు బదులు లూప్ లైన్‌లో వెళ్లడం కారణమని తేలగా అలా ఎందుకు జరిగిందనే దానిపై రైల్వే సేఫ్టీ అధికారులు విచారించగా సంచలన విషయాలు వెలుగు చూశాయి. బహనాగా స్టేషన్‌లో సిగ్నలింగ్ పాయింట్‌ను కొందరు ట్యాంపరింగ్ పాల్పడ్డారని రైల్వే సేఫ్టీ అధికారులు తేల్చారు. సిగ్నలింగ్ పాయింట్‌లో సెట్టింగ్స్‌ను మార్చడం వల్ల మెయిన్ లైన్‌లో వెళ్లాల్సిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు లూప్ లైన్‌లో వెళ్లి అక్కడ ఆగివున్న గూడ్స్ రైలును ఢీకొందని అధికారులు తేల్చారు. రైల్వే శాఖలో సిగ్నలింగ్ పాయింట్లన్నీ ఆటోమేటిక్‌గా మార్చిన తరువాత ట్యాంపరింగ్ జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థలో సెట్టింగ్స్‌ను మార్చడం అంత సులభమైంది కాదు. సిగ్నలింగ్ గదిలో ఉతరులను అనుమతించరు. సిగ్నలింగ్ వ్యవస్థ అంతా స్టేషన్ మాస్టర్ కనుసన్నల్లోనే జరుగుతోంది. ఆయన అనుమతి లేనిదే ఇక్కడ ఎవరు వచ్చేందుకు వీల్లేదు. ఇంతటి రక్షణ వ్యవస్థ వుండే బహనాగా స్టేషన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థను ఎవరో ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారని తాజాగా వెలుగు చూసింది. దీంతో బహనాగా స్టేషన్ మాస్టర్ గదితో పాటు చుట్టు పక్కన గల సిసి కెమెరాలను రైల్వే సేఫ్టీ అధి కారులు పరిశీలించి అందులోని ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో స్టేషన్ మాస్టర్ గదిలో కొందరు అనుమానితుల కదలికలు వున్నట్లు రైల్వే సేఫ్టీ అధికారులు గుర్తించారని తెలిసింది. స్టేషన్ మాస్టర్ గదిలో పాటు బహనాగా స్టేషన్ పరిసరాల్లోనూ కొందరు అనుమానిత వ్యక్తుల కదలికలు వున్నట్లు తేలింది. వీరు ఎవరన్నదీ ఇంకా తేలకున్నా అనుమానితులను అదుపులోకి తీసుకున్న రైల్వే సేఫ్టీ అ ధికారులు వారిని విచారించనున్నారు. ఈ నేపథ్యంలోనే బహనాగా దుర్ఘటనపై సిబిఐ విచారణకు ఆదేశిస్తున్నట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. సిబిఐ విచారణలో అన్ని విషయాలు వెలుగు చూస్తాయని, దోషులు ఎంతటి వారైనా వదిలేది లేదని ఆయన స్పష్టం చేశారు.

## ఇంటర్ లాకింగ్ వ్యవస్థ ఎలా పనిచేస్తుంది?

≫ సురక్షితంగా వుండేలా చూడడం ఈ వ్యవస్థ ఉద్దేశం. ఇదే సమయంలో ఈ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తరువాత అన్ని రైళ్ల ట్రాకింగ్ సులభంగా మారింది. ఏ రైలు ఏ సమయంలో ఎక్కడి నుంచి బయలు దేరింది...? ఎక్కడికి వెళ్లాల్సి వు ంది...? ఏసమయంలో ఎక్కడ వుంది? ఏ మార్గంలో వెళుతోంది...? ప్రయాణం సాఫీగా సాగుతోందా...? అనేది తెలుసుకునేందుకు సులభంగా మారింది. ఇదే సమయంలో ఒక రైలు ప్రయాణించే మార్గంలో మరో రైలు రాకుండా ఈ వ్యవస్థ నిరోధించ సాగింది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తరువాత దేశ వ్యాప్తంగా రైళ్లు ఒకదానితో మరొకటి ఢీకొనడం ఆగిపోయాయి. ఇదే సమయంలో ప్రమాదాలు కూడా గణనీయంగా తగ్గాయి.

## టిడిపితో బిజెపి పొత్తు ఊహాగానాలే: బండి సంజయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్4:** వచ్చే ఎన్నికల్లో టిడిపితో బిజెపి పొత్తు ఉంటుందనేది ఊహాగానాలే అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. ఊహాజనిత కథనాలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను టిడిపి అధినేత చంద్రబాబు కలిస్తే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. గతంలో మమత,స్టాలిన్,నితీశ్ కూడా మోదీ, అమిత్‌షాను కలిశారని గుర్తు చేశారు. ప్రతిపక్ష నేతలు, ప్రజలను కలవకుండా ఉండే పార్టీ బిజెపి కాదని చెప్పారు. కెసిఆర్ మాదిరిగా రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టే పార్టీ బిజెపి కాదని సంజయ్ పేర్కొన్నారు. మరోవైపు టిడిపితో బిజెపి మళ్లీ జట్టు కట్టే సూచనలు కనిపిస్తున్నాయి. చంద్రబాబు శనివారం రాత్రి అమిత్‌షాను కలిశారు. దాదాపు గంటకు పైగా ఆయనతో కీలక సమాలోచనలు జరిపారు. జేపీ నడ్డా కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. వీరి మధ్య చర్చలు అత్యంత సుహృద్భావ వాతావరణంలో జరిగాయని తెలుస్తోంది. అయితే ఇవి ప్రాథమిక చర్చలు మాత్రమేనని,భవిష్యత్తులో మరింత నిర్మాణాత్మకంగా జరుగుతాయని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి.



ఆదివారం న్యూయార్క్‌లో ప్రవాస భారతీయులతో సమావేశమైన రాహుల్ గాంధీ

# తెలంగాణ టాప్

≫ మని కెటిఆర్ తెలిపారు. ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించి ప్రతి గ్రామంలో ఒక నర్సరీతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15000 నర్సరీలు, దాదాపు 19,400 పైగా పల్లె ప్రకృతి వనాలు, 2725 బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టణాల్లోనూ విస్తృతంగా 700 కోట్ల రూపాయలతో 180 అర్బన్ ఫారెస్ట్ పార్కులను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం చేపట్టిన హరితహారం ఫలితాలు ఫలించి హైదరాబాద్ నగరానికి వరల్డ్ ట్రీ సిటీగా రెండుసార్లు గుర్తింపు లభించిందని అన్నారు. హరితహారంతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణహితమైన అనేక కార్యక్రమాలను చేపట్టిందని మంత్రి కెటిఆర్ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పర్యావరణానికి అత్యంత సవాలుగా నిలిచే పారిశుద్ధ్య నిర్వహణ విషయంలోనూ అద్భుతమైన ప్రణాళికలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపల్ కార్పొరేషన్లతో పలు మున్సిపాలిటీల్లో పేరుకుపోయిన చెత్తను బయో మైనింగ్ చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. దీంతో పాటు హైదరాబాద్ నగరంలో వేస్ట్ టు ఎనర్జీ రంగంలో 24 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ దేశంలో ఈ రంగంలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడంలోనూ తెలంగాణ అగ్రగామిగా నిలుస్తుందన్నారు. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు సోలార్ పవర్ కేవలం 74 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి అయ్యేదని, తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చిత్తశుద్ధితో కూడిన ప్రత్యేక చర్యల వల్ల నేడు రాష్ట్రంలో 5865 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి జరుగుతున్నది. సోలార్ ఉత్పత్తిలో చిన్న రాష్ట్రం అయినా దేశంలో రెండో స్థానంలో నిలవడం తమ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.
తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాలకు, జాతీయ అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు, అవార్డులు, ప్రశంసలురావడం మరింత తమకు స్ఫూర్తిని ఇస్తుందని కెటిఆర్ అన్నారు. ఈ మధ్యనే తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బృహత్ ప్రకృతి వనాలు,దేశానికే అదర్శం అంటూ నీతి అయోగ్ ప్రత్యేక ప్రశంసలు ఇవ్వడాన్ని కూడా కెటిఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వ సమగ్ర,సమతుల్య పర్యావరణ విధానాలకు, పర్యావరణం పట్ల ముఖ్యమంత్రి కెసిఆర్ నిబద్ధతకి దక్కుతున్న గుర్తింపు ఇది అన్నారు.

# కోరమాండల్ లోకో పైలట్ మొహంతి మృతి

**భువనేశ్వర్, జూన్ 4:** బాలేశ్వర్‌సమీపంలోని బహనాగ స్టేషన్‌వద్ద జరిగిన ఘోరరైలు ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ లోకోపైలట్ బిసి మొహంతి చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. మరొక అసిస్టెంట్ లోకోపైలట్ బెహరా ప్రస్తుతం ఐసియులో చేరి మృత్యువుతో పోరాడుతున్నట్లు వైద్యులు తెలిపారు. కాగా ప్రమాదంలోని బాధితులందరినీ బాలేశ్వర్, బాలసోర్ ప్రాంతాల్లోని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్సచేయిస్తున్న సంగతి తెలిసిందే.
ఈ ప్రమాదంలో పైలట్‌గా వ్యవహరించిన మొహంతికి తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న ఆతడిని ఆసు పత్రికి తరలించి ఐసియు వైద్యసేవలు అందించారు. అయినా కూడా మృత్యువుతో పోరాడుతూ ఆదివారం మృతిచెందినట్లు రైల్వే వర్గాలు ధృవీకరించాయి.

SINGAM KUIL BLUE SUNDAY
DrawDate on:04/06/23

DAY - SINGAM SERIES Dr No:189
1st Prize Rs.100000/- 467856
2nd Prize Rs.7000/- 34746
3rd Prize Rs.3500/-
28755 29015 40028 42629 61752
66088 70280 76939 88819 94787
4th Prize Rs.200/-
2089 3162 4013 4132 4841 5338 6042
6931 7090 9691
5th Prize Rs.100/-
0399 0449 2062 2257 2795 3899 4260
7047 7620 8271
6th Prize Rs.50/-
0049 0809 2912 4039 6021 7608 9039
0054 1228 2963 4139 6043 7654 9094
0257 1271 3202 4146 6136 7701 9318
0260 1628 3223 4179 6189 7782 9448
0357 1704 3339 4199 6365 7982 9593
0462 1740 3344 4311 6518 7988 9611
0477 1776 3531 4679 6682 8075 9707
0496 2053 3726 4857 6778 8142 9713
0513 2169 3763 4916 6842 8207 9734
0514 2283 3814 4979 7004 8277 9850
0578 2444 3943 5217 7067 8329
0602 2513 3954 5525 7103 8698
0606 2578 3966 5695 7137 8767
0659 2583 3985 5743 7176 8778
0787 2734 4026 5932 7346 8811

DAY - KUIL SERIES Dr No:189
1st Prize Rs.100000/- 246785
2nd Prize Rs.7000/- 21351
3rd Prize Rs.3500/-
14040 32406 38369 50833 60459
65090 68702 83716 91191 97029
4th Prize Rs.200/-
1000 2509 2857 4382 5246 5894 5951
7714 8819 9595
5th Prize Rs.100/-
2185 2226 2569 2646 3657 3985 5821
5998 6234 8923
6th Prize Rs.50/-
0093 1144 3046 3724 4934 6986 9009
0177 1234 3077 3813 4950 7010 9018
0213 1375 3130 3870 5126 7017 9185
0233 1380 3156 3904 5223 7220 9267
0326 1410 3202 3974 5373 7725 9357
0386 1465 3274 3978 5429 7743 9477
0457 1493 3393 4050 5578 7990 9511
0489 1542 3405 4070 5693 8000 9760
0517 2070 3416 4129 5801 8273 9785
0687 2354 3462 4135 5996 8458 9801
0766 2460 3501 4320 6253 8696
0787 2536 3541 4348 6770 8790
0913 2624 3563 4475 6775 8833
0920 2812 3573 4595 6822 8949
0944 2860 3613 4632 6972 8989

ROSA DEAR SILVER SUNDAY
DrawDate on:04/06/23

DAY - ROSA SERIES Dr No:189
1st Prize Rs.100000/- 223398
2nd Prize Rs.7000/- 96583
3rd Prize Rs.3500/-
01332 13533 46687 50505 54183
54217 77547 87243 88770 94804
4th Prize Rs.200/-
0326 2603 3197 4374 4379 6905 7005
8831 8965 9411
5th Prize Rs.100/-
0128 0318 2111 2937 4339 5534 7669
7806 8786 9459
6th Prize Rs.50/-
0045 1439 2995 4179 5803 6888 8370
0138 1513 3001 4286 5870 7052 8447
0266 1650 3185 4409 5888 7217 8497
0473 1836 3209 4414 5907 7234 8829
0517 2062 3434 4461 6126 7523 8897
0583 2080 3492 4585 6164 7682 8922
0753 2108 3530 4795 6176 7693 9040
0771 2218 3605 5133 6210 7717 9311
0814 2368 3758 5295 6217 7800 9717
0857 2525 3847 5352 6267 7855 9856
0894 2580 3879 5435 6312 7948
0921 2712 3898 5679 6551 8028
0953 2814 3969 5698 6677 8046
1157 2850 3975 5771 6747 8271
1212 2978 3979 5776 6808 8359

DAY - DEAR SERIES Dr No:189
1st Prize Rs.100000/- 959111
2nd Prize Rs.7000/- 12060
3rd Prize Rs.3500/-
07188 37751 53137 68038 70741
84357 87446 98310 98798 99402
4th Prize Rs.200/-
0522 2044 2957 3200 4127 5710 7704
9105 9575 9822
5th Prize Rs.100/-
2014 3098 3682 3886 4255 6106 8342
8616 8680 9887
6th Prize Rs.50/-
0256 2133 3668 5401 5925 7293 8456
0334 2148 3778 5415 5931 7402 8566
0346 2212 3793 5491 6033 7527 8905
0363 2221 3847 5583 6038 7833 9283
0427 2268 3984 5589 6094 7880 9458
0711 2553 4029 5596 6250 7933 9698
0825 2761 4108 5597 6296 7991 9722
0928 2774 4279 5646 6371 8104 9840
0972 3144 4414 5699 6468 8237 9845
1063 3208 4649 5709 6561 8240 9995
1219 3215 4710 5796 6713 8244
1671 3227 4864 5819 6730 8305
1734 3235 4873 5820 6854 8320
1772 3311 5259 5845 6881 8358
1779 3401 5324 5850 6905 8416

THANGAM VAIRAM EFFORT SUNDAY
DrawDate on:04/06/23

DAY - THANGAM SERIES Dr No:189
1st Prize Rs.100000/- 325649
2nd Prize Rs.7000/- 22069
3rd Prize Rs.3500/-
05491 08182 13903 14698 39435
41841 48883 63714 74359 82207
4th Prize Rs.200/-
0311 0338 1320 1856 1990 2438 3454
6255 6486 7040
5th Prize Rs.100/-
0765 1287 2457 2590 4448 5910 6321
7172 7563 8193
6th Prize Rs.50/-
0039 1239 2377 3662 5174 6803 8462
0051 1355 2401 3664 5311 6845 8509
0299 1416 2500 3742 5331 6924 8511
0362 1515 2645 3882 5434 6949 8781
0371 1519 2756 3883 5523 6966 9012
0590 1560 2785 4180 5589 6967 9025
0764 1575 2825 4210 5841 6978 9174
0813 1640 2882 4340 6105 6994 9203
0877 1648 2910 4424 6115 7010 9260
0910 1677 3037 4503 6129 7173 9963
1041 1690 3150 4654 6151 7274
1111 1756 3206 4669 6180 7331
1113 2090 3428 4784 6353 7528
1163 2175 3539 4934 6449 8142
1195 2282 3648 5117 6526 8208

DAY - VAIRAM SERIES Dr No:48
1st Prize Rs.50000/- 132437
2nd Prize Rs.7000/- 03489
3rd Prize Rs.3500/-
03744 14118 22061 31706 43539
52075 54915 78528 96199 98729
4th Prize Rs.200/-
0170 0921 1056 1830 1962 2439 6310
9224 9476 9583
5th Prize Rs.100/-
1102 2755 2871 3219 3620 4360 5446
6681 7260 9793
6th Prize Rs.50/-
0304 1754 3119 4831 6334 7588 9523
0327 1854 3161 4937 6343 7787 9571
0547 1882 3211 4958 6351 7967 9572
0630 1909 3333 5120 6449 8100 9593
0743 1965 3366 5146 6500 8224 9666
0760 2238 3550 5177 6606 8293 9794
0794 2330 4196 5185 6661 8339 9860
0847 2338 4201 5237 6742 8342 9865
0933 2349 4331 5582 6754 8466 9930
1135 2420 4496 5627 6770 8613 9984
1268 2440 4537 5764 7044 8704
1449 2600 4694 6214 7199 8833
1586 2815 4723 6256 7212 9374
1654 2933 4727 6266 7253 9423
1747 3038 4765 6320 7282 9504

NALLANERAM MANI EFFORT SUNDAY
DrawDate on:04/06/23

DAY - NALLANERAM SERIES Dr No:189
1st Prize Rs.50000/- 719817
2nd Prize Rs.7000/- 71635
3rd Prize Rs.3500/-
38401 51280 57186 59756 75295
77782 85094 85536 94047 98374
4th Prize Rs.200/-
0543 0665 1019 1279 3710 4429 4756
5564 6369 9515
5th Prize Rs.100/-
0103 0646 1223 4157 4896 5158 5513
5601 7662 7992
6th Prize Rs.50/-
0044 1686 2902 4259 5859 7419 8568
0051 1720 2918 4342 5885 7603 8840
0108 1864 3214 4391 5921 7650 8877
0184 1982 3424 4447 5981 7691 9063
0395 2052 3523 4588 6192 7695 9168
0412 2183 3551 4797 6255 7712 9405
0433 2230 3566 4970 6349 7828 9444
0449 2234 3629 5212 6486 7923 9715
0860 2386 3677 5249 6592 8198 9788
1083 2491 3725 5257 6608 8281 9932
1100 2634 3773 5280 6707 8304
1142 2689 3930 5535 7078 8383
1159 2692 3996 5697 7090 8404
1337 2767 4123 5795 7196 8449
1456 2899 4237 5819 7229 8515

DAY - MANI SERIES Dr No:48
1st Prize Rs.50000/- 536639
2nd Prize Rs.7000/- 81157
3rd Prize Rs.3500/-
05331 46350 48300 54310 60675
71796 78467 80061 89328 97776
4th Prize Rs.200/-
2109 2257 2712 3469 5660 7150 8416
9120 9497 9531
5th Prize Rs.100/-
0500 3321 4023 4407 4447 4887 6722
8039 8565 9659
6th Prize Rs.50/-
0110 1780 3386 4607 6240 7638 8908
0117 1811 3392 4629 6312 7686 8913
0137 1959 3400 4660 6421 7810 8978
0234 1996 3402 4667 6485 7811 9005
0394 2044 3595 4709 6685 7910 9012
0410 2417 3618 4717 6758 8333 9073
0498 2564 3720 4800 6812 8392 9087
0549 2642 3795 4932 6815 8393 9098
1009 2751 3982 5044 6875 8494 9213
1276 2783 4017 5476 7096 8514 9866
1372 2806 4106 5483 7104 8543
1382 2881 4137 5594 7373 8728
1581 3064 4194 5626 7470 8739
1614 3075 4239 5657 7509 8800
1735 3105 4600 6013 7599 8872

KUMARAN VISHNU THUNDER SUNDAY
DrawDate on:04/06/23

DAY - KUMARAN SERIES Dr No:189
1st Prize Rs.50000/- 252927
2nd Prize Rs.7000/- 42181
3rd Prize Rs.3500/-
09473 16647 32625 50731 64060
69820 84374 84687 87236 87244
4th Prize Rs.200/-
2040 2493 3118 3403 3634 3687 4322
4787 5808 7328
5th Prize Rs.100/-
0268 0377 0396 2523 3079 5106 6100
6664 7629 9748
6th Prize Rs.50/-
0265 1366 2634 4326 5926 7241 9418
0308 1462 2855 4431 6017 7278 9433
0330 1669 2994 4505 6123 7361 9437
0428 1772 3362 4512 6287 7478 9477
0469 1842 3637 4612 6305 7497 9513
0497 1966 3650 4940 6389 7574 9515
0641 1977 3740 4967 6397 7576 9521
0642 2018 3802 5097 6409 7584 9620
0683 2026 3846 5465 6410 7855 9705
0832 2146 3905 5501 6640 7927 9889
0838 2319 3916 5584 6678 8377
0893 2414 4103 5646 6708 8399
1100 2428 4176 5769 6719 8617
1216 2475 4282 5903 6993 8688
1233 2619 4302 5916 7211 9372

DAY - VISHNU SERIES Dr No:189
1st Prize Rs.50000/- 963313
2nd Prize Rs.7000/- 54749
3rd Prize Rs.3500/-
02537 10900 30540 44719 45973
64592 72565 74763 89860 98046
4th Prize Rs.200/-
0973 1770 3338 3468 3524 4369 4944
7873 9156 9576
5th Prize Rs.100/-
1895 2593 2868 4635 4793 4923 5528
7195 8352 9478
6th Prize Rs.50/-
0102 1458 2656 3792 5381 7580 9265
0107 1504 2802 3902 5915 7746 9342
0275 1569 2827 3948 5921 7782 9524
0575 1797 2906 3977 6156 7835 9619
0751 1877 3136 4075 6160 7923 9649
0787 1909 3166 4352 6192 7995 9693
0879 1932 3264 4363 6234 8074 9748
0902 1938 3280 4422 6604 8269 9851
1052 1964 3288 4444 6616 8443 9970
1140 2220 3330 4453 7002 8534 9978
1179 2257 3493 4476 7160 8583
1187 2267 3529 4588 7182 8750
1263 2278 3583 4669 7263 9018
1293 2570 3592 5094 7330 9088
1393 2644 3740 5168 7472 9129

SWARNALAXMI LION RUBY SUNDAY
DrawDate on:04/06/23

SWARNALAXMI SERIES Dr No:189
1st Prize Rs.50000/- 241202
2nd Prize Rs.7000/- 63131
3rd Prize Rs.3500/-
17634 28208 28997 39357 52531
63438 74645 85133 85819 96411
4th Prize Rs.200/-
0788 3362 4812 5389 7783 7855 7883
8705 9487 9978
5th Prize Rs.100/-
0431 0834 3021 3470 3663 6492 7415
7589 8011 9645
6th Prize Rs.50/-
0542 2423 3533 4554 5853 6970 8908
0708 2597 3568 4664 5994 7263 9037
0782 2759 3575 4719 6069 7295 9052
0803 2761 3707 4777 6092 7302 9267
0821 2777 3812 4840 6108 7335 9285
1041 2816 3839 4876 6206 7350 9348
1103 2915 3848 4900 6349 7370 9367
1143 2947 3855 5127 6381 7488 9381
1163 3062 4007 5257 6559 7813 9532
1512 3129 4026 5579 6576 7906 9557
1622 3198 4096 5610 6714 8094
1658 3245 4124 5664 6748 8180
1852 3330 4246 5733 6752 8195
2069 3348 4364 5736 6796 8428
2070 3459 4525 5760 6952 8518

DAY - LION SERIES Dr No:48
1st Prize Rs.50000/- 816818
2nd Prize Rs.7000/- 27746
3rd Prize Rs.3500/-
16427 27305 38299 49274 51655
62292 62911 73196 84825 95489
4th Prize Rs.200/-
0115 1359 1995 2189 3260 5639 6043
8341 8823 9165
5th Prize Rs.100/-
0793 1028 1166 4843 5960 6957 8926
9324 9606 9909
6th Prize Rs.50/-
0127 1471 2932 3790 5526 7355 9194
0146 1688 2993 3879 5538 7740 9231
0270 1717 3054 3941 5584 8069 9250
0282 1756 3056 3986 5740 8122 9273
0346 1782 3080 3990 5936 8421 9302
0401 1968 3215 4321 6018 8424 9414
0466 2081 3300 4332 6021 8448 9544
0658 2094 3337 4382 6410 8454 9554
0690 2216 3420 4536 6461 8504 9638
0799 2299 3544 4601 6803 8547 9642
0966 2483 3554 4850 6856 8691
1055 2734 3575 4975 6993 8755
1168 2750 3588 5138 7022 8796
1275 2801 3637 5177 7263 9048
1462 2882 3707 5451 7336 9151

# మండుటెండలో జోరువాన

≫ దుర్గం, హైటెక్ సిటీ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. కాగా తెలంగాణలో మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం అక్కడక్కడా పడే వీలుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే పరిస్థితి ఉందని తెలిపింది. ఆవర్తనం ఆదివారం దక్షిణ చత్తీస్‌గఢ్, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టం నుండి 1.5 కిలో మీటర్ల ఎత్తు వరకూ కొనసాగుతోంది. ఇది దక్షిణ చత్తీస్‌గఢ్ నుండి తెలంగాణ, రాయలసీమ మీదుగా తమిళనాడు వరకూ సగటు సముద్ర మట్టం నుండి 0.9 కిలో మీటర్ల ఎత్తు వద్ద కొనసాగుతోంది.
దీంతో రానున్న నాలుగు రోజులు వాతావరణం ఎలా ఉంటుందన్న వివరాలను వాతావరణ కేంద్రం డైరక్టర్ డాక్టర్ నాగరత్న వెల్లడించారు. రాష్ట్రంలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్‌ను ప్రకటించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. మంగళవారం తెలంగాణలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. రాగల 7 రోజులు తెలంగాణ రాష్ట్రం అంతటా గరిష్ట ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుండి 44 డిగ్రీల వరకూ స్థిరంగా నమోదు అయ్యే పరిస్థితి ఉందని తెలిపారు.

# జులైలో రైతు బంధు!

≫ సందేహాస్పదంగా మిగిలింది.
కాగా ఇప్పటికీ రైతు బంధు పొందని రైతులు దీని కోసం దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. వానాకాలం సీజన్ కోసం రైతు బంధు పెట్టుబడి సాయం నిమిత్తం కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన వారితో పాటు, ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకోని రైతులు సంబంధిత మండల వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఇంకా నిర్ణయించ లేదు. అయితే రైతులు మాత్రం ఆలస్యం చేయకుండా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొంటున్నారు. పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాకు సంబంధించిన జిరాక్స్ కాపీలు తీసుకుని పని దినాల్లో మండల విస్తరణ అధికారుల వద్ద రైతులు దరఖాస్తులు చేసుకోవాలని వెల్లడిస్తున్నారు. మరోపక్క వానాకాలం సీజనులో రైతు బంధు కోసం ఆర్థిక శాఖ నిధులను సమీకరించే పనిలో నిమగ్నమైంది. ప్రతీ సీజనులో రైతు బంధు పథకం నిమిత్తం 7,500 కోట్ల రూపాయల మేర అవసరం ఉంటోంది. ఈ వానాకాలం సీజనుకు సంబంధించి రైతు బంధు నిధుల విడుదలపై ప్రభుత్వం నుండి ఆదేశాలు రాగానే అందుకు అనుగుణంగా నిధులను సిద్ధం చేస్తోంది. గతం నుండి అమలు చేస్తున్నట్లుగానే తొలి రోజు ఒక ఎకరం, మర్నాడు రెండు ఎకరాలు, తర్వాత మూడు, ఇలా వరుసగా 25 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న రైతులకు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనుంది.

# ప్రజల ఎదురు చూపు

≫ న్నారు. ఇచ్చిన హామీలను నేరవేర్చామని, ప్రజా ప్రతినిధులను, పాలకులను కోరగా మమ్మల్నే ప్రశ్నిస్తారా అంటూ యువకులు, ప్రజలపై పోలీసులతో లాఠీ చార్జ్ చేయించి భయభ్రాంతులకు గురి చేసి పాలన కొనసాగించడం ప్రజాస్వామ్యమా అని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఓట్లేసి గెలిపించిన ప్రజలకు సేవలు అందించాల్సిన పాలకులు పెత్తందారులా ప్రవర్తిస్తూ ప్రజలను తమ బానిసలుగా చూస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ లక్ష్యాలను నేరవేర్చకుండా విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న ఆగ్రహాన్ని పీపుల్స్ మార్చ్‌పాదయాత్ర ద్వారా ప్రజలు బయటకు వెళ్లగక్కుతున్నారన్నారు. కులమతాలకతీతంగా బీఆర్ఎస్ ప్రభుత్వ బాధితులు ఏకమై మార్పు కావాలని కోరుకుంటున్నారని ఆయన అన్నారు. పెత్తందారుల పాలనలో అణిచివేతకు గురవుతున్న ప్రజలు తిరుగుబాటు చేసి ప్రజాస్వామ్యాన్ని తెచ్చుకోవడానికి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని 100 సీట్లలో గెలిపించడానికి సిద్ధమయ్యారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో పోలీసుల రాజ్యం నడుస్తుందని, ప్రశ్నించే అవకాశం లేకుండా స్వేచ్ఛను హరిస్తూ ప్రశ్నించే గొంతుకుల పట్ల పోలీసులు, రెవెన్యూ శాఖల వేధింపులు పెరిగిపోయాయని, ఇలాంటి దుర్మార్గమైన పాలన తెలంగాణలో అవసరమా అని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో సంక్షేమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన కెసిఆర్ ఐటీడీఎ ప్రాజెక్టు అధికారి లేకపోవడంతో రూ.1.50కోట్లు వెనక్కి వెళ్లాయని ఆయన పేర్కొన్నారు. నేటికి కాంగ్రెస్‌పాలనలో పేదలకు ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లను అగ్గిపెట్టెలే అని ఎద్దేవా చేసిన కెసిఆర్ హౌసింగ్ కార్పొరేషన్‌ను ఎత్తివేయడమేమిటని ప్రశ్నించారు. చెన్నకేశవ, ఉమా మహేశ్వర ప్రాజెక్టులను గతంలో నిధులు ఇచ్చామని సూచించి, ఇటీవల క్యాబినెట్ ఆమోదం పొందిందని చెప్పడం విడ్డూరంగా మారిందన్నారు. క్యాబినెట్ ఆమోదం పొందినటువంటి మార్కండేయ ప్రాజెక్టు, కొడంగల్ ప్రాజెక్టు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, 3 ఎకరాల భూమి, ఎస్టీ రిజర్వేషన్, మైనార్టీ రిజర్వేషన్లు అమలవుతున్నాయా అని ఆయన ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నరకాసురుడిలా ప్రవర్తిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ అందినకాడికి దోచుకుంటున్న ఎమ్మెల్యేను ఈ ప్రాంతం నుంచి తరిమికొట్టేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మల్లురవి, డిసిసి జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, నాయకులు తదితరులు ఉన్నారు

## వారం - వర్జ్యం

**5-6-2023 సోమవారం**
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయనం
జ్యేష్ఠ మాసం, కృష్ణ పక్షం, కార్తి రోహిణి
పాడ్యమి ఉ.07-27 త.విదియ తె.05-35
మూల తె.03-23
వర్జ్యం రా.01-51 ల 03-23
రా.కా.ఉ.7-30 - 9-00 వ
యమగండం ఉ.10-30 ల 12-00 వ
దుర్మహూర్తం మ.12-24 ల 1-12;
మ.2-48 ల 3-36 వ

## వార్తాఫలం

**మేషం:** మానసిక ప్రశాంతత లభిస్తుంది. కోర్టు సమస్యలు తీరుతాయి.

**వృషభం:** ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. ఆరోగ్యం బాగుంటుంది.

**మిథునం:** సామాన్య ధన లాభం. ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలనం.

**కర్కాటకం:** కుటుంబ సమస్యలు వేధిస్తాయి. రుణాలు చేస్తారు.

**సింహం:** రుణాలు తీరుస్తారు. ఉత్సాహంగా గడుస్తుంది.

**కన్య:** వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. ఆకస్మిక ప్రయాణం చేస్తారు.

**తుల:** ఆరోగ్య సమస్యలు తీరుతాయి. ప్రత్యర్థుల వ్యూహాలను ఎదుర్కొంటారు.

**వృశ్చికం:** ఖర్చులు అధికం. కుటుంబ సమస్యలు వేధిస్తాయి.

**ధనుస్సు:** రుణాలు తీరుస్తారు. ఉద్యోగ ప్రయత్నం ఫలిస్తుంది.

**మకరం:** విద్యార్థులకు విజయం. వృథా ఖర్చులుంటాయి.

**కుంభం:** రుణాలు తీర్చడంలో ఇబ్బందులు. వివాదాలకు దూరంగా ఉండండి.

**మీనం:** విద్యార్థులకు విజయం. ఉద్యోగులకు అధికారుల వత్తిడి అధికం.

- పాలకుర్తి సంతోష శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్

కోరమాండల్ ఎఫెక్ట్..

## ఒడిశా వైపు వెళ్లే రైళ్లు రద్దు

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని 9 రైళ్లను అధికారులు రద్దు చేశారు. ఒడిశా మీదగా ప్రయాణించే అన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలపడంతో ప్రత్యా మ్నాయ రైళ్ల కోసం ప్రయాణికులు ఎన్నో అవస్థలు పడ్డారు. రద్దైన రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్-శాలిమర్, సంత్రగచ్చి-తిరుపతి, హౌరా-ఎస్ఎంవిటి బెంగళూరు, శాలిమార్-ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, వాస్కోడ గామా-హౌరా ప్రాంతాలకు వెళ్లాల్సిన రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. మరోపక్క ఒడిశాలోని బాలాసోర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదం ప్రభావం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌పైన పడింది. ప్రమాదం నేపథ్యంలో ఒడిశా మీదుగా ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ విషయంలో ప్రయాణికులకు సరైన సమాచారం లేకపోవడంతో గందరగోళం ఏర్పడింది. ఏ రైలు రద్దు చేశారో..ఏ రైలు ఏ సమయానికి బయలుదేరుతుంతో తెలియని పరిస్థితుల్లో ప్రయాణికులు ఉన్నారు. దీంతో వారందరూ గందర గోళానికి గురయ్యారు. ఫలితంగా విపరీతమైన రద్దీ నెలకొంది. విచారణ కౌంటర్‌లో సంప్రదించినప్పటికీ సరైన సమాచారం లేకపోవడంతో ప్రయాణికులకు నిరాశే మిగిలింది. తమ గోడును వినేనాదుడే లేడా అంటూ మొరపెట్టుకున్నారు.

## మావోయిస్టు అగ్రనేత కటకం కన్నుమూత

### దండకారణ్యంలో గుండెపోటుతో మృతి

### సంస్మరణ సభలు నిర్వహించాలని కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పిలుపు

**చర్ల, ప్రభాతవార్త :** కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు) సెంట్రల్ కమిటీ, పొలిట్ బ్యూరో సీనియర్ సభ్యుడు కామ్రేడ్ ఆనంద్ అలియాస్ కటకం సుదర్శన్ మే 31,2023న మధ్యాహ్నం 12.20 గంటలకు దండకారణ్యంలోని గెరిల్లా మండలంలో తీవ్ర అనారోగ్యం, క్రానిక్ బ్రాంకైటిస్, డయాబెటిస్, మరిన్ని కారణలతో తుదిశ్వాస విడిచారని ఆ పార్టీ కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరిట ఆదివారం పత్రికలకు విడుదలైన లేఖలో పేర్కొన్నారు. రక్తపోటు సమస్యలతో బాధపడుతునూ చివరిగా అతను గుండె ఆగిపోవడం వల్ల బలిదానం చేశాడని, వందలాది మంది పార్టీ జనముక్తి గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) కార్యకర్తలు, నాయకులు, కమాండర్‌లు, ఆయన సంస్మరణ సభకు హాజరై విప్లవాత్మక లాంఛనాలతో అంత్యక్రియలు చేశారని తెలిపారు.



కటకం సుదర్శన్ (ఫైల్)

ఆయన బలిదానం పట్ల సీపీఐ(మావోయిస్టు) కేంద్ర కమిటీ తీవ్ర విచారం వ్యక్తం చేసిందని, వారికి విప్లవ జోహార్లు అర్పించారు. అతని జీవిత భాగస్వామి, అతని కుటుంబసభ్యులు, స్నేహితులకు సానుభూతి తెలియజేశారు. భారత విప్లవంలో ఆయన చేసిన కృషిని స్మరించుకోవడానికి జూన్ 5 నుండి ఆగష్టు 3 వరకు దేశవ్యాప్తంగా గ్రామాలు, నగరాలు, మెట్రోలు, పాఠశాల -కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, పారిశ్రామిక మరియు సేవా రంగాలలో సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. దేశప్రజలపై వారి బలిదానం మరింత ఉన్నతమైనదని, కామ్రేడ్ ఆనంద్ 69 సంవత్సరాల క్రితం బెల్లంపల్లి పట్టణంలోని ఒక కూలీ కుటుంబంలో జన్మించి గొప్ప నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాటాలు స్ఫూర్తితో 1974లో మైనింగ్ డిప్లమా విద్యార్థిగా విప్లవ పోరాటంలో అడుగుపెట్టారని 1974లో రాడికల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాడని, 1980లో అదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యుడిగా దండకారణ్య ప్రాంతాలలో విప్లవ పోరాటాన్ని విస్తృతం చేసేందుకు పార్టీ చేసిన కృషిలో పాల్గొన్నారని, ఇందులో భాగంగా జిల్లా గిరిజన రైతులు విప్లవోద్యమంలో ఉద్యమించారని ఆ తరువాత జిల్లా కమిటీ కార్యదర్శిగా ఉద్యమించారని పేర్కొన్నారు.

1995లో ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా బాధతలు చేపట్టారని అదే సంవత్సరంలో ఆల్ ఇండియా స్పెషల్ సెషన్ (ఏఐఎస్‌సీ) కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికైంది. 2001లో జరిగిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (పీపుల్స్ వారు) 9వ కాంగ్రెస్‌లో ఒకసారి కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికై పొలిట్ బ్యూరో సభ్యులుగా ఉన్నారని, ఈ తరువాత సెంట్రల్ రీజినల్ బ్యూరో కార్యదర్శి బాధ్యతలు స్వీకరించారని అన్నారు. ఈ విప్లవోద్యమంలో దీర్ఘకాలంలో ఆయన ఎన్నో ముఖ్యమైన బాధ్యతలు స్వీకరించి వాటిని సమర్థతతో నిర్వహించారని అన్నారు.

## రుతుపవనాల రాక ఆలస్యం

### వాతావరణ శాఖ వెల్లడి

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** దేశంలో నైరుతి రుతుపవనాలు రాక జాప్యం కానున్నాయి. మరో నాలుగు రోజుల పాటు ఆలస్యంగా కేరళను తాకే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి రుతుపవనాలు కేరళలో ప్రవేశిస్తాయి. అయితే ఈసారి కాస్త ఆలస్యంగా జూన్ 4వ తేదీ నాటికి కేరళకు చేరుకుంటాయని తొలుత వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే అది మరో నాలుగు రోజుల పాటు ఆలస్యం కానున్నాయి.

ఈ మేరకు నైరుతి రుతుపవనాల రాకపై తాజాగా ఆదివారం ఒక బులిటెన్ విడుదల చేసింది. రుతుపవనాల రాక ఆలస్యమైనా ఖరీఫ్ సీజన్‌తో పాటు, దేశ వ్యాప్తంగా వర్షపాతంపై ఎటువంటి ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది. దక్షిణ అరేబియా సముద్రం మీదుగా పశ్చిమ గాలులు పెరగనందున రుతుపవనాల కదలికకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ఆగ్నేయ అరేబియా సముద్రంలో మేఘావర్తనం పెరెగుతున్నందున వచ్చే మూడు, నాలుగు రోజులోలన రుతుపవనాలు కేరళను చేరడానికి అనుకూల పరిస్థితులు మెరుగుపడతాయని తేల్చిచెప్పింది.

# రాష్ట్రవ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సురక్ష దినోత్సవం

### ● హైదరాబాద్ సహా అన్ని పోలీసు విభాగాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదో యేట ప్రవేశించిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా జరుగుతున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రంలోని అన్ని పోలీసు విభాగాల్లో సురక్ష దినోత్సవం పేరిట ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా హైదరాబాద్ నగర పోలీసు విభాగం ఆధ్వర్యంలో ఉదయం నుండి రాత్రి వరకు పలు కార్యక్రమాలను నిర్వహించారు. మొదట ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సంజీవయ్య పార్క్ నుంచి చార్మినార్ వరకు పోలీసు గస్తీ వాహనాలు, బ్లూ కోల్ట్ వాహనాల ర్యాలీ నిర్వహించారు. హోంమంత్రి మహమూద్ అలీ ఈ ర్యాలీని ప్రారం భించగా ఇది సంజీవయ్య పార్క్, బుద్ధభవన్, అంబేద్కర్ విగ్రహం, లిబర్టి, బషీర్‌బాగ్, అబిడ్స్, మోజంజాహీమార్కెట్, అఫ్జల్‌గంజ్, మదీనా, గుల్జార్‌హౌజ్ మీదుగా చార్మినార్ వరకు సాగింది. ఈ ర్యాలీలో హోంమంత్రితోపాటు పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిజిపి అంజనీకుమార్, సిటీ కొత్వాల్‌ఆనంద్, సైబరాబాద్, రాచకొండ కొత్వాళ్లు స్టీఫెన్ రవీంద్ర, డిఎస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో గస్తీ పోలీసులతో పాటు ఫైర్ సర్వీస్ వాహనాలు, బ్లూ కోల్ట్ వాహనాలు ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా హోం మంత్రి మహమూద్ అలీ మా ట్లాడుతూ సిఎం కెసిఆర్ ముందుచూపుతోనే పోలీసు శాఖ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. శాంతి భద్రలకు సిఎం మొదటి నుంచి పెద్ద పీట వేశార ని, దీని కారణంగా నేడు రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి ఘటనలు లేకుండా వుందని తెలిపారు. కాగా అనంతరం తొమ్మిది గంటల సమయంలో ట్యాంక్‌బండ్ వద్ద జరిగిన మరో కార్యక్రమంలో హోం మంత్రి జెండా ఎగురవేశారు. తిరుగు ప్రయాణంలో ర్యాలీ అదే మార్గంలో వెనక్కి వచ్చింది. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్, బుద్ధభవన్ మార్గాలలో ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ట్రాఫిక్‌ను నిలిపివేశారు. కాగా అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద పోలీసు విభాగం తరపున టెక్నాలజి ఎగ్జిబిషన్‌ను హోంమంత్రి మహమూద్ అలీ ప్రారం భించారు. పోలీసు శాఖ ఉపయోగిస్తున్న టెక్నాలజీని ఇందులో ప్రదర్శించారు. దీని తరువాత ట్యాం క్‌బండ్‌పై మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటలకు కార్నివాల్ జరిగింది. ఈ కార్యక్రమంలో డిజిపి అంజనీ కుమార్, కొత్వాల్ ఆనంద్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్యాం క్‌బండ్‌పై ట్రాఫిక్‌ను నిలిపివేయడంతో పాటు ఆ మార్గంలో వెళ్లే వాహనాలను ఇతర మార్గాల గుండా మళ్లించారు. కాగా దీని తరువాత రాత్రి పది గంటల నుంచి 11 గంటల వరకు మోజంజాహీ మార్కెట్ నుంచి చార్మినార్ వరకు అఫ్జల్‌గంజ్, మదీనా మీదుగా చార్మినార్ వరకు పోలీసుల ఆధర్యంలో ఫుట్ మార్చ్ పేరిట పాద యాత్ర జరిగింది. కాగా సైబరాబాద్‌లో కేబుల్ బ్రిడ్జిపై రాత్రి ఏడున్నర గంటలకు డ్రోన్‌షో నిర్వహించారు. సైబరాబాద్, రాచకొండ సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, కమిషనరేట్లలోనూ సురక్ష దినోత్సవం ఘనంగా జరిగింది.



ఆదివారం పోలీసు విభాగాల్లో సురక్ష దినోత్సవంలో భాగంగా ట్యాంక్‌బండ్‌పై బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్‌అలీ. చిత్రంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, డిజిపి అంజనీకుమార్, మేయర్ విజయలక్ష్మి, కొత్వాల్ సివి ఆనంద్ తదితరులు

## మోడీ ప్రధాని అయ్యాకే జి-20లో భారత్‌కు అధిక ప్రాధాన్యత

### ● హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), జూన్ 4, ప్రభాతవార్త:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులు పాల్గొనే జి-20 సదస్సులో మన దేశ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియ జేయాలని దేశం కీర్తి ప్రతిష్టలు దశదిశలా వ్యాప్తిస్తుందని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలియజేశారు. యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్‌మే) కేంద్ర ప్రభుత్వ శిక్షణా సంస్థ ఆడిటోరియంలో ఆదివారం భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) ఆధ్వర్యంలో చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన దత్తాత్రేయ మాట్లాడుతూ గతంలో జి-20లో మనదేశానికి ఎలాంటి ప్రాధాన్యత ఉండేది కాదని, అయితే నరేంద్రమోడీ ప్రధాని అయ్యాక దానికి జి-20లో అధిక ప్రాధాన్యత పెరిగిందన్నారు. త్వరలో జరిగే సదస్సులో ఎల్20 తమ సమస్యలను తెలియజేస్తుందని దీనికి బీఎంఎస్ అధ్యక్షత వహించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. అసంఘటిత రంగాల్లో ఉన్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తాను కేంద్ర మంత్రిగా ఉన్నపుడే అనేక మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. దేశంలో 93శాతం అసంఘటిత రంగాల్లో ఉన్నారని కేవలం 7శాతం మాత్రమే సంఘటిత రంగాలో ఉన్నారని ఈ 93 శాతం కార్మికులకు సామాజిక భద్రత లేదని, వాటిని కల్పించడానికే బీజేపి ప్రభుత్వ హాయాంలో ప్రత్యేక కార్మిక శాఖ ఏర్పాటు చేసి ఆదుకుంటున్నామన్నారు. కార్మికులకు కేంద్రం అమలు చేస్తున్న విధానా లను కొన్ని రాష్ట్రాల్లో అమలు జరగడం లేదని, తప్పనిసరిగా వాటిని రాష్ట్రాలు అమలు చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా నేడు ప్రపంచంలో సాంకేతిక రంగంలో పోటీ తత్వం పెరిగిపోయిందని, మన దేశ యువత కూడా అందులో పోటీదారఉలుగా ఉండాలని చెప్పారు. మన సాంకేతిక పరిజ్ఞానాన్ని జీ 20 సమ్మిట్‌లో బహిర్గతం చేయాల న్నారు. మనలో ఉన్న స్కిల్స్‌ను బహిర్గతం చేసినప్పుడే మనకు గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కాగా ఎల్20 సదస్సులో మనదేశంలో అమలుజేసి తెలియజేయాలని వాటిని ఇతర దేశాలు కూడా అమలు చేసే విధంగా ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేంద్రన్, రీసోర్స్ ఇన్‌పుట్స్ సంస్థ ఎండీ రామచంద్రరావు, బివసీడబ్ల్యుడబ్ల్యుబీ సీఈఓ గంగాధర్, ఎస్ఎన్‌బీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, టిఎన్‌టీయుని అధ్యక్షులు ఎంకె బోస్, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రామారావు, బీంరెడ్డి, రూపా చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం యూసుఫ్‌గూడ నిమ్స్‌మేలో నిర్వహించిన చర్చావేదికను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు

## భారీగా తగ్గిన ఎరువుల ధరలు

### ఖరీఫ్ రైతులకు ఊరట

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** ప్రస్తుతం వ్యవసాయం భారం అవుతున్న తరుణంలో రైతులకు ఊరటనిచ్చేల ఎరువు ధరలను తగ్గిసూనకేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎరువుల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాల ధరలు తగ్గడంతో ప్రధానంగా కాంప్లెక్సు ఎరువుల ధరలు తగ్గాయి. ఈ మేరకు కేంద్ర ఎరువులు, రసాయన మంత్రిత్వ శాఖ ఎరువుల ఉత్పత్తి కంపెనీలతో సంప్రదింపులు జరిపింది. ముడి పదార్థాలు తగ్గిన నేపథ్యంలో ఎరువుల ధరలను తగ్గించాలని చేసిన విజ్ఞప్తి మేరకు కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. దీంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా తగ్గనున్నాయి. దీనికి సంబంధించి తగ్గించిన ధరలకే రైతులకు ఎరువులను విక్రయించాలని ఆయా కంపెనీలు డీలర్లకు సమాచారం ఇచ్చాయి. కాంప్లెక్స్ ఎరువులైన సీఐఎల్ 20-20-0-13 ధర ఇప్పటి వరకూ 1,350 రూపాయలు ఉండగా, ఇది 150 రూపాయలు తగ్గి 1,200 రూపాయలు అయింది. ఇదే రీతిలో అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గాయి. దీంతో ఫ్యాక్ట్ 20-20-0-13 ఎరువు 1,390 రూపాయలు ఉండగా, అది 1,225 రూపాయలు, అమ్మోనియం సల్ఫేట్ 1,100 రూపాయలు ఉండగా అది 1,000 రూపాయలకు, స్పిక్ 20-20-0-13 ధర 1,375 రూపాయలు ఉండగా అది 1,275 రూపాయలకు, డ్రై అమ్మోనియమ్ ఫాస్ఫేట్ (డీఏపీ) 1,350 రూపాయలు ఉండగా దాన్ని 1,350 రూపాయలు, సీఐఎల్ 20 -20-0-13 ధర 1,350 రూపాయలు ఉండగా అది 1,200 రూపాయలు, సీఐఎల్ 28-28-0 ఎరువుల ధర ఇప్పటి వరకూ 1.700 రూపాయల ఉండగా అది 1,500 రూపాయలకు తగ్గింది.

## అమెరికాలో నిజామాబాద్ జిల్లా వాసి సజీవ దహనం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 4:** అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా వాసి సజీవదహనం పట్ల బిఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల గుప్తా దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. శనివారం న్యూజెర్సీలో రోడ్డు ప్రమాదం జరిగి భీమ్‌గల్ మండలం బడాభీమగల్ గ్రామానికి చెందిన గుర్రపు శైలేష్(21) అనే యువకుడు సజీవ దహనమయ్యాడు.

ఈ ఘటన విచారకరమని మహేష్ బిగాల అన్నారు. శైలేష్ మృత దేహాన్ని ఇండియాకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. ఇండియన్ కాన్సులేట్ అధికారులు, తానా సభ్యులు లక్ష్మీదేవి, చిట్టిబాబు, తెలంగాణ ఎన్ఆర్ఐ డిపార్ట్‌మెంట్ వారితో ఎప్పుటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు. శైలేష్ మరణం కుటుంబ సభ్యులకే కాకుండా అందరిని కలిచి వేసిందని అన్నారు. వారాంతం సెలవు దినం కావడంతో మృత దేహాన్ని పంపించే ఏర్పాట్లలో కొంత జాప్యం ఏర్పడుతుందని తెలిపారు. శైలేష్ మృత దేహాన్ని స్వస్థలానికి తెప్పించేందుకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. భీంగల్ ఎంపీపీ మహేశ్, సర్పంచ్ సంజీవ్‌తో సమన్వయం చేసుకుంటున్నామని మహేశ్ వెల్లడించారు.

టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీక్ స్కాం..

## సిట్ కస్టడీకి ఇడి రమేష్ సహా ఐదుగురు నిందితులు

**హైదరాబాద్, (సైదాబాద్) జూన్ 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) పేపర్ లీక్ స్కాంలో కీలక నేరగాడుగా తేలిన వి ద్యుత్ విభాగం డీఈ రమేష్ సహా ఐదుగురు నిందితులను సిట్ అధికారులు ఆదివారం నాడు కస్టడీలోకి తీసుకున్నారు. ఈ స్కాంలో సురేష్ అనే వ్యక్తి ద్వారా ఏఈఈ, డీఎఓ ప్రశ్నా పత్రాలను ఖరీదు చేసిన డీఈ రమేష్ వాటిని తనకు తెలిసిన వ్యక్తులకు కోటి రూపాయలకు పైగా అమ్మడం తెలిసిందే. ఈ స్కాంలో రమేష్ పాత్ర ఆలస్యం గా వెలుగు చూడడం విదితమే. దీంతో రమేష్‌ను గత వారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఇదే సమయంలో రమేష్ ఇచ్చిన ప్రశ్నా పత్రంతో ఏఈఈ, డిఎఓ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన శ్రీను నాయక్, మహేష్, ప్రశాంత్, నరేష్‌లను కూడా సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. వీరిని ఆదివారం నుంచి ఆరు రోజుల పాటు విచారించనున్నారు.

## కోరమాండల్ మృతుల బీమా సెటిల్మెంట్‌లో మినహాయింపులు

### జీవిత బీమా సంస్థ చైర్మన్ మొహంతి

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త :** ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో బాధితుల సంఖ్య భారీ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ రంగంలోని జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) కీలక ప్రకటన చేసింది. ఒడిస్సా రైలు ప్రమాద బాధితులకు పాలసీ క్లెయిమ్ సెటిల్మెంట్ ప్రక్రియలో కొన్ని మినహాయింపులు కల్పించాలని నిర్ణయించనిట్లు ఆ సంస్థ చైర్మన్ సిద్ధార్థ మొహంతీ ప్రకటించారు. బాధితుల బంధువులకు ఈ ప్రత్యేక రిలీఫ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. బాలాసోర్‌లో జరిగిన రైలు దుర్ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నామన్నారు. ప్రభావిత బాధితులకు అండగా నిలవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న వారికి ఆర్థిక ఉపశమనం కల్పించడటంలో భాగంగా పాలసీ క్లెయిమ్ సెటిల్మెంట్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో జీవిత బీమా సంస్థ, ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాల క్లెయిమ్‌లో ఇబ్బందులు తగ్గించేందుకు పాలు రాయితీలను ప్రకటించింది. రిజిస్టర్డ్ డెత్ సర్టిఫికెట్ లేకపోయినా ఫర్వాలేదని, రైల్వే ప్రకటించిన జాబితా లేదా పోలీసులు, రాష్ట్రం, కేంద్రం అధికారులు ప్రకటించిన జాబితాల ఆధారంగా మరణాన్ని ధృవీకరించుకుంటామని వెల్లడించింది. బాధితుల సహాయార్థం, సందేహాల కోసం ప్రత్యేకంగా ఒక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. 022-68276827 నంబరుకు కాల్ చేయవచ్చని సూచించింది. క్లెయిమ్‌లను వీలైనంత త్వరితగతిన పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తామని పేర్కొంది.

## 215 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు

### రెండు సంస్థలతో పవర్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఎంఒయు

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త :** దీర్ఘకాలిక ప్రాతిపదికన 215 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు కోసం పవర్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రెండు వేర్వేరు సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. బ్రూక్‌ఫీల్డ్ రెన్యువబుల్స్‌తో 100 మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకోగా, 115 మెగావాట్ల థర్మల్ పవర్ కొనుగోలుకు వీఎస్ లిగ్నైట్‌తో మరో ఒప్పందం కుదిరిందని పవర్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎండీ రాజీబ్ కె మిశ్రా శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఈ రెండు ఒప్పందాలకు సంబంధించి దీర్ఘకాలిక ప్రాతిపదికన విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంటుందని చెప్పారు. తమ సంస్థ వివిధ గృహ వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కాగా పవర్ ట్రేడింద్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మూడవ త్రైమాసికంలో 3,107.04 కోట్ల రూపాయల మేర ఆదాయం ఉండగా, చివరి త్రైమాసికంలో అది 3,643.02 కోట్లకు పెరిగిందని వెల్లడించారు. ఏడాది పొడవునా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడం, పెరుగుదుదల వంటి అవకాశాలను అందిపుచ్చుకోవాలనే పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే 2023-24 ఆర్థిక సంవత్సరంలో పవర్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆదాయంలో బలమైన వృద్ధి రేటును సాధిస్తుందని పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా ఏప్రిల్ నెలలో వాణిజ్య పరిమాణంలో 33 శాతం పెరుగుదలను కార్పొరేషన్ నమోదు చేసిందన్నారు.

# ట్రాక్ ఫ్రాక్చర్లతో రైలు ప్రమాదాలు

### ● బోగీలు పట్టాలు తప్పడం రైల్వే శాఖకు ఓ సవాల్

### ● సెన్సార్ ఆటోమేటిక్ మెషీన్లు వినియోగంలోకి ఎప్పటికో?



**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** రైల్వే శాఖకు రైళ్ల పట్టాలు తప్పడం సవాల్‌గా మారుతోంది. దేశవ్యాప్తంగా ప్రతీయేటా జరుగుతున్న రైలు ప్రమాదాల్లో పట్టాలు తప్పడం వల్ల జరుగుతున్న దుర్ఘటనలే అధికంగా ఉండడం గమనార్హం. రైళ్ల పట్టాలు తప్పడానికి అనేక కారణాలున్నా ఇందులో ట్రాక్ ఫ్రాక్చర్ ప్రధాన కారణంగా చెప్పాలి. రైల్వే పరిభాషలో దీనినే రైల్ ఫ్రాక్చర్‌గా కూడా చెబుతారు. ఒడిశాలోని బాహానాగబజార్ స్టేషన్‌లో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ గూడ్స్ రైలును ఢీకొన్నట్లుగా జరిగే దుర్ఘటనలు, మానవ తప్పిదం వల్ల జరిగే ఘటనలు, ఇతర ఉదంతాల వల్ల జరిగే ప్రమాదాల కన్నా ట్రాక్ ఫ్రాక్చర్ వల్ల జరుగుతున్న ఘటనలే అధికమని జాతీయ నేర రికార్డు బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాలు చెబుతున్నాయి.

2018-21 కాలంలో దేశవ్యాప్తంగా జరిగిన రైలు ప్రమాదాల్లో ప్రతీ పదింటిలో ఏడు పట్టాలు తప్పడం వల్ల జరిగి నవి కాగా ఇందులో మెజారిటీ దుర్ఘటనలు రైలు పట్టాల్లో లోపాలు, నిర్వహణ సవ్యంగా లేకపోవడం వల్ల జరిగినవేనని ఎన్‌సిఆర్‌బి నివేదిక చెబుతోంది. దీని పరిష్కారానికి ఆస్ట్రేలియాలో మాదిరిగా సెన్సార్ ఆధారిత ఆటోమేటిక్ మెషీన్లను వాడడం మంచిదనే అభిప్రాయం రైల్వేశాఖలో చాలాకాలంగా ఉన్నా ఒక్క కొంకణ్ రైల్వేలో 600 కిలోమీటర్ల దూరంలోని మార్గంలోనే దీనిని అమలు చేస్తుండడం విశేషం. ఇతర రద్దీ మార్గాల్లో ఈ సాంకేతికను అమలుచేస్తే ట్రాక్ ఫ్రాక్చర్ సమస్యకు చెక్ పెట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఎన్‌సిఆర్‌బి గణాంకాల ప్రకారం 2021లో దేశవ్యాప్తంగా 18వేల రైలు ప్రమాదాలు జరగ్గా ఇందులో 16 వేల ఘటనలు పట్టాలు తప్పడం వల్లే జరిగాయి. ఈ ప్రమాదాలకు ఇతర కారణాలకన్నా ట్రాక్‌ఫ్రాక్చర్ ఎక్కువగా కారణమవుతోందని రైల్వే శాఖ అంతర్గత పరిశీలనలోనూ తేలింది. ధృడమైన ఇనుముతో తయారుచేసే పట్టాలకు అనేకచోట్ల వెల్డింగ్ ఉండడం, బోల్టులతో కలిపి వుండడం తెలిసిందే. పట్టాలపై గతంతో పోలిస్తే ప్రస్తుతం దాదాపు అన్నిచోట్ల పరిధికి మించిన సర్వీసులు నడుస్తున్నాయి. ఇదే సమయంలో రైళ్ల వేగం కూడా పెరిగింది. ఈ దృష్ట్యా రైలు పట్టాల జీవితకాలం తగ్గిపోతుందని నిపుణులు అంటున్నారు. గతంలో సగటున 30 యేళ్ల వరకు మన్నే పట్టాలు నేడు మారిన పరిస్థితుల ప్రకారం 20 యేళ్లు మన్నడమే గగనమని వారంటున్నారు. పట్టాలపై ప్రస్తుతం ఎక్కువ రైళ్లు వేగంగా పోతుండడం వల్ల అవి ఘర్షణకు లోనై పలుచోట్ల పగుళ్లు లేదా చీలికలకు గురవుతున్నాయని నిపుణులు అంటున్నారు. దీన్నే రైల్వేభాషలో ట్రాక్‌ఫ్రాక్చర్ లేదా రైల్ ఫ్రాక్చర్‌గా చెబుతుంటారు. అలాగే వాతావరణ పరిస్థితులను బట్టి వేసవిలో వ్యాకోచించడం, చలికాలంలో సంకోచించడం వల్ల కూడా ఫ్రాక్చర్లు ఏర్పడుతుంటాయని అంటున్నారు.

అయితే వీటిని ఎప్పటికప్పుడు గమనించి వెంటనే సరిచేయడం రైల్వే శాఖ ముందున్న పెద్ద సవాల్‌గా నిపుణులు అంటున్నారు. పట్టాలపై నిరంతరం గస్తీ తిరిగే గ్యాంగ్‌మెన్లు, ఇతర సిబ్బంది ఈ ఫ్రాక్చర్లను గమనించి వెంటనే సరి చేయాల్సి వుంటుంది. కొన్ని సందర్భాల్లో రైల్వే సిబ్బంది 24 గంటలు పట్టాలను పరిశీలిస్తూ పోయినా ఎక్కడో ఒకచోట తప్పిదం జరిగే అవకాశం వుంటుందని, ఈ తప్పిదమే రైలు పట్టాలు తప్పేందుకు ఆస్కారం కలుగుతుందంటున్నారు. ప్రతీయేటా అంతర్గత నివేదికలో ట్రాక్‌ఫ్రాక్చర్ గురించే ప్రధానంగా చర్చ సాగు తుంటుందని నిపుణులు చెబుతున్నారు. నిర్ణీతకాల గడువు ముగియగానే పట్టాలను మార్చడం, రైళ్ల వేగం, సర్వీసులను పరిగణనలోకి తీసుకుని మరింత నాణ్యమైన పట్టాలను వేయడం వంటివి చేయాలని వారు చెబుతున్నారు. నిధుల లేమి వల్ల చాలాచోట్ల కాలపరిమితి ముగిసినా పట్టాలను మార్చడం లేదనే విమర్శలు న్నాయి. కానీ రైల్వే శాఖ వద్ద తగినన్ని నిధులున్నా వాటిని సరిగ్గా ఖర్చు చేయడం లేదని 2018-21 కాగ్ నివేదిక తప్పు పట్టింది. ఈ మధ్య కాలంలో రైలు పట్టాలు తప్పిన ఘటనల్లో 26 శాతం ఉదంతాలు ట్రాక్‌ఫ్రాక్చర్ వల్ల జరిగినవేనని కాగ్ వెల్లడించడాన్ని నిపుణులు ఉదహరిస్తున్నారు. రైల్వే శాఖ ప్రస్తుతం అధునాతన టెక్నాలజీని వాడుతున్నా, పట్టాల సామర్థ్యం ఆశించినంతగా పెరగడంలేదని నిపుణుల వాదన. పట్టాల ఏర్పాటు, నిర్వహణ విషయంలో రైల్వే శాఖ మరింత దృష్టి సారించాలని వారు కోరుతున్నారు. కాగా 2000-06లో రైళ్ల పట్టాలు తప్పడం వల్ల రైల్వేకు కలిగిన నష్టం అక్షరాల రూ. 86 వేల 486 కోట్లు కావడం గమనార్హం. రైలు ప్రమాదాల్లో మెజారిటీ ఘటనలు పట్టాలు తప్పడం వల్ల జరుగుతుంటే ఇందులో ఎక్కువగా ట్రాక్ ఫ్రాక్చర్ వల్ల జరుగుతున్నవేనని నిపుణులు చెబుతున్నారు. దీనికి స్వస్తి పలకాలంటే ఆస్ట్రేలియాలో వున్న సెన్సార్ ఆధారిత ఆటోమేటిక్ మెషిన్ల వాడడం మంచిదని వారంటున్నారు. ఎన్‌సిఆర్‌బి గణాంకాల ప్రకారం 2021తో పోలిస్తే 2022లో రైలు ప్రమాదాలు 38.2 శాతం పెరిగాయి.

## ధాన్యం కొనుగోళ్లు పూర్తి

### 10వ తేదీకి కేంద్రాల మూసివేత

### ఇప్పటి వరకూ 54 లక్షల టన్నుల సేకరణ

### నేటి నుండి రైతులకు మరో విడత చెల్లింపులు

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త :** తెలంగాణలో యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తి అయింది. ధాన్యం కొనుగోలు లక్ష్యాలను చేరుకోవడంతో ఈ నెల 10 వతేదీ నాటికి కొనుగోలు కేంద్రాలను మూసి వేయాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. షెడ్యూలు ప్రకారం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన మిగిఇన బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీన రైతుల నుండి కొనుగోలు చేసిన వరి ధాన్యానికి గాను రాష్ట్ర ప్రభుత్వం 1,180 కోట్ల రూపాయల మేర చెల్లింపులు చేసింది. ఈ నెల 5వ తేదీ నుండి మరో విడత చెల్లింపులను జరపనుంది. ఈ మొత్తాలు నేరుగా ధాన్యం అమ్మిన రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తోంది. ధాన్యం కొనుగోలు నిమిత్తం రైతులకు సత్వర చెల్లింపు చేసేందుకు వనరులను సమీకరించుకునేందుకు వీలుగా తెలంగాణ సర్కార్ బ్యాంకు గ్యారెంటీలను సులభతరం చేసింది. కాగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ మార్కెటింగ్ సీజన్‌లో 7,100 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం 54 లక్షల టన్నులకు పైగా ధాన్యం మద్దతు ధరలకు కొనుగోలు చేసింది. యాసంగి సీజనుకు సంబంధించి 62 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసింది. ఇందులో ఇప్పటికే దాదాసే 54 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద నుండి సేకరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రధానమైన నల్లగొండ, సూర్యాపేట్ తదితర జిల్లాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావడంతో ఇప్పటికే 2,200 కొనుగోలు కేంద్రాలు మూసివేశారు. అయితే వికారాబాద్, భూపాలపల్లి తదితర జిల్లాల్లో రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకు వస్తుండటంతో ఆయా జిల్లాల్లో మరికొద్ది రోజుల వరకూ కొనుగోళ్లు జరిగే అవకాశాలు ఉన్నట్లు అధికవర్గాలు వెల్లడించాయి.

వార్త

కాగితం మీద రాసింది చెరపగలం కాని, మాటలను వెనక్కు తీసుకోలేం.

-హార్స్


# ప్రధాని మోడీకి రెడ్‌కార్పెట్!

ప్రపంచదేశాల్లో భారత్‌పట్ల ఉన్న చులకనభావం తొలగిపోతోంది. పెట్టుబడులకు ఇన్వెస్టర్లు, పారిశ్రామికవేత్తలు సైతం ముందుకువస్తున్నారు. ఏదేశానికయినా సరే ఆర్థిక వృద్ధి, ధరల అదుపు, ద్రవ్యోల్బణం కట్టడి, పన్నుల్లో రాయితీలు, విదేశీ ఇన్వెస్టర్లకు ప్రోత్సాహకాలు వంటివి ఎక్కువ చూస్తుంటాయి. అటు ఐరోపా కూటమి దేశాలయినా ఆసియా దేశాలయినా సరే ప్రపంచ దేశాల్లో ఇపుడు అత్యధికంగా భారత్ అంటే ఎంతో ఆసక్తి చూపిస్తున్నాయి. వివిధ దేశాల కూటమి సదస్సుల్లో భారత్‌ను విశిష్ట అతిథిగా ఆహ్వానించడం కూడా ఇటీవలికాలంలో మరింతగా పెరుగుతూ వస్తోంది. అదే కోవలో ఇపుడు భారతప్రధాని నరేంద్రమోడీ ఈనెల 22న అమెరికా పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అంతేకాకుండా ఆరోజు ఆదేశ అధ్యక్షుడు జోబైడెన్ శ్వేత సౌధంలో భారత ప్రధానమంత్రి గౌరవార్థం విందును కూడా ఇస్తున్నారు. ప్రధాని ఉభయసభల్లో ప్రసంగించాలని కోరుతూ ఇచ్చిన ఆహ్వానంలో ప్రతినిధులసభ స్పీకర్ కెవిన్ మెకార్తీ, సెనేట్ మెజార్టీ నేత చక్‌షుమ్మర్, సెనేట్ రిపబ్లికన్ నేత మిట్చ్ మెక్‌కాన్నెల్, ప్రతినిధుల సభ డెమొక్రాట్ నేత హాకీమ్ జెఫ్రీస్‌లు సంతకాలు చేసారు. అంటే ఉభయసభలనుద్దేశించి ఒక దేశ ప్రధానిని ప్రసంగించాలని అన్ని పార్టీలు సంయుక్తంగా కోరుకుంటున్నాయి. భారత్ ఆర్థిక స్థితిగతులు, సంస్కృతి సాంప్రదాయాలు, విభిన్న మతాలు, జాతులు, విభిన్న భాషల మేళవింపుతో ఆవిర్భవించిన అతిపెద్దప్రజాస్వామ్య దేశం. ఈదేశ భాషలు, సంస్కృతి సాంప్రదాయాలు విదేశీయులను ఎంతో ఆకర్షిస్తున్నాయి. ఆచరణకు సైతం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. ఈక్రమంలో భారత ప్రధానికి అగ్రరాజ్యం ఉభయసభల్లో ప్రసంగించాలని ఆహ్వానం అందడం అత్యంత అరుదైన గౌరవం అనే పరిగణించాలి. గతంలో బ్రిటన్‌ప్రధానమంత్రి విన్‌స్టన్ చర్చిల్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు నెల్సన్ మండేలా మరికొందరు ప్రపంచనాయకులు ఈ సభల్లో ప్రసంగించారు. అలాగే భారత్‌కు అమెరికాలో లభిస్తున్న ప్రాధాన్యతలను బట్టిచూస్తుంటే గతంలో ఆనాటి ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూ నుంచి పివి నరసింహారావు, అటల్ బిహారీ వాజ్‌పేయి,రాజీవ్‌గాంధీ, మన్మోహన్‌సింగ్‌లుసైతం పార్లమెంటు ఉభయసభల్లో ప్రసంగించారు. ప్రత్యేకించి పివి నరసింహారావు, మన్మోహన్‌సింగ్‌లు అయితే భారత్‌లో చేపట్టిన సరళీకృత ఆర్థిక సంస్కరణలపట్ల అమెరికా పార్లమెంటు ఎక్కువ ఆసక్తి చూపించింది.గతంలో భారత ప్రధానుల ప్రసంగాల్లో రాజీవ్ గాంధీ పిన్నవయస్కుడు కావడంతో ఆయనకు ప్రచారం పరంగా అత్యధిక ప్రాధాన్యం లభించింది. అదే తీరులో ఇపుడు ప్రధానిమోడీకి ఇటీవల జరిగిన జి7 దేశాల సదస్సుల్లోనూ, 14 ద్వీపకల్ప దేశాల సదస్సుల్లోనూ లభించిన ప్రాధాన్యం ప్రాచుర్యం చేస్తూ ప్రపంచ దేశాలు భారత్ సుస్థిర ఆర్థిక వృద్ధిపట్ల ఎక్కువ ఆసక్తిచూపుతున్నాయి. భారత్‌తో దోస్తీకి మరింతగా ఉవ్విళ్లూరుతున్నాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఇప్పటికే ఉగ్రవాదంపై ఉమ్మడిపోరుపరంగా అమెరికా భారత్‌తో కలిసి పనిచేస్తోంది మిత్రదేశాలను కూడా కలుపుకుంటూపోతోంది. ఇక అణుసరఫరా దేశాల కూటమిలో భారత్‌కు సభ్యత్వం కల్పించాలన్న డిమాండ్‌పై ఆనాటి అధ్యక్షుడు బరాక్ ఒబామానుంచి నేటివరకూ భారత్‌కు మద్దతు లభిస్తూనే ఉంది. అయినా కొన్ని దేశాలు అడ్డుకుంటుండటంతో పెండింగ్‌లో పడుతూవస్తోంది. ఇక ఆర్థిక విధివిధానాలు సాధించిన, సాధించాల్సిన లక్ష్యాలు వంటి వాటిని ప్రధాని ప్రస్తావించే అవకాశం ఉంది. పెట్టుబడులపరంగా జర్మనీ, జపాన్, ఫ్రాన్స్‌ల తర్వాత భారత్‌కు ఎక్కువగా అమెరికా నుంచే వస్తున్నాయి. రక్షణరంగపరంగా అమెరికా భారత్ సంబంధాలు ఎంతో పటిష్టంగా ఉన్నాయి. అంతేకాకుండా టెక్నాలజీపరంగా అమెరికా భారత్‌కు కీలకంగా మద్దతిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం బదలీ, ఉమ్మడి కార్యాచరణ కూడా కొనసాగుతోంది. ఇప్పటివరకూ ప్రసంగించిన భారత ప్రధానులు భారత్‌లో అమలవుతున్న భిన్నత్వంలో ఏకత్వంపైనే ప్రసంగించారు. ఇపుడు మోడీ తనకు ప్రధానంగా ఎదురవుతున్న మతవిద్వేషం, బలవంతపు మతమార్పిడి అంశాలపైన ప్రస్తావించే అవకాశాలు లేకపోలేదు. అలాగే సర్వమత సమానత్వం, స్వేచ్ఛ వంటి వాటికి ప్రాధాన్యం ఇస్తూ అమెరికాతో కొనసాగుతున్న ద్వైపాక్షిక సంబంధాలు, రక్షణరంగ సహకారం, వాణిజ్యం వంటి అంశాలు ప్రస్తావనకు తెస్తారని అంచనా. ఉభయ సభల ప్రసంగంతోపాటు భారత్ అమెరికా వాణిజ్య మండలిలో రెండుదేశాల పారిశ్రామికరంగ సిఇఒలతో కూడా సమావేశం అయ్యే మోడీ పర్యటనకు ఇపుడు అగ్రరాజ్యం ఎంతో ప్రాధాన్యతనిస్తోంది. ఇటీవలే జి7 సదస్సులో జోబైడెన్ ప్రధాని మోడీనుద్దేశించి చేసిన చమత్కారాలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. మీతోనే నాకు ఇపుడు చిక్కువచ్చింది. మీ పర్యటనకు సదస్సుకు హాజరయ్యేందుకు అనుమతులు కావాలంటూ లెక్కలేనంతమంది ఫోన్లు చేస్తున్నారు. విజ్ఞప్తులు చేస్తున్నారు. చూస్తుంటే నేను కూడా మీవద్ద ఆటోగ్రాఫ్ తీసుకోవల్సి వస్తోంది అంటూ చమత్కరించిన సందర్భం ఇపుడు అమెరికాలో ప్రధాని మోడీ పర్యటనకు ఇస్తున్న ప్రాధాన్యతను స్పష్టంచేస్తోంది. ప్రధాని కాకముందు మోడీకి వీసా నిరాకరించిన అగ్రరాజ్యం ఇపుడు ప్రధానిహోదాలో ఉభయసభలనుద్దేశించి ప్రసంగించాలని రెడ్‌కార్పెట్ వేస్తోంది. ఒకప్పుడు వీసా నిరాకరించి ఇపుడు ఉభయ సభల్లోప్రసంగానికి ఆహ్వానించిన భారత ప్రధాని బహుశా నరేంద్రమోడీ ఒక్కరే కావచ్చు. ప్రతికూలతలు ఎన్ని ఉన్నా భారత్‌కు ప్రపంచదేశాల్లో ఇనుమడిస్తున్న ప్రతిష్టకు ఇదొక నిదర్శనం అని చెప్పక తప్పదు.



ధర్మాత్ముడైన మనిషి మంచి గంధపు చెట్టు వంటివాడు. తనను నరికే గొడ్డలికి కూడా అది సువాసన ఇస్తుంది.


తులసీదాస్



ప్రతీకారాన్ని తీర్చుకుంటే ప్రతి వ్యక్తి తన శత్రువుతో సమానుడే. కాని దాన్ని వదులుకుంటే అతనికన్నా గొప్పవాడవుతాడు.

బేకన్

## ప్రజావాక్కు



### షిప్పింగ్ హార్బర్ నిర్మాణం

శ్రీకాకుళం జిల్లా ప్రజలు మత్స్యకారులు దాదాపు మూడున్నర దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న భావనపాడు షిప్పింగ్ హార్బర్ ఎట్టకేలకు నిర్మాణానికి నోచుకోబోతోందన్న వార్త నిజంగా ఒక శుభవార్త.సంతబొమ్మాళి మండలం భావనపాడు వద్ద షిప్పింగ్ హార్బర్ నిర్మాణానికి గత 30ఏళ్లుగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. 1996సంవత్సరంలో ఇక్కడ పనులకు శంకుస్థాపన కూడాజరిగినా పలు కారణాలవలన నిర్మాణం ముందుకు సాగలేదు.అయితే గతఎన్నికల్లో ఇచ్చినహామీకి అనుగుణంగా దాదాపు మూడువేల కోట్ల రూపాయలతో దీనిని నిర్మించేందుకు అదానీ కంపెనీతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అవగాహన కుదుర్చుకోవడం శుభపరిణామం.దీనిద్వారా జిల్లాలో పలు పరిశ్రమలకు సంబంధించిన ఎగుమతులు, దిగుమతులు సులభతరమవడమేకాకుండా మత్స్యకారులకు కూడా మత్స్యసంపదను ఇతర ప్రాంతాలకు పంపించుకునేందుకు వీలుంటుంది.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### నాయకత్వం అంటే..

ఇతరుల బాధ్యతను తనమీద వేసుకుని నడిపించే వాడే నాయకుడు. అటువంటి నాయకుడు ఎందరికో మార్గదర్శకుడవుతాడు. నేడు నాయకత్వ లక్షణాలు ఏ మాత్రం లేని చాలా మంది నాయకులుగా చెలామణి అవుతున్నారు. సమస్యలు ఎదురవగానే ఆవేశంతో ఊగిపోయేవారు నాయకులు కాలేరు. నాయకుడికి ఆత్మనిగ్రహం అవసరం. పదవి, హోదా కావాలి. బరువు, బాధ్యతలు వద్దుఅనేవారు నాయకులుకాలేరు. ఇది దిగజారుడు నాయకత్వానికి నిదర్శనంఅనిచెప్పవచ్చు. ఇలాంటి నాయకులు కాదు మనకి కావాల్సింది. భిన్నంగా ఆలోచిస్తూ, మంచి ప్రవర్తనకలిగి హుందాగా ప్రదర్శించగలిగిన నాయకత్వం అవసరం. ఆలోచనల్లో దార్శనీకత మాటల్లో సూటిదనం, నిర్ణయాల్లో పరిపక్వత, చర్చల్లో మేధావితనం వంటి లక్షణాలు ఉన్న వ్యక్తి విలక్షణ నాయకుడవుతాడు.

-కాయల నాగేంద్ర, హైదరాబాద్

### ప్రమోషన్‌లు ఇవ్వాలి!

ప్రభుత్వ పరిధిలోని చాలా శాఖలలో ఉద్యోగులు ప్రమోషన్‌ల కొరకుఎదురుచూస్తున్నారు. చాలామందికి ప్రమోషన్‌లు అందని ద్రాక్షగా తయారు అయింది. కొన్ని శాఖలలో ప్రమోషన్‌లు విరివిగా లభిస్తుంటే చాలా శాఖలలో ప్రమోషన్‌ల కొరకు సంవత్సరాల తరబడి ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ ప్రమోషన్‌ల కొరకు అర్హత కలిగిన వారి జాబితా తీసుకొని, ఉద్యోగులకు ప్రమోషన్‌లు కల్పిస్తే, ఉద్యోగులు సంతోషిస్తారు.

-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

### ఎన్నికల స్టంట్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్. ఇందుకోసం ఆ పార్టీ ఎంతో కష్టపడింది. ఎన్నో విమర్శలను ఎదుర్కొంది. చాలా మంది సీనియర్లను దూరం చేసుకొంది. ఎపిలో తీవ్రంగా నష్టపోయింది అయినా తెలంగాణలో ఆ పార్టీ అధికారాన్ని అందుకోలేకపోయింది. టిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చింది. వచ్చీ రావడంతోనే రాష్ట్రాన్ని అభివృద్ధిపరచడంపై దృష్టి పెట్టారు. కొద్దికాలంలోనే తెలంగాణ రూపురేఖల్ని మార్చివేశారు. ఆ పార్టీ నాయకులు అహర్నిశలు కష్టపడి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో ఉండేలా చేశారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసే ప్రయత్నంచేస్తున్నారు.ఏదోవిధంగా సాయపడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను గ్రాండ్‌గా జరుపుకుంటున్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌కు తెలంగాణను అభివృద్ధి చేసిన పార్టీగా టి.ఆర్.ఎస్‌కు దశాబ్ది ఉత్సవాలు జరుపుకునే హక్కు అర్హత ఉంటాయి.

-మిథునం, హైదరాబాద్

### కష్టాల్లో పాడి రైతులు!

రాష్ట్ర పశుసంవర్ధకశాఖలో గత అయిదు సంవత్సరాలుగా ఖాళీలు భర్తీ చేయడం లేదు. దానితో పశువైద్యం కుంటుపడింది. సమయానికి సరైన వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం చెల్లించాల్సిన పశువుల బీమా బకాయిలు రూ.200 కోట్లు దాటిపోయాయి. సహకార పాల డైరీలకు పాలు విక్రయించే రైతులకు లీటరుకు నాలుగు రూపాయల సబ్సిడీ ఇస్తామన్న హామీ అటకెక్కించారు. ఇలా ప్రతి హామీ విషయంలో ప్రజలను మోసం చేసి, అన్ని హామీలు నెరవేర్చామని బడాయి కబుర్లు చెబుతున్నారు.

-ఉప్పలపాటిరాజా, ఏలూరు జిల్లా

### వృద్ధులను అనుమతించాలి

హైదరాబాద్ నగరంలో అనేక ఉద్యానవనాలలో ఉదయం పది గంటలలోపు వరకు అనుమతిస్తున్నారు. ఆ తర్వాత అధికారులు అనుమతించడంలేదు. దీనివల్ల పెద్దవారికి వయోవృద్ధులకు చాలా ఇబ్బంది కరవవుతున్నది. వీరు ఉదయాన్నే లేచి రావడానికి వయసురీత్యా సాధ్యంకాదు.కనీసం వారికి పార్కుల్లో అనుమతి ఇస్తే 10-11 గంటల వరకు సూర్యుని వెలుతురు వల్ల ఆరోగ్యానికి ఎంతోమేలు కలుగుతుంది.శాస్త్రవేత్తల పరిశోధనలు సూర్యరశ్మి వలన మధ్యాహ్నం 12వరకు మన శరీరానికి విటమిన్‌డి ద్వారాఎంతో ఉపయోగకం కలుగుతుందని తెలియచేస్తున్నాయి. కావున అధికారులు వయోవృద్ధులను పది నుంచి పన్నెండు గంటల వరకు అనుమతించాలి.

-పొన్నాల నరహరి, హైదరాబాద్

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# సరిహద్దు వివాదాలకు పరిష్కారమెప్పుడు?

*నిజానికి ఎటువంటి సమస్యనైనా సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవచ్చు. కానీ కొన్ని రాజకీయ శక్తులకు సమస్య పరిష్కారం కావడంవల్ల కలిగే ప్రయోజనాలకంటే సమస్య కొనసాగడంవల్ల కలిగే ప్రయోజనం ఎక్కువగా ఉంటున్నాయి. ఆయా శక్తుల వెనుక ఉన్న రాజకీయ శక్తులను నివారించడం అవసరం. తమ రాజకీయ అవసరాల కోసమే విభజన అంశాలను, సరిహద్దు అంశాలను ముందుకు తీసుకురావడం అలవాటుగా మారింది. అందువల్లనే ఎన్నిచట్టాలు చేసినా, కమిషన్లు చేసినా ప్రయోజనం ఉండడం లేదు. సమస్యపరిష్కారానికి కమిషన్లు చేసే సిఫార్సులు రికార్డులకే పరిమితమవుతున్నాయి. ఈ కారణంగా సరిహద్దు వివాదాలు,దశాబ్దాలు కొనసాగుతున్నాయి. సరిహద్దుల వివాదాల పరిష్కారం కోసం ప్రజాభిప్రాయాన్ని సేకరించడం అవసరం.*



అన్నవరపు బ్రహ్మయ్య
సీనియర్ పాత్రికేయులు

సరిహద్దు వివాదాలతో దేశంలోని ఈశాన్య ప్రాంతం అతలాకుతలమవుతోంది. అస్సాం, మేఘాలయ సరిహద్దు వివాదం అనేక మంది ఉసురు తీయడమే కాకుండా వందల కుటుంబాలను వీధినపడేస్తోంది. అస్సాం, మేఘాలయ సరిహద్దు వివాదం 50 యేళ్ల నాటి సమస్య.జనవరి 29న ముసాయిదా తీర్మానంపై సంతకం చేసిన రెండునెలల తర్వాత అస్సాం, మేఘాలయ ప్రభుత్వాలు తమ 884.9 కి.మీ సరిహద్దులో 50 ఏళ్లనాటి వివాదాన్ని పాక్షికంగా పరిష్కరించుకున్నాయి. మార్చి29న న్యూఢిల్లీలో హోంమంత్రి అమిత్‌షా సమక్షంలో అస్సాంముఖ్యమంత్రి హిమంత బిస్వాశర్మ, మేఘాలయ మంత్రి కాన్రాడ్ కె. సంగ్మా మధ్య చారిత్రాత్మకమైన ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. అస్సాం, మేఘాలయ సరిహద్దులోని మిగిలిన సెక్టార్‌లు, అస్సాం, మరో మూడు ఈశాన్యరాష్ట్రాల మధ్య వ్యత్యాసం ఉన్న ఇతర వివాదాలను పరిష్కరించడానికి ఈఒప్పందం మార్గదర్శిఅవుతుందని భావించారు.కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సమస్య మరల పునరావృతమైందనిపిస్తోంది. ఇదే సమయంలో సరిహద్దు తగిన విధంగా నిర్ణయించకపోతే గ్రామాల్లో ఎటువంటి హక్కులు లేకుండా, ద్వితీయ శ్రేణి పౌరుల మాదిరిగా జీవించాల్సి వస్తుందని గిరిజనేతర ప్రజలలో భయం ఉంది. ఈశాన్య రాష్ట్రాలకు అస్సాం మాతృరాష్ట్రమని చెప్పవచ్చు.అస్సాం నుంచే ఇతర ఈశాన్య రాష్ట్రాలు ఏర్పాటయ్యాయి. ఈ కారణంగానే అస్సాంకు మేఘాలయతోనే కాకుండా అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం, నాగాలాండ్‌లతో కూడా సరిహద్దు వివాదాలున్నాయి. 2019లో జరిగిన ఎన్‌ఎల్‌ఎఫ్‌టి, 2020లో జరిగిన బ్రూ-రియాంగ్ ఒప్పందం, 2020 జరిగిన బోడో ఒప్పందం, 2021లో జరిగిన కర్బీ అంగ్లాంగ్ ఒప్పందాల ద్వారా ఈశాన్య ప్రాంతంలో శాంతిని నెలకొల్పడానికి అనేక చర్యలు చేసుకొన్నారు. అస్సాం పునర్వ్యవస్థీకరణ చట్టం 1971 ప్రకారం మేఘాలయ అస్సాం నుండి విడిపోయింది.తొలుత 1970లో మేఘాలయ అస్సాం నుండి స్వయం ప్రతిపత్తి కలిగిన రాష్ట్రంగా ఏర్పడింది. ఆ తర్వాత 1972లో అస్సాం పునర్వ్యవస్థీకరణ చట్టం ఆధారంగా మేఘాలయ పూర్తిస్థాయి రాష్ట్రంగా మారింది. అస్సాం మేఘాలయాలు 885 కి.మీ పొడవు సరిహద్దును పంచుకుంటున్నాయి. ఈ చట్టం అనేక వివాదాలకు దారితీసింది. మేఘాలయ ప్రభుత్వం ఈ చట్టాన్ని ఆమోదించడానికి నిరాకరించింది. మేఘాలయ సరిహద్దును నిర్ధారించడంలో 1951లో ఏర్పడిన కమిటీ కొన్నిసిఫార్సులు చేసింది. ఈ సిఫార్సులను ప్రమాణికంగా తీసుకోవడమే సరిహద్దు ఘర్షణలకు కారణమని చెప్పవచ్చు.మేఘాలయలోని ప్రస్తుత తూర్పు జైంతియా హిల్స్, రి-భోయ్, పశ్చిమ ఖాసీ హిల్స్ జిల్లాల ప్రాంతాలు అస్సాం జిల్లాలకు బదలీ చేస్తూ కమిటీ సిఫార్సు చేసింది. 1983లో ఈ సమస్యను పరిష్కరించడానికి ఉమ్మడి అధికారిక కమిటీని ఏర్పాటు చేశారు. రెండురాష్ట్రాల సహకారంతో సర్వే ఆఫ్ ఇండియా సరిహద్దును నిర్ణయించాలని, అధికారిక కమిటీ సూచించింది. అయితే ఈ సూచనను ఎవరూ పట్టించుకోలేదు. ఆ తర్వాత 1985లో జస్టిస్ వై.వి చంద్రచూడ్ నేతృత్వంలోని స్వతంత్ర ప్యానెల్ ఏర్పాటు చేశారు. చంద్రచూడ్ సమర్పించిన నివేదిక అస్సాంకు అనుకూలంగా ఉందని ఆరోపిస్తూ మేఘాలయ తిరస్కరించింది. ఆ తర్వాత 1991లో సర్వే ఆఫ్ ఇండియా సహాయంతో సరిహద్దును ఉమ్మడిగా గుర్తించేందుకు రెండు ప్రభుత్వాలు అంగీకరించాయి.దాదాపు 100కి.మీ సరిహద్దు 1991 చివరి నాటికి గుర్తించడం జరిగింది. అయితే మళ్లీ మేఘాలయ సర్వే విధానమే రాజ్యాంగ విరుద్ధమని సర్వే ఆఫ్ ఇండియా నివేదికను కూడా నిరాకరించింది. 2011లో సరిహద్దు వివాదంలో కేంద్రం జోక్యం చేసుకొని, రాజ్యాంగపరంగా సరిహద్దు కమిషన్ ఏర్పాటు చేయాలని మేఘాలయ అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ అస్సాం అసెంబ్లీ తీర్మానం చేసి ప్రతీకారం తీర్చుకుంది. పరిస్థితులను అర్థం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని సరిహద్దు వివాదంపై చర్చించేందుకు రెండు ప్రభుత్వాలకు సంబంధించిన నోడల్ అధికారు



లను నియమించాలని సూచన చేసింది. ఆ సూచనను కూడా పట్టించుకోలేదు. 2019లో వివాదాన్ని పరిష్కరించేలా కేంద్రాన్ని ఆదేశించాలని మేఘాలయ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే విచారణ జరగకుండానే పిటిషన్ కొట్టివేయడం జరిగింది. కేంద్ర కేబినెట్ మంత్రి నేతృత్వంలోని ఈ రెండు కమిటీలు సమస్యను పరిష్కరించుకోవడానికి ఐదు సూత్రాలు పాటించాలని నిర్ణయించాయి.వివాదాస్పద ప్రాంతాలకు బృందాల వరుస సమావేశాలు, వివాదస్పద ప్రాంతాల సందర్శనల తర్వాత, ఇరుపక్షాలు పరస్పరం అంగీకరించిన ఐదు సూత్రాల ఆధారంగా నివేదికలను సమర్పించాయి. చారిత్రక దృక్పథం, స్థానిక ప్రజలు, సరిహద్దుతో వారి అనుబంధం కోర్కెలు, పరిపాలనాసౌలభ్యంవంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని సమితి సంయుక్తంగా తుది సిఫార్సులను అందచేసింది. మొదటి దశలో సెటిల్‌మెంట్ కోసం తీసుకున్న 36.79 చదరపు కిలోమీటర్ల వివాదాస్పద ప్రదేశంలో అస్సాం 18.46 చదరపు కిలోమీటర్లు,మేఘాలయ 18.33 చదరపు కిలోమీటర్ల మేరకు వారినియంత్రణలోకి వస్తాయి.ఈ మేరకు మార్చి 2022లో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. వాస్తవ సరిహద్దు స్థానాలను శాటిలైట్ మ్యాపింగ్ చేయడం ద్వారాఅస్సాం మేఘాలయ వంటిరాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదాలను పరిష్కరించవచ్చు.ఇదే సమయంలో ఇంటర్ స్టేట్ కౌన్సిల్‌ను పునరుద్ధరించడం ద్వారా అంతర్‌రాష్ట్ర వివాద పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంటుంది.అదేవిధంగా దేశంలోని రాష్ట్రాలను జోన్‌లుగా విభజన చేసి, జోనల్ కౌన్సిల్ ఏర్పాటు చేశారు. ఆయా జోన్‌ల పరిధిలోని రాష్ట్రాలకు సంబంధించిన సరిహద్దు వివాదాస్పద అంశాలు, ఆందోళన కలిగించే విషయాలు,సామాజిక, ఆర్థిక ప్రణాళిక, అంతర్ రాష్ట్ర రవాణా మొదలైన వాటికి సంబంధించిన విషయాలను చర్చించడానికి జోనల్ కౌన్సిల్‌లను పునరుద్ధరించాలి. భారత దేశంలోని అస్సాం, మేఘాలయాలే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం ఉంది.రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న బెల్గాం లేదా బెలగాని ప్రస్తుతం కర్ణాటకలో భాగంగా ఉంది. కానీ మహారాష్ట్ర ఆ ప్రాంతం తమదేనని చెబుతోంది. 1957 రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కర్ణాటకతో తన సరిహద్దును సరిచేయాలని మహారాష్ట్ర డిమాండ్ చేస్తోంది. ఇదే విధంగా ఒడిశా,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య1960 నుండికోటియా గ్రామ పంచాయతీకి సంబంధించి కూడా సరిహద్దు వివాదంఉంది. ఈ రెండు రాష్ట్రాల మధ్య అంతర్ రాష్ట్ర నది వంశధారకు సంబంధించిన నీటి వివాదం కూడా ఉంది.నీటి వివాదంపై ఒడిశా కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. ఇటీవల అంతర్‌రాష్ట్ర మండలి (ఐఎస్‌సి)ని ప్రధానమంత్రి ఛైర్మన్‌గా,అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతోపాటు ఆరుగురు కేంద్ర మంత్రులు సభ్యులుగా ఉండే అంతర్ రాష్ట్ర మండలిని పునరుద్ధరించారు. పది మంది కేంద్రమంత్రులు అంతర్ రాష్ట్ర మండలికి శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. ఈ కౌన్సిల్ కేంద్ర ప్రభుత్వం హోమ్‌మంత్రి ఛైర్మన్‌గా ఇంటర్ స్టేట్ కౌన్సిల్ స్టాండింగ్ కమిటీని కూడా పునర్నిర్మించింది. అంతర్ రాష్ట్ర మండలి స్టాండింగ్ కమిటీలో ఆంధ్రప్రదేశ్, అస్సాం,బీహార్, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా,పంజాబ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రులు కూడా సభ్యులుగా ఉన్నారు. కేంద్రం రాష్ట్రాల మధ్య విడివిడిగా, ఉమ్మడిగా రాజ్యాంగంలో ఇప్పటికే నిర్దేశించిన విధులను సమీక్షించే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం 1983లో జస్టిస్ ఆర్.ఎస్ సర్కారియా అధ్యక్షతన ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 263 ప్రకారం కేంద్రరాష్ట్రాల మధ్య వివాదాలపై సంప్రదింపులు జరపడం కోసం ఒక స్వతంత్ర జాతీయవేదికగా ఇంటర్ స్టేట్ కౌన్సిల్‌ను శాశ్వతంగా ఏర్పాటు చేయడం సర్కారియా కమిషన్ చేసిన ముఖ్యమైన సిఫార్సులలో ఒకటి. ప్రస్తుతం భారత యూనియన్‌లో సంస్థాగతంగా అభిప్రాయ భేదాలున్నాయి.అంతర్ రాష్ట్ర ఘర్షణలు అదుపు తప్పకముందే పరిష్కరించుకోవాల్సి ఉంది. కౌన్సిల్స్‌కు శాశ్వత సచివాలయం ఏర్పాటు చేయాలి. ఈ చర్యల వల్ల కౌన్సిల్‌కు పటిష్టత ఏర్పడుతుంది. కౌన్సిల్ సంవత్సరానికి కనీసం మూడుసార్లు సమావేశమవుతుంది. కాని ఈ సంస్థలు తగిన విధంగా పనిచేయడం లేదు. సక్రమంగా పనిచేస్తే ఈశాన్య ప్రాంతసమస్యలు సులభంగానే పరిష్కారం అవుతాయని చెప్పవచ్చు.నిజానికి ఎటువంటి సమస్యనైనా సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవచ్చు. కానీ కొన్ని రాజకీయ శక్తులకు సమస్య పరిష్కారం కావడంవల్ల కలిగే ప్రయోజనాలకంటే సమస్య కొనసాగడంవల్ల కలిగే ప్రయోజనం ఎక్కువగా ఉంటున్నాయి. ఆయా శక్తుల వెనుక ఉన్న రాజకీయ శక్తులను నివారించడం అవసరం. తమ రాజకీయ అవసరాల కోసమే విభజన అంశాలను, సరిహద్దు అంశాలను ముందుకు తీసుకురావడం అలవాటుగా మారింది.అందువల్లనే ఎన్నిచట్టాలు చేసినా, కమిషన్లు చేసినా ప్రయోజనం ఉండడం లేదు. సమస్యపరిష్కారానికి కమిషన్లు చేసే సిఫార్సులురికార్డులకే పరిమితమవుతున్నాయి.ఈ కారణంగా సరిహద్దు వివాదాలు,దశాబ్దాలు కొనసాగుతున్నాయి.సరిహద్దుల వివాదాల పరిష్కారం కోసం ప్రజాభిప్రాయాన్ని సేకరించడం అవసరం. ●

# ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టాలి

డా.శేట్టెం ఆంజనేయులు

మానవాళి మునుపెన్నడూ ఎరుగని భయంకర తుఫానులు, కరవుకాటకాలు,కనీవిని ఎరుగని వడగాల్పులు, దుర్భల శీతల పవనాలు, సైక్లోన్, వంటి పెనువిపత్తులు ప్రకృతిపై మనం సాగించిన తీవ్ర విధ్వంసానికి ప్రతీకలు.ఇవన్నీపర్యావరణ సంక్షోభ తీవ్రతకు నిలువెత్తు ఆనవాళ్లు.సహజ వనరులను అపరిమితంగా వినియోగిస్తున్నందుకు ప్రకృతి మనపైచూపుతున్న ఆగ్రహానికి అరుదైన మేలుకొలుపులు. ఇటువంటి విపత్తులను నివారించి ప్రకృతిని పరిరక్షించడం ప్రపంచ దేశాల ఉమ్మడి కర్తవ్యంగా భావించాలనే సదుద్దేశ్యంతో ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యు.ఎన్.ఈ.పి) నేతృత్వంలో 1973నుంచి ప్రతి యేటా జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. ప్రభుత్వ ప్రతినిధులు, ఎన్జీవోప్రముఖులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు కలిసిప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ అనుకూల కార్యక్రమాలను రూపొందించి అమలు చేయడానికి ఇది ప్రపంచంలోనే అతిపెద్ద వేదికగా రూపాంతరం చెందింది. భూతాప ఉన్నతికి,భూసార క్షీణతకు, వాయు,జల కాలుష్యానికి కారణమవుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను నివారించి ప్లాస్టిక్‌రహిత ప్రపంచాన్ని రూపొందించాలనే ఉద్దేశ్యంతో బీట్‌ప్లాస్టిక్ పొల్యూషన్ నినాదంతో 2023 పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ఊహకందని రీతిలో యేటికేడు పెరిగిపోతున్నది.దీనివల్ల ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిపై ప్రతియేడు కోట్ల టన్నులుపెరిగిపోతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలలో 50 శాతం సముద్రాలలో కలుస్తున్నాయన్నది శాస్త్ర విశ్లేషణలు నిరూపిస్తున్న నిష్ఠుర సత్యం. ఉష్ణశోషకాలుగా పిలవబడే మహాసముద్రాలు నేడు ప్లాస్టిక్ వ్యర్థాలకు కూపాలుగా మారుతున్నాయి. పర్యావరణ స్థితిగతులపై అధ్యయనం చేసిన ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం నివేదికప్రకారం మహాసముద్రాలలో ఇప్పటికే 6.75 కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పోగుపడ్డాయి. ప్రతి యేటా 10లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో కలుస్తున్నాయి.సముద్రంలోని ప్రతి చదరపు మైలు విస్తీర్ణంలో 62వేల ప్లాస్టిక్ వ్యర్థాలు తేలుతున్నట్లు అంచనా. సముద్రాలుచేరే వ్యర్థాలు రేటు ఇదే విధంగా కొనసాగితే 2050 నాటికి సముద్రాలలో చేపల కంటే ప్లాస్టిక్ వ్యర్థాలే ఎక్కువగా ఉంటాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం అధ్యయనం హెచ్చరిస్తున్నది. సముద్రాలలో చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలలో భారత్ నుంచి ఉత్పత్తి అవుతున్నవి అధికంగా ఉన్నాయని అంచనా. ఆసియా ఖండంలోని చైనా,ఫిలిప్పీన్స్, మలేషియా,ఇండోనేషియా, మయన్మార్, థాయిలాండ్ మొదలగుదేశాలు దక్షిణ అమెరికా ఖండంలోని బ్రెజిల్ వంటి దేశాల నుంచి అత్యధికంగా ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోకి చేరుతున్నాయి. ప్రపంచ పర్యావరణ సంస్థ అంచనాల ప్రకారం అమెరికాలోని కాలిఫోర్నియా, హవాయి రాష్ట్రాల మధ్య పసిఫిక్ మహాసముద్రంలో పోగైన ప్లాస్టిక్ వ్యర్థాల పరిమాణం ఫ్రాన్స్‌దేశ విస్తీర్ణం కంటే మూడు రెట్లు అధికంగా ఉన్నది.వివిధ దేశాల నుంచి సముద్రంలోనికి భారీగాప్లాస్టిక్ వ్యర్థాలు చేరడానికి కారణం వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేకపోవడమే. దీనికితోడు ఆయా దేశాలలో పేదరికం,తీర ప్రాంతాలలో అధిక వర్షపాతం ఉండడం.ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ఎక్కువగా ఉండడం కూడా మరొక కారణం. చిన్న చిన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారమని భ్రమించి భక్షించిన జలచరాలు అవి జీర్ణంకాక చనిపోతున్నాయి. వీటి కళేబరాలతో తీరప్రాంతాలు సముద్ర గర్భాలు మరింత కలుషితమైపోతున్నాయి. పెద్దపెద్ద సమావేశ ప్రదేశాల ప్రాంగణాల్లో ప్లాస్టిక్ వాడటం పూర్తిగా నిషేధించాలి. కాగితాలకే పరిమితం కాకుండా కార్యరూపం దాల్చేవిధంగా ఉపక్రమించాలి. అభివృద్ధి చెందిన దేశాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను రహదారుల నిర్మాణంలో ఉపయోగించడం వల్ల బహుళ ప్రయోజనాలు సిద్ధి స్తున్నట్లు నిరూపణ అయింది. పట్టణ రహదారులను ప్లాస్టిక్ వ్యర్థాలతో నిర్మించినట్లయితే పర్యావరణానికి ఎనలేని మేలు చేకూరడమే కాకుండా ప్లాస్టిక్ వ్యర్థాల మహమ్మారి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ●

# కోట్లు దాటుతున్న నీటి వ్యాపారం

బొల్లిముంత సాంబశివరావు

నీటి వ్యాపారం ప్రపంచవ్యాప్తంగా పెద్దఎత్తున కొనసాగుతున్నది. దాని విలువ రూ.27వేల కోట్ల డాలర్లు. నీటిపై వివిధ దేశాల్లో బడా బహుళజాతి సంస్థలు ప్రభుత్వాల నుంచి హక్కులు పొంది నీటి వ్యాపారం ద్వారా వేల కోట్ల రూపాయలను తరలించుకుపోతున్నాయి. సహజ నీటివనరులపై ప్రజలు హక్కులను కోల్పోతున్నారు. గత 70సంవత్సరాలపైగా ప్రపంచ జనాభా మూడు రెట్లు పెరగగా నీటి వాడకం ఆరురెట్లు పెరిగింది. పరిశ్రమల వాడకానికి నీటి వినియోగం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. పరిశ్రమలకు నీటి అవసరాలు పెరుగుతున్నకొద్దీ ప్రభుత్వ రాయితీలతో, ప్రజల సొమ్ముతో తమ నీటి అవసరాలను తీర్చుకోవడమే కాకుండా, నీటిపై తమ గుత్తాధిపత్యం కోసం పెట్టుబడిదారులు ప్రయత్నాలు ప్రారంభమైనాయి. పెట్టుబడిదారుల సహజ లక్షణమైన తక్షణ లాభమే తప్పవారికి నిలకడైన అభివృద్ధిపట్టదు. తాగునీటి అవసరాలు పెరగడంతో పెట్టుబడిదారులకు నీరుఎంతో లాభసాటి వ్యాపారంగా మారింది. 1992లో డబ్లిన్ వాటర్ కాన్ఫరెన్స్ వరల్డ్ వాటర్ విజన్ నీటిని ఒక ఆర్థిక వస్తువుగా అంటే సరుకుగా అభివర్ణించింది. నీటి ప్రైవేటీకరణను సమర్థించేవారు రెండు వాదనలు ముందుకు తెస్తున్నారు. మొదటిది ప్రైవేటీకరణ వలన నీటి వసతుల నిర్వహణ మెరుగుపడుతుందని, నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని, సమర్థవంతంగా నీరు అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. రెండవది నీరు ఉచితంగా లభించడం వలన అవసరానికి మించి ప్రజలు నీటిని వాడుతున్నారని, ప్రైవేటీకరించడం వలన డబ్బు చెల్లించవలసి రావడంతో నీటిని ప్రజలు పొదుపుగా వాడతారని చెప్పడం. ఇవన్నీ ప్రైవేటీకరణను సమర్థించే వాదనలు. నీరు వృధాగాపోతున్నట్లు ఎక్కడ కన్పించినా ప్రజలు దానికి మరమ్మత్తులు చేస్తారు. రైతాంగంపైన కూడా ఇలాంటి విమర్శ చేశారు. సాగునీరు వృధా కాకుండా ఉండటానికి నీటి మీటర్లు బిగించాలనే ప్రతిపాదనతెచ్చి తీవ్రవ్యతిరేకత రావడంతో చంద్రదబాబు ప్రభుత్వం వెనక్కి తగ్గింది. నీటిప్రైవేటీకరణ జరుగుతున్నది. జలవనరుల సంరక్షణ కోసంకాదని, వ్యాపారుల దోపిడీ కోసమన్నది వీరు విస్మరించారు.ఏ ప్రైవేటీకరణ అయినా అది ప్రజల కోసం కాదని, బడా వ్యాపారుల కోసమే అన్నది వాస్తవం. నీటి ప్రైవేటీకరణ జరగడం వలన ఉచితంగా అందాల్సిన తాగునీరు డబ్బులు చెల్లించి ప్రజలు కొనుక్కోవాలి. ప్రైవేట్ కంపెనీలు అధిక మొత్తంలో లాభాలు గడించడమనే కోణం నుంచి నీటినిర్వహణకు సంబంధించిన నిర్ణయాలు ఉంటాయి తప్ప ప్రజల అవసరాలను దీర్ఘకాలిక నీటి



మనుగడ దృక్పథం ఉండదు. బహుళజాతి సంస్థలు ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌ల మద్దతుతో పబ్లిక్ నీటి వనరులను ప్రైవేటీకరించి తమతో కాంట్రాక్టు కుదుర్చుకోవడానికై అర్థ వలస దేశాలపై విపరీతమైన ఒత్తిడి చేస్తున్నాయి. నీటిప్రైవేటీకరణ మొదట లాటిన్ అమెరికాలో ప్రారంభమైనది. నేడు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకు విస్తరించింది. ఇందుకు కూడా ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ పాత్ర కీలకంగా ఉంది. వెనుకబడిన దేశాలకు రుణాలు మంజూరు చేసేటప్పుడు నీటిని ప్రైవేటీకరణ చేయాలని షరతులు విధిస్తున్నాయి.ప్రభుత్వాలు నీటి వనరులను సమర్థంగా నిర్వహించడం లేదనే ప్రచారం చేసి ప్రైవేటీకరణ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రైవేట్ కంపెనీలు అత్యధిక లాభాలకు నీటిని అమ్ముటం అంటే, అది మానవ జీవనానికి అత్యంత మౌలిక అవసరమైన నీటిని సాధారణ ప్రజలు నిరాకరించడమే.75శాతం వరకు నీటివ్యాపారం కొన్ని యూరోపియన్ దేశాల, అమెరికా బహుళజాతి కంపెనీల అదుపులో ఉంది. ఈ కంపెనీలు వివిధ దేశాల ప్రభుత్వాలపై నీటిని, నీటి నిర్వహణను ప్రైవేట్‌పరం చేయాలని విపరీతమైన ఒత్తిడి పెట్టి విజయం సాధించాయి.నీటిని ప్రైవేటీకరణ చేసినప్పుడు బ్రిటన్‌లో 1988-95 మధ్య నీటి బిల్లులు 67శాతం పెరిగాయి. ఆఫ్రికా ఖండంలో నీటి ప్రైవేటీకరణ తర్వాత ప్రజలకు నీటి హక్కు నిరాకరించబడింది. భారతదేశంలోకూడా నీటిప్రైవేటీకరణ పెద్దఎత్తునకొనసాగుతున్నది. 2002భారత ప్రభుత్వ జాతీయ జలవిధానాన్ని అమల్లోకితెచ్చింది. ఈ విధానం ప్రకారం ఎక్కడ సాధ్యమైతే అక్కడ జలవనరుల పథకాలప్లానింగ్,అభివృద్ధి, నిర్వహణ కోసం ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నది. ఒక దశాబ్దం కాలంలోనే దేశంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో నడిపే ప్రాజెక్టుల సంఖ్య300కు చేరింది. మహారాష్ట్రలో 48,కర్ణాటకలో 26, తమిళనాడులో 25, ఢిల్లీలో 20,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 15 ప్రాజెక్టులు ప్రైవేట్ భాగస్వామ్యంలో నడుస్తున్నాయి. నీటిసరఫరాలో ఇతరదేశాల్లో లాగానే భారత్‌లోనూ ప్రైవేట్‌రంగం విఫలమైంది.జలవిధానం రాకముందే భారతదేశంలో 1990లో జలవనరుల ప్రైవేటీకరణ ప్రారంభమైనది. శివనాథ్ నదిలో 23 కిలోమీటర్ల దూరం పాటు రేడియస్ వాటర్ సప్లయ్‌కి 22 సంవత్సరాలు మధ్యప్రదేశ్ ప్రభుత్వం1998లో ఒక కార్పొరేట్ సంస్థకు లీజుకు ఇచ్చింది. ఫలితంగా మొదటిసారి ఒక నది కార్పొరేట్‌సంస్థ చేతుల్లోకి పోయింది. 23 కిలోమీటర్ల నదికి ఇరువైపుల కార్పొరేట్ సంస్థ కంచెవేసింది. ఫలితంగా ఆ పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు నీటిని వాడుకోవడంపైన, చేపల వేటపైనా నిషేధానికి గురయ్యారు. ప్రైవేటీకరణ దుష్పరిణామాలను గమనించిన రాష్ట్రపబ్లిక్ అకౌంట్ కమిటీ లీజుఒప్పందాన్ని రద్దు చేయాలని సిఫార్సు చేసినా మధ్యప్రదేశ్ ప్రభుత్వం లీజుని కొనసాగించింది. భారతదేశంలో మూడువేల ఆర్గనైజ్డ్‌వాటర్ బాటిల్ కంపెనీలు మరో 12వేల అన్ -ఆర్గనైజ్డ్ కంపెనీలు ఉన్నాయనే అంచనా ఉంది. భారతదేశంలో 2050 నాటికి నీటి సంక్షోభం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని కూడా నివేదికలు తెలుపుతున్నాయి. ●

# ఇంటర్‌లాకింగ్ వ్యవస్థపైనే అనుమానం :ఆడిట్ రిపోర్ట్

బాలాసోర్, జూన్4: ఒడిశాలోని బాలాసోర్ వద్ద జరిగిన రైలు ప్రమాద ఘటనకు ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్‌ను మార్చడమే కారణమని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దీనిపై గతంలో కాగ్ విడుదల చేసిన రైల్వే ఆడిట్‌రిపోర్ట్ తెరపైకి రావడంతో విమర్శలు వెల్లువెత్తాయి. రైల్వే



భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ రైల్వే ఆడిట్ రిపోర్టును గత ఏడాది సెప్టెంబర్‌లోనే పార్లమెంట్‌లో కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదలచేసింది. రైల్వే ట్రాక్‌లో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి లోటుపాట్లను సవరించే అంశంపై విస్తుపోయే అంశాలను కాగ్ నివేదికలో పేర్కొంది. 2017, 21 మధ్య మొత్తం 1,127 రైలు ప్రమాదాల్లో 289 ప్రమాదాలు ట్రాక్ పునరుద్ధరణకు సంబంధించినవేనని కాగ్ నివేదిక పేర్కొంది. రైల్వే ట్రాక్ నిర్మాణాలు, ప్రమాద ప్రదేశాల తనిఖీలు 30,100 శాతం తగ్గాయి. 2017 నుంచి 2021 మార్చి వరకు 422 రైలు ప్రమాదాలు ఇంజనీరింగ్ సమస్యల కారణంగా జరిగాయి. అందులో 275 ప్రమాద ఘటనలు ఆపరేటింగ్ విభాగంలో లోపాల కారణంగా జరిగాయి. ట్రాక్‌లపై పాయింట్లను తప్పుగా గుర్తించారు. ప్రధానంగా 171 ప్రమాద కేసులు నిర్వహణ లోపాల కారణంగా జరిగాయి. 156 కేసుల్లో నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్‌ల నిర్మాణం చేపట్టినట్లు విస్తుపోయే కాగ్ నివేదిక పేర్కొంది. అంతేకాకుండా వేగంగా రైలు నడపడం కూడా ప్రమాద ఘటనలకు ప్రధాన కారణం అని నివేదిక వెల్లడించింది. 63 శాతం ప్రమాద ఘటనల్లో నిర్ణీత గడువులోగా విచారణ చేపట్టలేదు. అంతేకాకుండ 49 శాతం కేసుల్లో ఆ నివేదికలను ఆమోదించడంలోనే ఆలస్యం జరిగిందన్నారు. 2017, 18 నుంచి ఆయిల్‌లో దాదాపు రూ. ఒక లక్ష కోట్ల కార్పస్ ఫండ్‌ను అందుకున్న రైల్వేశాఖ వ్యయం క్రమంగా తగ్గుముఖం పట్టింది. ట్రాక్ పునరుద్ధరణకు నిధుల సరైన మోతాదుల్లో కేటాయించలేదు. అంతేకాకుండా కేటాయించిన దానిలో పూర్తిగా ఖర్చు చేయలేదని నివేదిక వెల్లడించింది. రైల్వే ట్రాక్ నిర్వహణను సకాలంలో చేయాలని కాగ్ తెలిపింది. మెరుగైన సాంకేతికతను ఉపయోగించాలని కోరింది. ఇలా అయితేనే రైలు ప్రమాదాలను పూర్తి స్థాయిలో నియంత్రించగలమని నివేదికలో స్పష్టం చేసింది.

# ప్రమాదస్థలం నుంచి చెన్నై వరకూ ప్రత్యేక రైలు



## ప్రధానితో ఫోన్‌లో మాట్లాడి చికిత్స వివరాలు తెలిపిన ఒడిశా సిఎం పట్నాయక్

భువనేశ్వర్, జూన్ 4: ఒడిశారైలు ప్రమాదఘటనపై రాష్ట్రముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ ప్రధాని మోదీతో ఫోన్‌లో సంభాషించారు. ఆసుపత్రుల్లో అందుతున్న చికిత్స వివరాలతోపాటు కేంద్ర మంత్రుల రాక పరిశీలన మొత్తం చికిత్సలో ఉన్న బాధితుల వివరాలను కూడా మోడీకి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించినట్లు తెలిపారు. మృతులకు రెండులక్షలు, తీవ్రంగా గాయపడినవారికి లక్షరూపాయలు వంతున సిఎం సహాయనిధినుంచి అందచేస్తున్నట్లు వివరించారు. ప్రమాదం తర్వాత రాష్ట్రంలోని వివిద ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో మొత్తం 1175 మంది క్షతగాత్రులు చేరారని, వారి లో 793 మందిని ఇప్పటికే డిశ్చార్జి చేసారని సిఎం వివరించారు. ప్రస్తుతం 382 మంది మాత్రమే చికిత్సలో ఉన్నట్లు తెలిపారు. గాయపడిన వారిలో ఎక్కువ మందిపరిస్థితి స్థిరంగా ఉందని సిఎం పట్నాయక్ మోడీకి వివరించారు. ప్రతిప్రాణం విలువైనదే అన్న నినాదంతో క్షతగాత్రుల ప్రాణాలను కాపాడే దుకు వైద్యసిబ్బంది అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంక్షోభ సమయంలో ఒడిశాప్రజలు ప్రభుత్వం స్పందించిన తీరును ప్రశంసిస్తూ సీఎం పట్నాయక్‌కు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్‌లోమార్పువల్లనే ప్రమాదం సంభవించిందని ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు రైల్వేమంత్రి కూడా ప్రకటించారు. కేంద్రం పరంగా ఎలాంటి సాయం అయినా అందిస్తుందని నవీన్‌కు ప్రధానిమోడీ భరోసా ఇచ్చారు. ప్రమాదస్థలం నుంచే ప్రత్యేకరైలు ఒడిశాలోని భద్రక్‌నుంచి చెన్నై సెంట్రల్‌వరకూ ప్రత్యేకరైలును కొనసాగించారు. ఈరైలులోనే స్వల్పగాయాలపాలైనవారు ఇతర ప్రయాణీకులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చారు. భద్రక్‌నుంచి బయలుదేరిన ఈ రైలులో పలువురుప్రయాణీకులు ఆయా స్టేషన్లలో దిగిపోగా 137 మంది చెన్నైకి చేరారు. వీరిలో 36 మందికి వైద్యపరీక్షలునిర్వహించారు. ముగ్గురు స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరారు. మిగిలినవారిని ఇళ్లకు పంపించివేసారు. రెవెన్యూమంత్రి రామచంద్రన్, ఆరోగ్యమంత్రి సుబ్రహ్మణియన్, రాష్ట్ర ఉన్నతాధికారులు వారిని పరామర్శించారు. ప్రయాణీకులకోసం 30 వైద్యబృందాలు, ఏడు బస్సులు, 50 ట్యాక్సీలను కూడా తమిళనాడుప్రభుత్వం ఏర్పాటుచేసింది.

# బీమా క్లెయిమ్‌కు సర్టిఫికెట్లు అవసరం లేదు

## రైలు ప్రమాద మృతుల కుటుంబాలకు ఎల్‌ఐసి బాసట

న్యూఢిల్లీ, జూన్3: ఒడిశాలోని బాలాసోర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదం పట్ల ఎల్‌ఐసి ఆఫ్ ఇండియా తీవ్ర విచారం వ్యక్తం చేసిందని మహంతి పేర్కొన్నారు. మృతులు, బాధితులకు బాసటగా నిలుస్తుందని, ఆర్థిక ఉపశమనం అందించడానికి క్లెయిమ్ సెటిల్‌మెంట్‌లను వేగవంతం చేస్తుందని చైర్‌పర్సన్ వివరించారు. ఎల్‌ఐసి పాలసీల క్లెయిమ్‌దారులు, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పాలసీదారుల కష్టాలను తగ్గించడమే దీని లక్ష్యం అన్నారు. రిజిస్టర్డ్ డెత్ సర్టిఫికెట్లకు బదులుగా రైల్వే అధికారులు, పోలీసులు, ఏదైనా రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వ అధికారులు ప్రచురించిన మరణాల జాబితాను పాలసీదారుల మరణానికి రుజువుగా అంగీకరించనున్నట్లు ఎల్‌ఐసి చైర్‌పర్సన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే క్లెయిమ్ సంబంధిత సందేహాలకు నివృత్తికి, హక్కుదారులకు సహాయం అందించడానికి డివిజనల్, బ్రాంచ్ స్థాయిలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# సింగపూర్‌లో 49దేశాల నిఘా అధిపతుల సమావేశం


సింగపూర్, జూన్ 4: ప్రపంచదేశాల్లో ఎదురవుతున్న వివిధ సైబర్‌నేరాలు, ఉగ్రవాద చర్యలు, ప్రభుత్వాలపై తిరుగుబాట్లు వంటి పోకడలు, వాటిని అధిగమించే ప్రణాళికలపై సమీక్షచేసుకునేందుకు సుమారు 49 దేశాలకు చెందిన గూఢచార విభాగాల అధిపతులు సమావేశం అయ్యారు. సింగపూర్‌లోని షాంగ్రిల్లా హోటల్‌లో జరిగిన సమావేశానికి అమెరికా,భారత్, జపాన్, ఆస్ట్రేలియా, చైనా, దక్షిణకొరియా, బ్రిటన్, కెనడా, న్యూజిలాండ్ వంటి దేశాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. రష్యా గూఢచార సంస్థ మాత్రం పాల్గొనలేదు. భారత్‌కు చెందిన రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ ప్రతినిధి సామంత్‌గోయల్ ఈ సమావేశంలో



పాల్గొన్నారు. ఉక్రెయిన్‌కు చెందిన డిప్యూటీ రక్షణమంత్రి వోలోదిమిర్ వి హబిలోవ్ ఇదే హోటల్‌లో బసచేసినా సైనిక సమావేశంలో మాత్రం పాల్గొనలేదని తేలింది. సమావేశంలో ప్రత్యేకించి సైబర్‌నేరాలు, డ్రగ్‌మాఫియాలు, ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు వంటి వాటిపై చర్చలుజరిగినట్లు సమాచారం. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర అంశం కూడా కీలకంగా చర్చకువచ్చిందని తెలుస్తోంది. మొత్తం 49 దేశాలకు చెందిన 600 మందిప్రతినిధులు ఈ మూడురోజుల సదస్సులో పాల్గొన్నారు. అయితే సమావేశం ఎజెండా వివరాలుమాత్రం బయటకు వెల్లడికాలేదు. పేర్లు వెల్లడించని ప్రతినిధులు కొందరు ఈ విషయాలు కొద్దిగా వెల్లడించారు. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోని అల్బనీస్ కీలకప్రసంగంచేసిన్నే అమెరికా రక్షణ మంత్రి ల్లాయిడ్ ఆస్టిన్, చైనా రక్షణమంత్రి లీ షాంగ్‌ఫూ బ్రిటన్ రక్షణమంత్రులతోపాటు జపాన్, కెనడా, ఇండోనేసియా, దక్షిణకొరియాలకు చెందిన మంత్రులు కూడా ప్రసంగించారు. అమెరికా చైనా దేశాలమధ్య సంబంధాలు పునరుద్ధరించుకునేందుకు రెండుదేశాలు కూడా ఇటీవలి కాలంలో తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇటీవలే సిఐఎ డైరెక్టర్ విలియమ్ బర్న్స్ చైనాను సందర్శించారు. అలాగే చైనా ప్రతినిధులు సైతం అమెరికా విభాగం ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సమావేశాలను అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలు నిర్వహిస్తాయి. పంచనేత్రం నెట్‌వర్క్ కింద మొత్తం ప్రపంచదేశాల్లో కీలక నిఘా వేగుల చీఫ్‌లందరూ సమావేశం అయి భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను చర్చించి ఒక కీలకనిర్ణయాలు తీసుకుంటారు.

# నాహృదయం విషాదంతో ముక్కలయింది

## ఒడిశా ప్రమాదంపై అమెరికా అధ్యక్షుడు జోబైడెన్



వాషింగ్టన్, జూన్4: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాదం గురించి తెలిసి తన గుండె పగిలిందని వ్యాఖ్యానించారు. ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో 288 మంది ప్రాణాలు కోల్పోగా 1,100 మంది గాయపడ్డారు. ప్రమాదంలో తొలుత కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ లూప్‌లైన్‌లో ఆగివున్న గూడ్సు రైలును ఢీకొట్టడంతో దాని బోగీలు చెల్లాచెదురుగా పడ్డాయి . అదే సమయంలో పక్క ట్రాక్ నుంచి వస్తున్న మరో రైలు పట్టాలపై పడిన బోగీలను ఢీకొట్టడంతో పెను ప్రమాదం జరిగింది. ఈ విషాదంపై జో బైడెన్ స్పందించారు. ఈ ఘోర ప్రమాదం గురించి తెలిసి తనతోపాటు ప్రథమ పౌరురాలైన జిల్ బైడెన్ హృదయాలు విషాదంలో మునిగిపోయాయని అన్నారు. ప్రమాదంలో ప్రియమైన వారిని కోల్పోయిన వారు, గాయపడిన వారి కోసం ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. అమెరికా, భారత్ మధ్య సాంస్కృతిక, కుటుంబ బంధాలు బలంగా పెనవేసుకుపోయాయని అన్నారు. ఒడిశా ప్రమాదంపై అమెరికా ప్రజలందరు సంతాపం తెలుపుతున్నట్లు బైడెన్ పేర్కొన్నారు.

# రైలు ప్రమాదానికి కారణం తెలిసింది - బాధ్యులను గుర్తించాం

## రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ, జూన్4: ఒడిశాలోని బాలాసోర్ వద్ద ఘోర రైలు ప్రమాద ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య ఇప్పటికే దాదాపు 288కి చేరింది. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ట్రాక్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ ప్రమాదం కారణంగా పాడైపోయిన ట్రాక్ పనులను పునరుద్ధరిస్తున్నాము. బుధవారం ఉదయానికి మిగతా పనులను పూర్తి చేసి రైళ్ల రాకపోకలు కొనసాగిస్తాం. ప్రమాదానికి సంబంధించిన కారణాలపై ఇప్పటికే రైల్వే సేఫ్టీ కమిషనర్ దర్యాప్తు చేసి నివేదిక పూర్తి చేశారు. రిపోర్టు అందాల్సి ఉంది. అయితే నివేదిక రావడానికి ముందే బాధ్యులను గుర్తించామని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్‌ను మార్చడం ద్వా రానే ప్రమా దం జరిగిందని చెప్పారు. కవచ్‌కు, రైలు ప్రమా దానికి సంబం ధం లేదు. అయితే ప్రస్తుతం తమ ఫోకస్ మొత్తం పునరుద్ధరణ పనులపైనే ఉందని స్పష్టం చేశారు. ఇతే సమయంలో ఒడిశా రైళ్ల ప్రమాదం తర్వాత ట్రాక్ పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన నడుస్తున్నాయి. ఒకదానిపైన మరొకటి ఎక్కిన బోగీలను ఇప్పటికే తొలగించారు. వీలైనంత తొందరగా ట్రాక్‌ను పునరుద్ధరించేందుకు నిరంతరాయంగా వందలాది మంది కార్మికులు, నిపుణులు శ్రమిస్తున్నారన్నారు.

# ఆర్థిక సంక్షోభం నుండి పాకిస్థాన్ బయటపడుతుందా?

ఇస్లామాబాద్, జూన్4: కరాచీ వాణిజ్య మండలి పరిశ్రమ నిర్వహించిన ఓ సమావేశంలో పాకిస్తాన్ ఆర్థిక మంత్రి ఇషాక్ దార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయడానికి అనుసరిస్తున్న విధానాలను, భవిష్యత్తు కార్యాచరణను వివరించే ప్రయత్నం చేశారు ఇషాక్ దార్. ఆయన మాట్లాడుతూ 1998, 2013లో మనం ఇంతకంటే ఘోరమైన పరిస్థితులను ఎదుర్కొన్నాం. కానీ కొంత కాలానికి ఆ సంక్షోభం నుంచి బయటపడ్డాము. 2017 సమయానికి పాకిస్తాన్ ఆర్థికంగా అత్యుత్తమ స్థాయికి చేరుకుంది. కానీ ప్రస్తుతం దేశంలో ఉన్న రాజకీయ అస్థిరత కారణంగా ఇప్పుడు మళ్లీ పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ పతనావస్థకు చేరుకుంది. ఈ సంక్షోభాలకు తక్షణ పరిష్కారం ఉండదన్నారు.



# గూడ్స్‌రైలులో ఇనుపఖనిజం.. ప్రమాద తీవ్రతకు అది కూడా కారణమే

## రైల్వేబోర్డు సభ్యురాలు జయవర్మ సిన్హా

న్యూఢిల్లీ, జూన్ 4: ఒడిశాలోని బాలాసోర్‌వద్ద జరిగిన ఘోరరైలు ప్రమాదం అందుకు గల కారణాలను రైల్వేబోర్డు సభ్యురాలు జయవర్మ సిన్హా వివరించారు. సిగ్నలింగ్ సమస్యవల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. బహనాగ బజార్‌స్టేషన్‌వద్దప్రమాదంజరిగిందని ఆమె తెలిపారు. రైలు ప్రమాదఘటన నేపథ్యంలోరైల్వే బోర్డుసభ్యులు జయవర్మ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రమాదానికి ఓవర్‌స్పీడ్ కారణం కాదని, ఈప్రమాదసమయంలో కోరమాండల్‌ఎక్స్‌ప్రెస్ గంటకు 128 కిలోమీటర్ల వేగంతో వస్తోందని, యశ్వంత్‌పూర్‌ఎక్స్‌ప్రెస్ గంటకు 124 కిలోమీటర్ల వేగంతో నడుస్తోందని రెండురైళ్లు నిర్దేశిత



వేగంతోనే నడుస్తున్నట్లు ఆమె తెలిపారు. హటాత్తుగా కోరమాండల్ లైను లైప్‌లైన్‌లోకివెళ్లిందని, బహనాగ స్టేషన్‌వద్ద రెండు లూప్‌లైన్లు, రెండు మెయిన్‌లైన్లు ఉన్నాయని, లూప్లైన్‌లో ఉన్న గూడ్స్ రైలులో భారీగా ముడి ఇనుము ఉందని, గూడ్స్‌రైలును కోరమాండల్ ఢీకొట్టిందని, దీనితోప్రమాద తీవ్రత ఎక్కువ ఉందని, అయితే సిగ్నలింగ్ సమస్యలవల్లేప్రమాదంజరిగినట్లు విచారణలో తేలిందని, సమగ్ర దర్యాప్తుచేస్తున్నట్లు ఆమె స్పష్టంచేసారు. అయితే ఈప్రమాదానికి సంబంధించి రైల్వే సేఫ్టీ కమిషనర్‌నుంచి పూర్తిస్థాయిక నివేదిక రావాల్సి ఉందన్నారు. ఈ ఘటనలో గూడ్స్‌రైలు పట్టాలు తప్పలేదని, లూప్లైన్‌లో ఆగి ఉన్న ఆ గూడ్స్ రైలులో ఇనుపఖనిజం ఉందని, అన్ని కోరమాండల్ వేగంగా వచ్చి ఢీకొనడంతోబోగీలపై తీవ్ర ప్రభావం పడిందని భారీ సంఖ్యలోమరణాలు, గాయాలకు దారితీసిందని తెలిపారు. ఈ క్రమంలోనే కోరమాండల్ బోగీలు చెల్లాచెదురై డౌన్‌లైన్‌లోకి వచ్చిపడ్డాయని సిన్హా వివరించారు. అదేలైన్‌లో వస్తున్న బెంగళూరు హౌరా రైలు చివరిరెండుబోగీలను ఢీకొట్టాయని సిన్హా వివరించారు. కవచ్ వ్యవస్థ ఉన్నప్పటికీ ఇటువంటిప్రమాదాలు నివారించడంలో దోహదం చేయదని చెప్పారు. బాధిత కుటుంబీకులు హెల్ప్‌లైన్ నంబరు 139ని సంప్రదించవచ్చని సూచించారు. వారి ప్రయాణం ఇతర ఖర్చులు మొత్తంభరిస్తామన్నారు.

# కేంద్ర మంత్రి వెళుతున్న విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

గౌహతి, జూన్4: కేంద్ర మంత్రి రామేశ్వర్ తెలిసహా 150 మందితో వెళుతున్న విమానం అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఇంజన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అస్సాంలోని గువాహటి విమానాశ్రయంలో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనను గువహటి ఎయిర్‌పోర్టు వర్గాలు ధృవీకరించాయి. ఆదివారం ఉదయం అసోంలోని గువాహటి నుంచి డిబ్రూగఢ్‌కు విమానం బయల్దేరింది. కానీ 20 నిమిషాల్లోనే వెనక్కి వచ్చింది. ఇంజిన్‌లో సమస్య తలెత్తినట్లు గుర్తించిన పైలట్ విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి రామేశ్వర్ తెలి మాట్లాడుతూ నేను, బిజెపి ఎమ్మెల్యేలు ప్రశాంత్, తెరస్ గొవల్లాతో కలిసి విమానంలో బయల్దేరాను. దులియాజన్, టింగ్‌ఖాన్, టిన్సూకియాలో మూడు సమావేశాల్లో పాల్గొనాల్సి ఉంది. మా విమానం గాల్లోకి ఎగిరిన 20 నిమిషాల్లోనే గువహటి ఎయిర్ పోర్టులో అత్యవసరంగా ల్యాండ్ అయింది. మేము సురక్షితంగా ఉన్నాం అని తెలిపారు. తాను ఇంకా విమానాశ్రయంలోనే ఉన్నానని, ఆ విమానం నడవదని అధికారులు చెప్పారని రామేశ్వర్ తెలి పేర్కొన్నారు. మరోవైపు డిబ్రూగఢ్ వెళ్లాల్సిన ఇండిగో విమానం అత్యవసరంగా దిగిందని గువాహటి ఎయిర్‌పోర్టు వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. 150 మంది ప్రయాణికులు క్షేమంగా ఉన్నట్లు వెల్లడించాయి. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపాయి. తనిఖీల కోసం విమానాన్ని పంపినట్లు చెప్పాయి.



# మణిపూర్ అల్లర్లపై ముగ్గురు సభ్యుల కమిటీ విచారణ

న్యూఢిల్లీ, జూన్ 4: మణిపూర్ అల్లర్లపై సమగ్ర విచారణజరిపేందుకు ముగ్గురుసభ్యుల విచారణ కమిషన్‌ను కేంద్రం నియమించింది. గువాహతి హైకోర్టు మాజీ చీఫ్‌జస్టిస్,గా పనిచేసిన జస్టిస్ అజయ్‌లాంబా ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. మణిపూర్‌లోజరిగిన అల్లర్లకు సంబంధించి సమగ్ర విచారణజరుపుతారని కేంద్ర హోంమంత్రిత్వశాఖ ప్రకటించింది. మాజీ ఐఎఎస్ అధికారి హిమాంశుశేఖర్‌దాస్, మాజీ ఐపిఎస్ అధికారి అలోకా ప్రభాకర్‌లు కూడా కమిషన్‌లో సభ్యులుగా ఉంటారు. గతనెల 3వ తేదీనుంచి మణిపూర్‌లో వివిద జిల్లాల్లో జరిగిన అల్లర్లు, హింసాత్మక సంఘటనలపై వీరు సమగ్ర విచారణజరుపుతారు. మైటీ, కుకీ జాతులమధ్య జరిగిన హింస జాతుల వైరంగా మారి రాష్ట్రాన్ని అల్లకల్లోలానికి గురిచేసింది. హింసకు దారితీసిన సంఘటనలకు అసలుమూలాలపై విచారణచేస్తుంది.


విధినిర్వహణలో అలసత్వంపైనా కూడా విచారణ చేస్తుంది. అధికారులు, వ్యక్తులు పాలనాపరమైన కార్యాచరణ అమలుచేయడంలో ఏమైనా లోపాలున్నాయా అన్న అంశంపైనా విచారణచేస్తుందని హోంమంత్రిత్వశాఖ స్పష్టంచేసింది.

# ఎక్కడ ఏ విధంగా ఉండాలో నాకు తెలుసు : రాహుల్‌కి గట్టి కౌంటర్ ఇచ్చిన విదేశాంగ మంత్రి జైశంకర్



న్యూఢిల్లీ, జూన్4: విదేశాంగ మంత్రి జైశంకర్ ఎక్కడ ఏ విధంగా ఎలా ఉండాలో తనకు తెలుసునంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేరు ప్రస్తావించకుండానే కౌంటరిచ్చారు. రాహుల్ గాంధీ యూఎస్ పర్యటనలో చేసిన వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జైశంకర్, బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశం కోసం కేప్‌టౌన్ పర్యటనలో ఉన్న జైశంకర్ అక్కడ భారతీయ కమ్యూనిటీతో జరిగిన ప్రసంగంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రాహుల్ పేరు ప్రస్తావించకుండా యూఎస్‌లో ఎవరో చేసిన వ్యాఖ్యల గురించి మీరు ఏం చెప్పాలనుకుంటున్నారని భారతీయ కమ్యూనిటీ ప్రశ్నించగా విదేశాంగ మంత్రి ఈ విధంగా బదులిచ్చారు. తాను విదేశాల్లో ఉంటే తన గురించే మాట్లాడతానని, అక్కడ రాజకీయాలు చేసేందుకు చూడనని చెప్పుకొచ్చారు. అదే స్వదేశంలో ఉంటే మాత్రం వాదిస్తాను లేదా విభేదించడానికి సిద్ధంగా ఉంటానని చెప్పారు. ప్రజాస్వామ్య సంస్కృతి అద్దం పట్టేలా జాతీయ ప్రయోజనం కలిగించేలా సమష్టిగా పనిచేయడం అనేది ఒక నిర్దిష్ట సామూహిక బాధ్యత అని అన్నారు. కాగా రాహుల్‌గాంధీ అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన మొహబ్బత్‌కి దుకాన్ కార్యక్రమంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. బిజెపి చర్యల ఫలితం భారత్‌లోని ముస్లింలు, దళితులు, గిరిజన ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతోందని వారి కోసం ప్రేమ, అప్యాయతలతో పోరాడాలంటూ వ్యాఖ్యలు చేశారు. అలాగే ఆర్థిక అసమానతలు గురించికూడా వ్యాఖ్యానించారు.

# పదేళ్ల కాలపరిమితితో మెహబూబాముఫ్తీకి పాస్‌పోర్టు



శ్రీనగర్, జూన్ 4: జమ్ముకాశ్మీర్ పిడిపి అద్యక్షురాలు, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీకి పదేళ్ల కాలపరిమితికి చెల్లుబాటయ్యే పాస్‌పోర్టును జారీచేసారు. సుదీర్ఘ న్యాయపోరటం తర్వాత ఢిల్లీ హైకోర్టు ముఫ్తీకి అనుకూలంగా ఆదేశాలు జారీచేసింది. 2019లోనే కాలపరిమితి ముగిసినందున తనకు పాస్‌పోర్టు అవసరం ముఫ్తీ చేసుకున్న దరఖాస్తును దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంచారని ఆమె ఆరోపించారు. రెన్యువల్ పాస్‌పోర్టు జారీచేయకపోవడంపై ఆమె న్యాయపోరాటంచేసారు. జమ్ముకాశ్మీర్ హైకోర్టు కూడా మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ పాస్‌పోర్టు కార్యాలయం నిర్ణయాన్ని సవాల్‌చేస్తూ హైకోర్టులో అప్పలుచేయడంతోనే ఆమెకుసైతం ఒమె వెళ్లేస్పష్టమైన దేశం పేరుచెపుతే పాస్‌పోర్టు ఇస్తామని ఆదేశించారు. మెహబూబాకు ఇచ్చే పాస్‌పోర్టు 2023 జూన్ ఒకటవ తేదీనుంచి 2033 మే 31వ తేదీ వరకూ చెల్లుబాటవుతుంది. ఈ ఏడాదిమార్చినెలలోనే ఢిల్లీ హైకోర్టు పాస్‌పోర్టు అదికారులను ఆమెకు ఇచ్చేదీ లేనిదీ మూడునెలల్లోపై నిర్ణయం తెలపాలని ఆదేశించింది. ముందు రెండేళ్లక్రితంనుంచి పాస్‌పోర్టు అధికారి తిరస్కరిస్తూ వచ్చారని తనకు పాస్‌పోర్టురెన్యువల్ కావడంలేదని జస్టిస్ ప్రతిభా ఎంసింగ్ బెంచ్‌పై వాదనలు లేవనెత్తారు.

# మిలటరీకోర్టులో ఇమ్రాన్‌పై విచారణ

## పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్

ఇస్లామాబాద్, జూన్ 4: పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్‌ను మిలిటరీ కోర్టులో విచారణ చేయకతప్పదని గతనెల 9వ తేదీ సంఘటనలకు బాద్యుడిగా ఆయనపై అభియోగాలున్నాయని, ప్రభుత్వ మిలిటరీ స్థావరాలపై ఆయన మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలుచేసిన దాడులపై మిలిటరీ కోర్టు విచారణజరుపుతుందని రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తెలిపారు. 70 ఏళ్ల ఇమ్రాన్‌ఖాన్ ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందంటే మిలిటరీకోర్టులో దోషిగా ఆరోపణలు ఎదుర్కోనాల్సిందేనని ఆయన అన్నారురు. పిటిఐ చీఫ్ పై ఇప్పటివరకూ ఎలాంటి కేసునమోదుకాలేదని, గతనెల 9వ తేదీ సంఘటనలకు సంబంధించి ఇమ్రాన్‌పేరిట ఎలాంటికేసులు ఇప్పటివరకూ తనదృష్టికిరాలేదన్నారు. అయితే ఆనాటి సంఘటనలకు సంబంధించి ఇమ్రాన్ ఖాన్‌ను మిలిటరీ కోర్టులో విచారణ చేయాల్సి ఉంటుందన్నారు. ఆర్మీ చట్టాలప్రకారం మాజీ ప్రధానిని ప్రాసిక్యూట్‌చేయాల్సి ఉంటుందన్నారు. పాక్ అంతర్గత వ్యవహారాలమంత్రి రాణా సనావుల్లా అంతకుముందురోజే పాకిస్తాన్ మిలిటరీ కోర్టులో మాజీ ప్రధానిని విచారణ చేస్తారని, మే9వ తేదీ సంఘటనలకు రూపకర్త ఆయనే అని తేలిందన్నారు. ఇమ్రాన్‌ఖాన్‌ను ఆల్‌ఖాదిర్ ట్రస్టు అవినీతికేసులు నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో ఆయన్ను అరెస్టుచేయడంతో పిటిఐ కార్యకర్తలు, మద్దతుదారులు అభిమానులు ఆగ్రహావేశాలతో సివిల్, మిలిటరీ ఆస్తులను ధ్వంసంచేసారు. రావల్పిండిలోని ఇమ ఇలిటరీ ప్రధాన కార్యాలయం, లాహోర్‌లోని జిన్నాహౌస్ వంటివిధ్వంసం అయ్యాయి. అంతకు ముందు రక్షణ మంత్రి ఆసిఫ్ మాట్లాడుతూ ఆర్మీచట్టం కింద విచారణ జరిపేందుకు ఉన్న ఆధారాలు పరి శీలిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ



ఘటనలకు రూపశిల్పి మాజీ ప్రధానమంత్రేనని ఆయన ఆరోపించారు. ఆర్మీచట్టాలు, అధికార రహస్యాల చట్టం పరిధి లోనే ఇమ్రాన్‌ను విచారణ చేస్తారని ఫెడరల్‌కేబినెట్‌కూడా ఇందుకు ఆమోదం తెలిపిందని ఈ మంత్రులు చెపుతున్నారు. ప్రత్యేక కోర్టులో విచారణ అవసరం లేదని, ఇపుడున ఆర్మీచట్టాలపై విచారణచేసే కోర్టులే సరిపోతాయని అననఆనరు. ఆర్మీచీఫ్‌జనరల్ ఆసిమ్ మునీర్ మాట్లాడుతూ కుట్ర దారులు, వ్యూహకర్తలు, అమలుచేసినవారిని ఖచ్చితంగా ఆర్మీచట్టంపరిధిలోను, అధికారిక రహస్యాల చట్టం పరిధిలోను విచారణచేస్తామని, ఎలాంటి రాజీధోరణి ఉండదన్నారు. అయితే ఇమ్రాన్‌ఖాన్ మాత్రం తన ప్రమేయం ఎంతమాత్రం లేదని, అయితే తన అరెస్టుపట్ల కార్య కర్తలు కొంత ఆగ్రహావేశాలకు లోన య్యారని, వారందరినీ సర్దుబాటుచేసినట్లు తెలిపారు. పాకిస్థాన్ రేంజర్స్ ఇస్లామాబాద్‌లో కోర్టుకేసుకు విచారణకోసం వచ్చిన ఇమ్రాన్‌ను అరెస్టుచేయడంపై ఆయన పార్టీ కార్యకర్తలు సుమారు 20కిపైగా మిలిటరీ స్థావరాలు, ప్రభుత్వ భవనాలను ధ్వంసంచేసారు. మియాన్ వాలి ఎయిర్‌బేస్, ఫైసలాబాద్‌లోని ఐఎస్‌ఐ భవనం, రావల్పిండిలోని ఆర్మీ కేంద్ర కార్యాలయం ధ్వంసం అయ్యాయి. ఆతర్వాత ఖాన్ బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే ఈ దాడులు విధ్వంసం సంఘటనలకు సంబంధించి పిటిఐకి చెందిన పదివేలమంది కార్యకర్తలను అరెస్టుచేసారు. వీరిలో నాలుగువేలమందిని పంజాబ్‌నుంచే అరెస్టుచేసారు. ఈఘర్షణల్లో పది మంది చనిపోయినట్లు పోలీసులు చెపుతున్నారు.

# ప్రపంచదేశాల్లో 79కోట్లకు చేరువగా వైరస్‌కేసులు

## 69లక్షలకు చేరుతున్న మరణాలు

జెనీవా, జూన్ 4: ప్రపంచదేశాల్లో కరోనా వైరస్ జాడలు ఇప్పటికీ పోలేదు. రోజురోజుకూ కొత్తకేసులతో ప్రపంచదేశాల్లో మానవాళిని బెంబేలెత్తిస్తోంది. ఆదివారం నాటికి ప్రపంచ దేశాల్లో 68.99 కోట్లమందికి కరోనాసోకి వారిలో 68.86 లక్షలమందిచనిపోయారు. మరో 37,944 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 66.22 కోట్లకుపైగా నమోదుకాగా మరో 2.07 కోట్ల మందికిపైగా బాధితులు ఆసుపత్రుల్లోనే కొనసాగుతున్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 24.95 కోట్లమందికి కరోనాసోకి వారిలో 20.61 లక్షలమందిచనిపోయారు. మరో 5721 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 24.54 కోట్లకుపైగా నమోదుకాగా మరో 19.22 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. ఉత్తర అమెరికా దేశాల్లో మొత్తం 12.67 కోట్లకుపైగా బాధితులుంటే వారిలో 16.34 లక్షలమందిచనిపోయారు. మరో 12.26 కోట్లమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు.ఆసియా దేశాల్లో మొత్తం 21.77 కోట్లకుపైగా బాధితులుంటే వారిలో 15.47లక్షలమందిచనిపోయారు. మరో 15,269 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 20.13 కోట్లకుపైగా నమోదుకాగా మరో 1.48 కోట్లమంది ఇప్పటికీ వైరస్‌తో పోరాటం చేస్తున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం 6.87 కోట్లకుపైగా బాధితులుంటే వారిలో 13.56 లక్షలమంది చనిపోయారు. మరో 10,108 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 6.65 కోట్లకుపైగా నమోదుకాగా మరో 9,06,624 మందిపరిస్థితి విషమంగా ఉంది. ఆఫ్రికా దేశాల్లో మొత్తం 1.28 కోట్లకుపైగా బాధితులుంటే వారిలో 2,58,778 మందిచనిపోయారు. రికవరీలు 1.21కోట్లకుపైగా ఉన్నాయి. మరో 4.80 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతో పోరాటం చేస్తున్నారు. 19 ద్వీపకల్పదేశాల్లో మొత్తం 1.44కోట్లకుపైగా కరోనా బాధితులుంటే వారిలో 28,276 మందిచనిపోయారు. రికవరీలు 1.42కోట్లకుపైగా నమోదుకాగా మరో 1,45,576 మంది ఇప్పటికీ వైరస్‌తోపోరాటంచేస్తున్నారు.

# రైతులపై విత్తన భారం.. పెరిగిన పత్తి సీడ్ ధరలు



## ప్యాకెట్‌పై రూ.43 రూపాయల పెంపు
## రూ.810 నుండి రూ.853కు చేరిన ధర
## విత్తనాలకు ప్రైవేటు కంపెనీలే దిక్కు

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త :** ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ ప్రతికూల పరిస్థితులతో తెలంగాణలో కొట్టుమిట్టాడుతున్న పత్తి రైతాంగానికి భారీగా పెరిగిన పత్తి విత్తన ధరలు భారంగా పరిణమించాయి. ఒక పక్క రాష్ట్రం విత్తనాల సబ్సిడీలను ఎత్తేస్తే, మరోపక్క కేంద్రం తాజాగా పత్తి విత్తన ప్యాకెట్ల ధరను పెంచేసింది. ప్యాకెట్‌కు 43 రూపాయల చొప్పున పెంచింది. దీంతో పత్తి విత్తనాల ప్యాకెట్ ధర 810 రూపాయలు ఉండగా, ఇప్పుడది 853 రూపాయలకు చేరింది. ఈ విత్తన ధరలకు సంబంధించి కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. పత్తి పండించే రైతులు విత్తనాలను ప్రైవేటుగానే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. పలు కంపెనీలు వివిధ రకాల విత్తనాలను మార్కెట్‌లో ప్రవేశపెట్టడంతో వాటి ధరలపై కేంద్రం నియంత్రణ విధించింది. ఏటా విత్తన తయారీ తదితర ఖర్చులను పరిగణనలోకి తీసుకుని కేంద్రం వాటి ధరలను నిర్ణయిస్తుంది. అలా ప్రకటించిన ధరలకే ప్రైవేటు కంపెనీలు విత్తనాలను రైతులకు విక్రయించాల్సి ఉంటుంది.

కాగా వచ్చే వారం నుండి ప్రారంభమయ్యే వానాకాలం సీజనులో తెలంగాణ వ్యాప్తంగా 55 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేయాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఇది 60 లక్షలకు పైగా ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని అంచనా. పత్తి సాగు చేసే రైతులు ఎకరానికి రెండు నుండి మూడు ప్యాకెట్ల విత్తనాలను వినియోగిస్తారు. ఈ లెక్కన దాదాపు 1 కోటి 70 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం ఉంటుంది. పెంచిన పత్తి విత్తనాల ధరలతో పాటు, ప్రైవేటు వ్యాపారుల అదనంగా అమ్మే ధరల మేరకు రాష్ట్రంలోని రైతులపై దాదాపు 100 కోట్ల రూపాయల వరకూ భారం పడుతుందని అంచనా. గతంతో పోలిస్తే ఎరువులు, పురుగు మందులు, కూలీల ధరలు పెరగడంతో పత్తి రైతులకు పెట్టుబడి మరింత పెరగనుంది.

మరోపక్క మార్కెట్‌లో బీటి-1, బీటి-2 రకాలు అందుబాటులో ఉన్నా ఎక్కువ మొత్తంలో బీటి-2 విత్తనాన్నే తెలంగాణలో రైతులు సాగు చేస్తారు. అయితే ఈ విత్తనాలకు ఉన్న డిమాండ్‌ను బట్టి ప్రైవేటు వ్యాపారులు ఇష్టారాజ్యంగా నిర్ణయించిన ధరల కంటే అదనపు ధరలకు అమ్ముతున్నారు. దీనికి తగినట్లుగా పత్తి విత్తనాలకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ఇవ్వడం లేదు.

ఈ విత్తనాలకు ప్రైవేటు వ్యాపారులే అంతేకాకుండా ఎక్కువ మొత్తంలో అవసరం ఉండటంతో ఏటా నకిలీ పత్తి విత్తనాలు మార్కెట్‌లోకి ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయి. ప్రధాన కంపెనీలకు చెందిన బ్రాండ్ల పేరుతో నకిలీ విత్తనాలను తయారు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాటిని తమకు అనుకూలంగా ఉన్న డీలర్ల ద్వారా రైతులకు సరఫరా చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన కొందరు వ్యక్తులు తక్కువ ధరకు కిలో 150 నుండి 250 రూపాయల వరకూ నాసిరకం పత్తి విత్తనాలు కొనుగోలు చేసి వాటిని తెలంగాణ రాష్ట్రానికి చేరవేస్తున్నారు. పత్తిని ఎక్కువగా సాగు చేస్తున్న గద్వాల, ధరూర్, అచ్చంపేట్, కల్వకుర్తి, షాద్‌నగర్, భూత్పూర్ తదితర ప్రాంతాల్లోని కొందరు డీలర్లకు అప్పగించినట్లు సమాచారం. బహిరంగ మార్కెట్‌లో ఎక్కువగా అమ్ముడు పోయే కావేరి, జాదు, వసంత సీడ్స్, నూజివీడు సీడ్స్ వంటి కంపెనీల పేర్లతో నకిలీ విత్తనాలను మార్కెట్‌లో సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

# ఎవరితోనైనా పొత్తుకు సై

## అవసరమైతే పార్టీని విలీనం చేస్తామన్న కోదండరామ్

## విజయవంతమైన టిజెఎస్ ప్లీనరీ సమావేశం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరా బాద్, సూర్యాపేట, జూన్ 4:** తెలంగాణ పరిరక్షణకు, ప్రజాస్వామ్య తెలంగాణకు టిజెఎస్ కృషి చేస్తోందని ప్రొఫెసర్ కోదండరామ్ చెప్పారు. తెలంగాణ ఆకాంక్ష నెరవేర్చడం టిజెఎస్‌తోనే సాధ్యమన్నారు. తెలంగాణ శక్తులు, ఉద్యమకారులు ఏకమై రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రుణమాఫీ లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యమ అకాంక్షలకు అనుగుణంగా కలిసి వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతో అయినా కలిసి పనిచేసేందుకు తాము సిద్దంగా ఉన్నామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏ పార్టీతోనైనా పొత్తుకు సిద్ధమని తెలిపారు. అవసరమైతే తమ పార్టీని విలీనం చేస్తామని సంచలన ప్రకటన చేశారు. తెలంగాణ జన సమితి అస్తిత్వాన్ని కాపాడుకుంటామని చెప్పారు. సూర్యపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర 3వ ప్లీనరీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన కోదండరామ్ ఆ పార్టీ జెండా ఎగురవేసి ప్లీనరీని ప్రారంభించారు. తమ ఆర్థిక, రాజకీయ స్వలాభాల కోసమే తెలంగాణ రాష్ట్రంలో సిఎం కెసిఆర్ విధ్వంసం సృష్టిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కెసిఆర్ ప్రభుత్వం ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చకుండానే సొంత అజెండాను అమలు పరుస్తోందని ఆరోపించారు. తెలంగాణ పదాన్ని వదిలి... రాష్ట్ర ప్రజలు ఆకాంక్షలను మరిచి.. బిఆర్ఎస్‌తో దేశ రాజకీయాల్లోకి వెళ్లడం సరికాదని అన్నారు. ఆకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే... కనీసం ఆదుకునే ప్రయత్నం చేయకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పోడు రైతులకు పట్టాలు ఇవ్వడం లేదని, విద్యవైద్యం ఉచితంగా అందడం లేదని ఆరోపించారు.

### నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన కోదండరాం

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి తెలంగాణ జన సమితి 3వ ప్లీనరీలో నాలుగోసారి జనసమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రొఫెసర్ కోదండ రాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుండి హాజరైన ప్రతినిధులు ఆయన ఎన్నికను ఏకగ్రీవంగా చేశారు. 2018, ఏప్రిల్ 29న తెలంగాణ జనసమితి ఆవిర్భవించింది. వరుసగా నాలుగు పర్యాయాలు ఆయనే అధ్యక్షుడిగా కొనసాగుతూ వస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఉద్యమిస్తామని కోదం డరాం అన్నారు.

# తెలంగాణ పోలీసుల పనితీరు దేశానికే ఆదర్శం

## జనం కోసం నిరంతరం పని చేసేది పోలీసులే: మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** తెలంగాణ పోలీసుల పనితీరు దేశానికే అదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర అర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో తెలంగాణ దశాబ్ధి ఉత్సవాలలో భాగంగా సురక్షా దినోత్సవం పురస్కరించుకొని అదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. శాంతిభద్రతలు ప్రశాంతంగా ఉంటనే పెట్టుబడిదారులు ముందుకువస్తారని తెలిపారు. రాత్రి, పగలు పండగ, పబ్బం లేకుండా 24 గంటలు సంవత్సర కాలం ప్రజల కోసం నిరంతరం పని చేసేది పోలీసులేనని పేర్కొన్నారు. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలను కాపాడేవారు పోలీసులు అన్నారు.

మనోనిబ్బరం కోల్పోకుండా న్యాయం, ధర్మం వైపు నిలబడుతు రాజ్యాంగాన్ని కాపడుతున్నారని తెలిపారు. అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నేరాల నియంత్రణలో తెలంగాణ పోలీసు దేశానికే అదర్శంగా నిలచిందన్నారు. దేశంలో ఎన్ని సిసి కెమెరాలు ఉన్నాయో తెలంగాణలో అన్ని సిసి కెమెరాలు ఉన్నాయన్నారు. సిసి కెమెరాల ద్వారా ఎన్నో ఫలితాలు సాధించడం జరుగుతుందన్నారు. రాష్ట్రానికే అదర్శంగా సిద్దిపేట జిల్లాలో పోలీసు హెల్త్ ప్రొఫైల్‌ను నిర్వహించమన్నారు.

గత 8 యేండ్లుగా దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పారదర్శకంగా వేగవంతంగా పాస్‌పోర్టులు అందిస్తూ మొదటి స్థానంలో మన రాష్ట్రం ఉందన్నారు. స్వరాష్ట్రంలో తెలంగాణ పోలీసు వ్యవస్థను అధునికరించినట్లు తెలిపారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. పోలీసు శాఖలో 33 శాతం రిజర్వేషన్లు మహిళల కోసం అమలు చేసిన ఘనత సిఎం కెసిఅర్‌కే దక్కుతుందన్నారు.

సిఎం కెసిఅర్ పోలీసు శాఖను ఎంతో బలోపేతం చేస్తున్నారని తెలిపారు. డయల్ 100తో అద్భుతాలు సృష్టిస్తూ ప్రజల్లో నమ్మకం పెంచడం జరిగిందన్నారు. జిల్లాలో పోలీసుశాఖను బలోపేతం చేయడానికే పోలీసు కమిషనరేట్ ఏర్పాటు చేసి సిబ్బంది సంఖ్యను పెంచడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, సీపీ ఎన్.శ్వేత తదితరులు మాట్లాడారు.

అనంతరం ఉత్తమ సేవలు కనబర్చిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ఉత్కృష్ట, అతిఉత్కృష్ట పథకాలను మంత్రి చేతుల మీదుగా అందించారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో పోలీసులు భారీ వాహనా శ్రేణితో ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మంత్రి హరీష్‌రావు సీపీ శ్వేతతో కలిసి ప్రారంభించారు. రంగధాంపల్లి నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధలుగుండా సాగి డిగ్రీ కళాశాల మైదానంకు చేరుకుంది. సమావేశంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, పోలీసు అధికారులు మహేందర్, దేవరెడ్డి, సతీష్, రమేష్, రవికుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం సురక్షా దినోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

# రాష్ట్రంలో కొత్తగా 5,600 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు

## మూసివేత దిశగా రామగుండం-బి యూనిట్

## జాతీయ విద్యుత్ ప్రణాళికను ప్రకటించిన కేంద్ర విద్యుత్ సంస్థ

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** తెలంగాణలో 5600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కొత్త ప్లాంట్లు 2032 సంవత్సరం నాటికి అందుబాటులోకి వస్తాయని కేంద్ర విద్యుత్ సంస్థ (సీఈఏ) ప్రకటించింది. ఇదే సమయంలో రామగుండం-బిలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యూనిట్-2 కేంద్రాన్ని మూసివేసే అవకాశాలు ఉన్నాయని వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర విద్యుత్ సంస్థ జాతీయ విద్యుత్ ప్రణాళికను ప్రకటించింది. 2022-32 సంవత్సరాల మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా 30 ఏళ్ల దాటిన థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను మూసివేయాలన్న నిబంధనలో భాగంగా రామగుండంలోని అతి పురాతనమైన యూనిట్‌ను మూసివేయాల్సి వస్తుందని తెలిపింది. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) తొలి దశకు చెందిన మరో 800 మెగావాట్లు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిందని పేర్కొంది. అలాగే యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్లాంటుకు చెందిన 4 వేల మెగావాట్ల సామర్థ్యం ఉన్న 5 యూనిట్లు, సింగరేణిలో 800 మెగావాట్ల మూడో యూనిట్ అందుబాటులోకి వస్తుంది. తెలంగాణలో 4959.19 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండగా, 20410 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుకూలత ఉంది. 2021-22 సంవత్సరంలో తెలంగాణలో అత్యధిక డిమాండ్ 14176 మెగావాట్లు ఉండగా, 2026-27 సంవత్సరానికి 19529 మెగావాట్లకు పెరగనుంది. ఇక 2026-27 సవత్సరం నాటికి తెలంగాణకు 92967 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం ఉంటుంది. ఇది 2031-32 సంవత్సరానికి 120549 మిలియన్ యూనిట్లకు చేరుతుందని వెల్లడించింది.



ఆదివారం ట్యాంక్‌బండ్‌పై జరిగిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా భద్రత సంబురాల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మంత్రులు మహమూద్‌అలీ, సత్యవతిరాథోడ్, డిజిపి అంజనీకుమార్, సునితాలక్ష్మారెడ్డి, గద్వాల విజయలక్ష్మి తదితరులు

# ఆడబిడ్డల భద్రతకు అత్యంత ప్రాధాన్యం

## తెలంగాణలో కర్ఫ్యూలేని పాలన.. ఆ ఘనత పోలీసులదే

## ట్యాంక్‌బండ్‌పై మహిళా సురక్ష సంబురాల్లో పాల్గొన్న కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 4:** తెలంగాణ ప్రభుత్వం అడబిడ్డల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రాష్ట్రంలోని మహిళల భద్రత బాధ్యతను సిఎం కెసిఆర్ తీసుకున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలో మనకు కనిస్తున్న పోలీసులు మూడు సింహాలైతే కనబడకుండా... వాళ్ల వెనుక ఉండి నడిపించే నాలుగో సింహం కెసిఆర్ అని తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ట్యాంక్‌బండ్‌పై ఆదివారం సాయంత్రం హోంశాఖ నిర్వహించిన మహిళా సురక్ష సంబురాల్లో కవిత పాల్గొన్నారు. తెలంగాణలో అడబిడ్డలకు ప్రాధాన్యం ఇచ్చే మంచి సంస్కృతి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆడపిల్లల భద్రత, సంక్షేమ బాధ్యతలను సిఎం కెసిఆర్ తీసుకున్నారని స్పష్టం చేశారు. రాష్ట్రం ఏర్పడిన కొద్దికాలంలోనే షీ టీమ్స్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆడపిల్లలపై కన్నెత్తి చూస్తే ఏమవుతుందో చెప్పి దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దారని చెప్పారు. తెలంగాణను స్ఫూర్తిగా తీసుకొని 18 రాష్ట్రాలు షీ టీమ్స్‌ను ఏర్పాటు చేశాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు అనేక అపోహలు ఉండేవని, భద్రత ఉండని, నక్సలైట్ల రాజ్యం, రౌడీ రాజ్యంగా మారుతుందని దుష్ప్రచారం జరిగిందని, మత కల్లోలాలు జరుగుతాయని కొందరు అవహేళనగా మాట్లాడిన మాటలు పటా పంచలయ్యాయని స్పష్టం చేశారు. గత తొమ్మిదేళ్లలో ఒక్క రోజు కూడా కర్ఫ్యూ లేకుండా రికార్డు పాలన చేసిన ఘనత తెలంగాణ పోలీసులకే దక్కుతుందని,, ఒక్క మతకల్లోలం కూడా జరగలేదని వివరించారు. పోలీసులు అద్భుతమైన భద్రత అందిస్తున్న కారణంగా ఇవాళ రాష్ట్రానికి పెట్టుబడులు వరదలాగా వస్తున్నాయని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా అర్ధరాత్రి 12 గంటలకు ఆడపిల్లలు ధైర్యంగా రోడ్లపై నడిచి వెళ్లే పరిస్థితి ఉందని, ముఖ్యంగా హైదరాబాద్ 100 నెంబర్‌కు ఫోన్ చేస్తే 7 నిమిషాల్లో పోలీసులు వస్తారని, గ్రామీణ ప్రాంతాల్లో 14 నిమిషాల్లో పోలీసులు బాధితుల వద్దకు చేరుతున్నారని వివరించారు. ఇన్ని విజయాలు సాధిస్తున్న పోలీసులకు ప్రజానీకం తరఫున కవిత అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, డిజిపి అంజనీకుమార్, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన జెఇఇ అడ్వాన్స్‌డ్-2023

## 9 నుంచి వెబ్‌సైట్‌లో రెస్పాన్స్ షీట్స్

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** దేశంలోని ఐఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ) అడ్వాన్స్‌డ్-2023 పరీక్ష ఆదివారం దేశ వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. పరీక్షను ఐఐటీ గువాహటీ నిర్వహించింది. మొదటి సెషన్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పేపర్-1ను ... రెండో సెషన్‌లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల పేపర్-2 వరకు నిర్వహిం చారు. ఈ నెల 9న అభ్యర్థులకు సంబంధించిన రెస్పాన్స్ షీట్స్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్టు పరీక్షను నిర్వహించిన ఐఐటీ గువాహటీ ప్రకటించింద. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆన్సర్ కీని ఈ నెల 11న వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నట్టు ప్రకటించారు.

జూన్ 18న ఫలితాలను విడుదల చేయనున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సుమారు 1.90 లక్షల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారిలో 1.46 లక్షల మంది బాలురు ఉండగా.. 44 వేల మంది బాలికలున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 50వేల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

# దుర్గంచెరువుపై డ్రోన్ల విన్యాసాలు

- రంగురంగుల దీపాలంకరణతో కనువిందు
- కేబుల్ బ్రిడ్జిపై అట్టహాసంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జూన్ 4, ప్రభాతవార్త:** జై తెలంగాణ... జై భారత్ అంటూ 500 డ్రోన్లు అక్షర క్రమంలో నిలబడి తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఉవ్వెత్తున తీసుకువెళ్లాయి. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాతలను పురస్కరించుకొని సైబరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం మాదాపూర్ దుర్గం చెరువు మీద నిర్వహించిన డ్రోన్ షో ఆద్యంత్యం కనువిందు చేసింది. చీకటిని చీల్చుకుంటూ రంగురంగుల దీపాల మధ్య ఒకేసారి వందల సంఖ్యలో డ్రోన్లు దుర్గం చెరువు నీటి మీద ఎగురుతూ సందర్శకులను ఆకట్టుకున్నాయి. సైబరాబాద్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 8.45 గంటలకు ప్రారంభమైన డ్రోన్ షో కోసం నగరవాసులు భారీ ఎత్తున హాజరయ్యారు. అంతకుముందు దేశభక్తి, సినిమా గీతాలతో సాగిన ప్రదర్శన అలరించింది. ఓవైపు కేబుల్ బ్రిడ్జీ విద్యుదీపాలంకరణ, మరోవైపు డ్రోన్ల వెలుగులతో దుర్గం చెరువు ప్రకాశించింది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ దశాబ్ది కాలంలో సాధించిన ప్రగతితో దాదాపు 20 నిమిషాల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ 10 సంవత్సరాల ప్రయాణాన్ని సూచిస్తూ 2014నుంచి 2023అని 10 అక్షరంతో డ్రోన్లు చేసిన ఆక ృతులు ఆశ్చర్యపరిచాయి. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం నమూనాతో, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రం ప్రదర్శనలతో ప్రైవేటు డ్రోన్లు సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. గత పదేళ్లలో తెలంగాణలో నిర్మించిన యాదాద్రి దేవాలయం, సచివాలయం, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ వంటి చిత్రాల ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. టిహబ్, షీటీమ్స్ నమూనాలను సైతం ప్రదర్శించాయి. వీటితో పాటు లేజర్ షో సందర్శకులను ఆలరించింది. కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, ఎంపి రంజిత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీ నవీన్‌రావు, కెటిఆర్ కుమారుడు హిమాన్షురావు తదితరులు హాజరయ్యారు.





# మాజీ ఎంపి పొంగులేటికి కెఏ పాల్ ఆఫర్

## వచ్చే ఎన్నికల్లో నేను సిఎంను.. పొంగులేటి డిప్యూటీ

## సొంత పార్టీ పెడితే నష్టపోతారు: కెఏ పాల్

**ఖమ్మం, ప్రభాతవార్త:** ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కేఏ పాల్ బంపర్ ఆఫర్ ఇచ్చారు. కాంగ్రెస్ లోకి వద్దు.. తమ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ప్రజాశాంతి పార్టీలోకి వస్తే తాను ముఖ్యమంత్రిగా.. పొంగులేటి ఉపముఖ్యమంత్రిగా ఉంటారని తెలిపారు. ఆదివారం ఖమ్మంలో ప్రజాశాంతి పార్టీ ఆఫీస్ ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేఏ పాల్ మాట్లాడారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి సొంత పార్టీ పెడితే నష్టపోతారని అన్నారు. ఇందుకు లక్ష కోట్లు ఉన్న గాలి జనార్ధన్‌రెడ్డి కర్ణాటకలో ఒక్క సీటు కూడా గెలవకపోవడమే ఉదాహరణని తెలిపారు. కావున ఒక అన్నగా ప్రజాశాంతి పార్టీలోకి పొంగులేటిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దేశంలో కాంగ్రెస్‌కు నాలుగు సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. అన్ని రాష్ట్రాలలో ఆ పార్టీకి బలం తగ్గిందని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ కేవలం క్రైస్తవుల మద్దతు తోనే గెలిచిందని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పది మంది ముఖ్య మంత్రులను ప్రకటించిందన్నారు. ఆ పార్టీకి ఇక్కడ దశా దిశ లేదన్నారు. రాష్ట్రంలో ప్రజాశాంతి పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధు రూ.10వేలు ఇస్తామని తెలిపారు. అలాగే వితంతువులకు రూ.4వేలు ఇస్తామన్నారు. నిరుద్యోగులకు రూ.ఆరువేల భృతి ఇస్తామని ప్రకటించారు. తెలంగాణకు బిల్ గేట్స్, బిల్ క్లింటన్‌ను తీసుకొస్తామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో అన్ని గ్రామాలలో మీటింగ్ పెట్టి.. లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు పగడాల కిశోర్ నాయుడు, శీలం గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఐ సెట్-2023 ప్రాథమిక కీ విడుదల

## 8 వరకు అభ్యంతరాలు స్వీకరణ


**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** తెలంగాణ తెలంగాణ రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్-2023 పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని నేడు(సోమవారం) విడుదల చేయనున్నారు. ప్రాథమిక కీపై ఈ నెల 6 నుంచి 8 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. తుది కీని ఫలితాలను ఈ నెల 20న విడుదల చేయనున్నట్టు ఐ సెట్-2023 కన్వీనర్ ప్రొఫెసర్ పి వరలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలపారు. ఐ సెట్ పరీక్షలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 93.38 శాతం మంది హాజరయ్యారు. పరీక్షలకు 75,925 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 70,900 మంది పరీక్షలకు హాజరయ్యారు. తెలంగాణలో 16 రీజినల్ కేంద్రాల్లో.. ఏపీలో 4 రీజినల్ కేంద్రాల్లో పరీక్షా కేంద్రాల్లో.. మొత్తం 72 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 37,112 మంది బాలురు ఉండగా.. 38,815 మంది బాలికలు, 5 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.

# 1.58 కోట్ల మందికి కంటి పరీక్షలు పూర్తి

- 22.21 లక్షల మందికి రీడింగ్ గ్లాసుల పంపిణీ
- లక్ష్యంలో 96.21 శాతం పూర్తి

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 1,58,35,947 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. వారిలో 22,21,494 మందికి రీడింగ్ గ్లాసులను పంపిణీ చేశారు. కంటి పరీక్షలను చేయించుకున్న వారిలో 74,42,435 మంది పురుషులు ఉండగా.. 83,73,097 మంది మహిళలున్నారు. 10,955 మంది ట్రాన్స్‌జెండర్లు కూడా ఉన్నారు. రాష్ట్రంలో ఉన్న 1,18,26,614 మంది ఎలాంటి కంటి సమస్యలు లేవని నిర్దారణ అయింది. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క వ్యక్తి కంటి సమస్యతో బాధపడకూడదని కంటి వెలుగు పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మారిన జీవన విధానం, వివిధ రకాల పని ఒత్తిళ్ల వల్లకంటి సమస్యలపై ప్రజలు దృష్టి పెట్టాలని, అవగాహన లోపం వల్ల ఎక్కువ మంది దృష్టి లోపానికి గురవుతున్నందున ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు మార్గదర్శనంలో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 18 నుంచి జూన్ 15 వరకు 100 రోజుల కార్యక్రమంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటి వరకు 96.21 శాతం కంటి పరీక్షలు పూర్తి అయ్యాయి. ఇప్పటి వరకు 89 పనిదినాల్లో ఇప్పటి వరకు 1,58,35,947 మందికి కంటి పరీక్షలు పూర్తి చేసుకొని అనుకున్న లక్ష్యానికి మించి రెండు కోట్లకు చేరుకునే దిశగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. డీఎంహెచ్‌వోలు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, కంటి వైద్యులు, సూపర్‌వైజర్లు, ఎన్ఏలు, ఆశాలు, డీఈవోలు సహా పంచాయతీ రాజ్ మున్సిపల్ ఇతర శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారు. సర్వజనుల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర సర్కార్ కంటి వెలుగు పథకాన్ని తెచ్చింది.

ఈ పథకాన్ని జనవరి 18 నుంచి జూన్ 15 వరకు 100 రోజుల కార్యక్రమానిన జిల్లాలో విజయవంతంగా చేసేందుకు జిల్లా కలెక్టర్లు, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, పలు శాఖల అధికారులతో కలిసి శిబిరాల నిర్వహణకు ముందుగానే ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ముందస్తు ప్రణాళికలతో, నిరంతర పర్యవేక్షణకు రోజువారీ సమీక్షలు, విశ్లేషణ, వీడియో కాన్ఫరెన్స్‌లతో ఎప్పటికప్పుడు లోటుపాట్లు సవరించుకుంటూ కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. నివారించదగ్గ అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన రెండో దఫా కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 2018లో నిర్వహించిన మొదటి విడత కంటి వెలుగులో కోటి 50 లక్షల మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి 50 లక్షల కళ్లద్దాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సారి 100 పని దినాల్లోనే రాష్ట్ర ప్రజలందరికీ కంటి



పరీక్షలు నిర్వహించాలని లక్ష్యం నిర్దేశించుకోవడం జరిగింది. ఈ ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం పురోగతిపై ముఖ్యమంత్రి రోజువారీగా సమీక్ష చేస్తున్నారు. ఎంత మందికి పరీక్షలు నిర్వహించారు, ఎంత మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు అనే అంశాలను ప్రతిరోజూ తెలుసుకుంటున్నారు. స్క్రీనింగ్ పూర్తి చేసిన తరువాత వెంటనే రీడింగ్ గ్లాసెస్, నాలుగు వారాల్లోగా ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ తప్పకుండా అందేలా చూస్తున్నారు. క్యాంపుల నిర్వహణ ప్రణాళికతో నిర్వహిస్తున్నారు. సిబ్బందికి అవసరమైన భోజన, వసతి, వాహన సదుపాయాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు.

## కేంద్రమంత్రి అశ్విన్‌తో ఎపి మంత్రి అమర్నాథ్ భేటీ

### రాష్ట్ర ప్రభుత్వ సహాయక చర్యలను అభినందించిన రైల్వే మంత్రి



ఆదివారం కటక్‌లో రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్‌తో భేటీ అయిన మంత్రి మంత్రి అమర్నాథ్

**విశాఖపట్నం, జూన్ 4, ప్రభాతవార్త:** కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌తో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదివారం మధ్యాహ్నం కటక్‌లోని ప్రభుత్వ అతిథి గృహంలో భేటీ అయ్యారు. వీరిద్దరూ ప్రమాద ఘటన జరిగిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సహాయక చర్యల గురించి మంత్రి అమర్నాథ్ కేంద్రమంత్రికి వివరించారు. రాష్ట్రంలో పలు ప్రాంతాలలో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేశామని బంధువులకు వీలైనంత త్వరగా అందజేసే ప్రక్రియను చేపట్టామని అమర్నాథ్ మంత్రి అశ్విన్ వివరించారు. రాష్ట్రంలో పలు ప్రాంతాలలో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేశామని బంధువుల ఆచూకీ తెలియని వారు వారి ఫోటోలు నేరుగా కంట్రోల్ రూమ్‌కు వాట్సాప్ ద్వారా పంపిస్తే సదరు వ్యక్తుల సమాచారాన్ని బంధువులకు వీలైనంత త్వరగా అందజేసి ప్రక్రియను చేపట్టామని అమర్నాథ్ మంత్రి అశ్విన్ వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి వైష్ణవ్ గతంలో రైలు ప్రమాదాలు జరిగినప్పుడు కేవలం రైల్వే శాఖ మాత్రమే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసేదని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇప్పుడు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడాన్ని తాను తొలిసారిగా వింటున్నానని చెప్పారు. ఇటువంటి సహాయక చర్యలు చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని తాను అభినందిస్తున్నానని వైష్ణవ్ చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి తన వెంట ఉన్న అధికారులను పిలిచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న సహాయక చర్యలపై వివరాలు నమోదు చేసుకోవాలని అశ్విన్ సూచించారు. అలాగే ఘటన జరిగిన వెంటనే ముగ్గురు ఐపీఎస్, ముగ్గురు ఐఏఎస్ అధికారులతో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసి సహాయక చర్యలలో నిమగ్నం చేయడం పట్ల కూడా కేంద్రమంత్రి అభినందించారు. ఈ దశలో మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ 342 మంది ప్రయాణికులను స్వల్ప వ్యవధిలోనే గుర్తించామని చనిపోయిన వ్యక్తిని గుర్తించి అతని మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించి ఎక్స్‌గ్రేషియా కూడా ప్రకటించామని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ సత్వర చర్యలు పట్ల ఇటువంటి చర్యల వలన బాధితులను త్వరితగతిగా గుర్తించడమే కాకుండా మరణాల సంఖ్యను కూడా తగ్గించడానికి వీలవుతుందని అశ్వన్ వైష్ణవ్ అభిప్రాయపడ్డారు. అనంతరం మంత్రి అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ రైలు ప్రమాద దుర్ఘటనలో ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు చాలా వరకు సురక్షితంగా బయటపడినట్లు కేంద్ర రైల్వే మంత్రికి చెప్పానని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లలో తమ వారి వివరాలు తెలుసుకునేందుకు పెద్దగా ఎవరూ రానుందున క్యాజువాలిటీస్ పెరిగే అవకాశం లేదని అశ్విన్ వైష్ణవ్‌కు వివరించారు.

## గంగానదిపై కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న వంతెన



**పాట్నా, జూన్ 4:** రాష్ట్రంలోని భాగల్పూరులో నిర్మాణంలో ఉన్న ఒక వంతెన కూలిపోయింది. పేకమేడలా ఒకేసారి కుప్పకూలిపోవడం వంతెన నిర్మాణ పటిష్టతను సూచిస్తోంది. గంగానదిపై నాలుగలేన్ల రహదారితో ఈ వంతెనను నిర్మిస్తున్నారు. వరుసగా రెండోసారి ఈ నదిపై వంతెన కుప్పకూలడం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెపుతున్నారు. 2014లో ఈ వంతెనను ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ప్రారంభించారు. సుల్తాన్‌గంజ్, ఖగారియా జిల్లాలను కలుపుతూ ఈ వంతెన నిర్మాణం జరిగింది. వంతెన కూలిపోయిన సంఘటనపై ముఖ్యమంత్రి విచారణకు ఆదేశించారు. దోషులుగా తేలిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అగువాని సుల్తాన్‌గంజ్‌మధ్య నిర్మాణంలో ఉన్న వంతెన నాలుగు, ఐదు పిల్లలర్లు దెబ్బతిని ధ్వంసం అయిపోవడంవల్ల కూలిపోయినట్లు సమాచారం అందిందని బాగల్పూరు జిలాన లమేజిస్ట్రేట్ సుబ్రాత్‌కుమార్‌సేన్ వెల్లడించారు. ఈ సంఘటనను సాకుగా తీసుకున్న బిజెపి రాష్ట్ర అద్యక్షుడు సామ్రాట్‌చౌదరి మాట్లాడుతూ నితీష్‌కుమార్ ఆధ్వర్యంలోని బీహార్‌ప్రభుత్వంలో అవినీతిపెరిగిపోయిందని ఆరోపించారు. గత ఏడాది డిసెంబరులోకూడా ఒక వంతెన రెండుముక్కలయి బుర్హి గందక్ నదిలో కూలిపోయింది. బేగుసరాయి జిల్లాలో ఈసంఘటన జరిగింది. అయితే ఏ ఒక్కరూ గాయపడలేదు.

## యుపిలో 90 యేళ్ల వృద్ధుడికి జీవితఖైదు

**లక్నో, జూన్ 4:** ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌కోర్టు 50 ఏళ్ల వృద్ధుడికి యావజ్జీవ శిక్ష విదించింది. ఒక హత్యకేసులో దోషిగా తేల్చిన కోర్టు జైలుశిక్షతోపాటు రూ.50వేల జరిమానాకూడా విదించింది. హత్యాయత్నానికి సంబంధించిన మరోకేసులో పదేళ్లజైలు ఐదువేల జరిమానా కూడా విదించింది. 90 ఏళ్ల వృద్ధుడిపై హత్య, హత్యాయత్నం కేసులు ఏంటని అందరూ విస్తుపోతున్నారు. సుమారు 42 ఏళ్లకిందట జరిగిన పదిమంది దళితుల హత్యకు సంబంధించిన కేసు. వాయిదాలపై వాయిదాలుపడుతూ ఇన్నిరోజులకు తీర్పువచ్చింది. దీనితోపోలీసులు ఈవృద్ధుడిని అరెస్టుచేసి జైలుకు పంపించారు. చేతికర్ర సాయంతో నిలబడ్డ వృద్ధుడిని ఇద్దరుపోలీసులు చెరోపక్క పట్టుకుని జైలుకు తీసుకువెళుతున్న ఫోటోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. యుపిలోని మైయిన్‌పురి జిల్లా షికోహాబాద్ సమీపంలోని సాధూపూర్‌లో 1981లో పదిమంది దళితులు హత్యకు గురయ్యారు. సాధూపూర్ రేషన్‌డీలర్ గంగాదయాళ్‌కు ఆ దళితులకు జరిగిన ఘర్షణ ఈ హత్యలకు దారితీసింది. మరో తొమ్మిది మందితోకలిసి గంగాదయాల్ విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో పదిమంది దళితులు ప్రాణాలు వదిలారు. దీనిపై అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గంగా దయాళ్‌తోపాటు పదిమందిపై కేసులు నమోదయ్యాయి. నిందితులను జైలుకు పంపగా కొన్నాళ్ల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చారు. కేసు విచారణలోనే నిందితులు ఎక్కువమంది చనిపోయారు. ప్రస్తుతం గంగా దయాళ్ ఒక్కడే జీవించి ఉన్నాడు. రెండేళ్లక్రితం ఈ కేసు ఫిరోజాబాద్‌కోర్టుకు బదిలీ అయింది. సుమారు 42 ఏళ్లు విచారణలోనే గడచిపోయాయి. తాజాగా ఈకేసులో గంగాదయాళ్‌ను పోలీసులు ఇపుడు జైలుకు తరలించారు.

## పెళ్లయినరోజే గుండెపోటుతో నవదంపతుల మృతి

**లక్నో, జూన్ 4:** పెళ్లిరోజే ఆ నవదంపతులకు చివరి రోజైంది. బంధువులు స్నేహితులతో కళకళలాడుతున్న ఆ ఇంట్లో ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి. మూడుముళ్లతో ఒక్కటై గంటలు కూడా గడవకముందే ఆ నూతన జంట తిరిగిరాని లోకాలకువెళ్లిపోయింది. ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే 22 ఏళ్లప్రతాప్ యాదవ్‌కు 20 ఏళ్ల పుష్పతో వివాహంజరిగింది. పెళ్లి తంతు పూర్తయిన తర్వాత వాళ్లిద్దరూ పడక గదికివెళ్లారు. తీరా తెల్లారిచూసేసరికి ఇద్దరూ మంచంపై విగతజీవులుగా పడి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దగ్గర్లోని ఆసుపత్రికి తరలించారు. నూఐతన దంపతుల మృతికి గుండెపోటు కారణమని పోస్టుమార్టంలో తేలిందని జిల్లా ఎస్పీ వివరించారు. తాజాగా వారిద్దరికీ ఒకేచోట దహనసంస్కారాలు నిర్వహించారు. మే 30న జరిగిన ఈసంఘటన సోషల్‌మీడియాలో ఇపుడు వైరల్ అవుతోంది.

## ఫోన్ సమాచారంలేని ప్రయాణికులను గుర్తించండి



### కోరమాండల్ ఘటనలో మృతి చెందిన శ్రీకాకుళానికి చెందిన గురుమూర్తి కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా
### క్షతగాత్రుల కుటుంబాలకు రూ.5 లక్షలు,
### స్వల్పంగా గాయపడిన వారికి రూ.లక్ష: ఎపి సిఎం జగన్
### ఘటనలో ఇంకా లభ్యంగాని 28 మంది ఆచూకీ

**విజయవాడ,జూన్4,ప్రభాతవార్తప్రతినిధి:** ఒడిశాలో ఘోరప్రమాద ఘటనలో ఇప్పటికి ఫోన్‌కు అందుబాటులోకి రాని ప్రయాణీకుల ఆచూకీ తెలుసుకునేందుకు విస్తృత చర్యలు చేపట్టాలని ఏపీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశించారు.వారి ఫోన్ నెంబర్ల ఆధారంగా లోకేషన్లు గుర్తించి వారి ఇళ్ళకు అధికారులను పంపి వివరాలు తెలుసుకోవాలని అధికారులకు సూచించారు.ఘటనలో మృతి చెందినట్లు గుర్తించిన వారికి రూ.10లక్షలు ఆర్థిక సహకారాన్ని,తీవ్ర క్షతగాత్రులకు రూ.5 లక్షలు.పాక్షికంగా గాయపడిన వారికి రూ.1లక్ష ఇవ్వాలని ఆదేశించారు.

కేంద్ర సాయానికి అదనంగా ఈ చేయూతను ఇవ్వాలన్నారు.ఒడిశాలోని బాలాసోర్ వద్ద జరిగిన రైలు ప్రమాద ఘటనపై సీఎం జగన్ నేడుకుడా అధికారులతో అత్యవసర సమాచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన అధికారులను తాజా వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ ఘటనలో శ్రీకాకుళానికి చెందిన గురుమూర్తి మృతి చెందినట్లు అధికారులకు ఆయన తెలిపారు.మృతుని కుటుంబానికి సీఎం జగన్ తక్షణ సాయంగా రూ.10లక్షలు ప్రకటించారు. క్షతగాత్రులకు, పాక్షిక క్షతగాత్రులను గుర్తించి వారికి నష్టపరిహారం అందించాలని ఆదేశించారు. ఒడిశాలో ప్రమాదానికి గురైన కోరమాండల్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ల్లో మొత్తం 695మంది ఏపీ వాసులున్నట్లు అధికారులు సీఎం జగన్ దృష్టికి తీసుకుని వచ్చారు.వీరిలో 553 మంది సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు.92 మంది ప్రయాణికులు రిజర్వేషన్ చేయించుకున్నా తాము ప్రయాణం రద్దు చేసుకున్నట్లు వివరించారు.మిగిలిన వారిలో 28మంది ఇంకా ఫోన్‌కి అందుబాటులోకి రాలేదన్నారు.ఫోన్ నెంబరు ఆధారంగా లోకేషన్లు గుర్తించిన వారి ఇళ్ళకు వెళ్ళి కుటుంబసభ్యులు ద్వారా వివరాలు తెలుసుకోవాలని సీఎం జగన్ అన్నారు. ఘటన స్థలాల్లోను వారిని గుర్తించే చర్యలు ముమ్మరం చేయాలన్నారు. రిజర్వేషన్ చార్ట్ ప్రకారం కోరమాండల్‌లో 484,యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో 211 మంది ఏపీ ప్రయాణికులు ఉన్నట్లు గుర్తించామని అధికారులు సీఎం జగన్‌తో తెలిపారు. యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతిలో 107 మంది ఎక్కారని తెలిపారు.జనరల్ బోగిల్లో ప్రయాణికుల వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

ఈ సమాచారాన్ని ఒడిశాలోని వివిధ ఆస్పత్రుల నుంచి మంత్రి అమర్ నాథ్, ఐఏఎస్ అధికారుల బృంద సేకరిస్తోం దన్నారు.ఈ రైలు ప్రమాదాల ఘటనలో రాష్ట్రాని చెందిన ఒక్కరు మృతి చెందినట్లు గుర్తించామన్నారు.ఇంకా ఎవ్వరైనా ఉన్నది లేని తెలియవలసి ఉందన్నారు.ప్రమాద ఘటనల్లో మృతి చెందిన 180 మంది మృతదేహాలు వివరాలు గుర్తించాల్సి వుందన్నారు. దాదాపుగా అందులో ఏపీ వారు ఉండరని భావిస్తున్నట్లు తెలిపారు. 22 మంది గాయపడినట్లు గుర్తించి వారి చికిత్స అందించినట్లు అధికారులు సీఎం జగన్ దృష్టికి తీసుకుని వెళ్ళారు.రైలు ప్రమాద ఘటనలో అందరిని సురక్షితంగా ఇళ్ళకు చేర్చాలని సీఎం జగన్ ఆదేశించారు.

## మధ్యాహ్న భోజనంలో వెజ్‌బిర్యానీ

### ఇకపై ప్రతిరోజూ మిక్స్‌డ్ కర్రీ.. ఒకరోజు కిచిడి
### మధ్యాహ్న భోజనంలో కొత్త మెనూ
### 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం నుంచే అమలు

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్‌తోపాటు ఎయిడెడ్ స్కూల్స్‌లోనూ అందజేస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ మారనుంది. ఇకపై వారానికి ఒక రోజు వెజిటేబుల్ బిర్యానీని అందించనున్నారు. దాంతోపాటు ప్రతి రోజూ విద్యార్థులకు మిక్స్‌డ్ కర్రీతో భోజనం పెట్టనున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజనం మెనూలో మార్పులు చేసింది. మార్చిన మెనూను వేసవి సెలవుల తరువాత పాఠశాలలు పునః ప్రారంభం కానున్న జూన్ 12 నుంచే ఈ కొత్త మెనూను అమలు చేయాలని పాఠశాల విద్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. మారిన మెనూ మూలంగా రాష్ట్రంలోని సుమారు 22 లక్షల మంది పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందే అవకాశం ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల అధ్వర్యంలో కొనసాగే స్కూల్స్‌తోపాటు ఎయిడెడ్ స్కూల్స్‌లోనూ ఉచితంగా మధ్యాహ్న భోజనంను అమలు చేస్తున్నారు. ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వం వాటాతోపాటు రాష్ట్ర ప్రభుత్వం వాటాతో పథకాన్ని కొనసాగిస్తున్నారు. అయితే కేంద్రం కేవలం 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు మాత్రమే మధ్యాహ్న భోజనానికి నిధులు సమకూరుస్తుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 9, 10 తరగతుల విద్యార్థులకు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే మధ్యాహ్న భోజనంను అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో మధ్యాహ్న భోజనం పథకం ద్వారా సుమారు 22 లక్షల మంది పేద విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. ఇప్పటి వరకు మధ్యాహ్న భోజనంలో సాధారణంగా పప్పుతోపాటు ఒక కూరతో వారానికి మూడుసార్లు కోడిగుడ్లను విద్యార్థులకు అందజేస్తున్నారు. విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును కేంద్ర విద్యాశాఖ అధ్వర్యంలోని జాయింట్ రివ్యూ మిషన్ బృందం పరిశీలించింది. పరిశీలించిన అనంతరం విద్యార్థులకు అందించే మెనూను మార్చాలని సూచించింది. జాతీయ పోషకాహార సంస్థ కూడా కొత్త మెనూను రూపొందించింది. ఈ నేపథ్యంలోనే విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పథకంలో మెనూను మార్చారు. అందులో భాగంగా ఇకపై వారంలో ఒకరోజు వెజ్‌బిర్యానీ, ఒక రోజు కిచిడి తప్పనిసరిగా అందజేయాలని నిర్ణయించారు. వావటితోపాటు ప్రతి రోజూ మిక్స్‌డ్ వెజిటబుల్స్‌తో కర్రీని అందించనున్నారు. అలాగే వారంలో రెండుసార్లు సాంబారు కూడా విద్యార్థులకు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మధ్యాహ్న భోజనంకు ఇస్తున్న మెటీరియల్ ఖర్చు సరిపోవడంలేదని మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికులు చెబుతున్నారు. గతంలో అమలు చేసిన మెనూకే నిధులు సరిపోలేదని చెప్పారు. మరీ ఇప్పుడు మారిన మెనూను అమలు చేస్తారా? లేదా? అనేది చూడాలి. అయితే మారిన మెనూను పాఠశాలలు ప్రారంభం కానున్న జూన్ 12 నుంచే అమలు చేయాలని ఆదేశిస్తూ ఇప్పటికే పాఠశాల విద్య శాఖ డైరక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారులకు లేఖలు రాశారు.

## స్కాలర్‌షిప్‌ల దరఖాస్తుకు 15 వరకు గడువు

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త :** తెలంగాణలో 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం కల్పిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ నిర్ణయం తీసుకుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం ఫ్రెషర్లు, రెన్యువల్ విద్యార్థులు ఈ నెల 15వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకునే వీలును కల్పించింది. ఇందుకు గాను ఈ నెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకూ ఈ పాస్ వెబ్ సైట్లో ఆన్ లైన్ దరఖాస్తు అందుబాటులో ఉంటుందని తెలిపింది. అర్హులైన సాంఘి, గిరిజన, వెనుకబడిన తరగతులు, మైనార్టీ, దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు ఇపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

## ఏ.కొత్తపల్లిలో ఘోర ప్రమాదం



### గ్రావెల్‌లోడు టిప్పర్ బీభత్సం
### ముగ్గురు అక్కడికక్కడే మృతి
### నేలమట్టమైన ఆలయం

**శంఖవరం, జూన్ 4ప్రభాతవార్త:** తొండంగి మండలం ఏ.కొత్తపల్లి గ్రామంలో శనివారం రాత్రి మోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ క్లీనర్‌తో పాటు స్థానికుడు మృతి చెందారు. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో అన్నవరం వైపు నుండి తొండంగి వైపు గ్రావెల్ లోడుతో వెళ్తున్న టిప్పర్ ఏ.కొత్తపల్లి గ్రామ శివారున గల వాటర్ ట్యాంకును బలంగా ఢీకొట్టి ఎదురుగా ఉన్న వినాయక ఆలయాన్ని సైతం ఢీకొట్టింది.దీంతో వినాయక ఆలయం పక్కన గల మండపం నేలమట్టం కావడంతోపాటు మండపంలో నిద్రిస్తున్న గ్రామానికి చెందిన తూము లక్ష్మణరావు (50) మృతిచెందారు. టిప్పర్ డ్రైవర్ చుక్కల చంద్రశేఖర్ (28), కోసూరి నాగేంద్ర (23) మృతిచెందారు. డ్రైవర్ క్లీనర్లు ప్రత్తి పాడు మండలం గర్జనపూడి గ్రామానికి చెందిన వారిగా పోలీసులు చెబుతున్నారు. ప్రమాద విషయం తెల్సిన వెంటనే ఒంటిమామిడి ఎస్సై రవికుమార్ సంఘటనా ప్రాంతానికి చేరుకుని జేసిబి సహాయంతో మండపం కింద ఇంకా ఎవరైనా ఇరుక్కుని ఉన్నారా అని లారీని వెనక్కి లాగి భవనం స్లాబన్ను ప్రక్కకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణం అయిన టిప్పర్ వాటర్ ట్యాంకును ఢీకొని వినాయక ఆలయాన్ని ఢీకొట్టింది. అదే రెండు అడుగుల పక్కనే గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఢీకొని ఉంటే ప్రమాద తీవ్రత మరింత ఎక్కువగా ఉండేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తొండంగి మండలం ఏ.కొత్తపల్లిలో శనివారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదంతో పెళ్ళంట విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మృతుడు తూము లక్ష్మణరావుకు ముగ్గురు కుమార్తెలు, ఒకరు కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తెకు జూన్1న వివాహం చేశారు.

## నగరంలో పలుచోట్ల ఒకేరోజు ఇద్దరు పిల్లల కిడ్నాప్

### రెండు గంటల్లో ఛేదించిన మహంకాళి పోలీసులు

**హైదరాబాద్ (బేగంపేట), జూన్ 4, ప్రభాతవార్త:** వేరువేరు చోట్ల ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేసిన ఇద్దరు నిందితులను మహంకాళి పోలీసులు ఆదివారం అరెస్టుచేశారు. ఘటన జరిగిన రెండు గంటల్లోనే కిడ్నాప్ కేసును చేధించి ఇద్దరు చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఒక ఘటన మహంకాళి పోలీస్‌స్టేషన్ కాగా, మరో ఘటన సుల్తాన్బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదివారం ఉత్తర మండలం డిసిపి చందనాదీప్తి మహంకాళి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ ప్రాంతంలో మేఘరాజ్ కాలే అనే వ్యక్తి గత 30 ఏళ్ళుగా తన కుటుంబంతో కలిసి వివిధ రకాల వస్తువుల విక్రయిస్తూ ఫుట్పాత్‌పై ఉంటూ జీవనంసాగిస్తునన్నారు. వీరికి 7గురు సంతానం కాగా 5మంది బాలికలు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ప్యారడైజ్ ఎదురుగా ఉండే దాదూస్ స్వీట్స్ ఎదరుగా పుట్పాత్‌పై శనివారం రాత్రి పడుకున్నారు. ఆదివారం తెల్లవారు జామున 3.40 గంటల సమయంలో ఆటోలో వచ్చిన ఒక పురుషుడు, మరో మహిళ మూడున్న రేళ్ళ కమార్తె కరిష్మాను అపహరించుకుని వెళ్ళారు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఒ వ్యక్తి దీన్ని గమనించి కాలే కుటుంబ సభ్యులకు విషయం తెలిపాడు. నిందితులు ఆటోలో ఎంజీరోడ్డు మీదుగా వెళ్ళిపోయారు. తెల్లవారు జామున 4.15 నిమిషాలకు కరిస్మా తండ్రి కాలే మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

**సుల్తాన్‌బజార్లో ఏడున్నరేళ్ల బాబు అపహరణ**

అనంతరం ఇదే ముఠా హనుమాన్ టెకీ ప్రాంతంలో పుట్పాత్‌పైన నివసిస్తూ అబిడ్స్‌లోని గ్రాండ్ హోటల్లో స్వీపర్లుగా పనిచేసే దంపతుల కుమారుడు శివకుమార్‌ను అలాగే అపహరించారు. ఫిర్యాదు అందగానే ఉత్తర మండలం డిసిపి చందనా దీప్తి ఆదేశాల మేరకు మహంకాళి ఏసిపి రమేష్, ఇన్స్‌పెక్టర్ కావేటి శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్, మార్కెట్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు తదితరులతో పాటు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. ఆటోలో ప్రయాణించిన మార్గంలో సిసి పుటేజ్‌లను పరిశీలించారు. సిసి సహాయాంతో రెండు గంటల్లోనే ప్రధాన నిందితుడి ఫలక్నామా ప్రాంతంలోని నిందితుడి ఇంటి వద్ద ఉండగా పోలీసులు అరెస్టుచేశారు. రెండు గంటల్లోనే కేసును చేధించి ఇద్దరు చిన్నారులను రక్షించడం పట్ల డిసిపి పోలీసులను అభినందించారు. .

## గాలిలో దీపంలా మారిన రైలు ప్రయాణం

### నిన్నటి వరకు మానవ తప్పిదాలు.. నేడు సిగ్నలింగ్ వైఫల్యం
### ఖాళీగా ఉన్న 2.60 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలంటున్న ఉద్యోగ సంఘాలు
### అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతికి స్వస్తి పలకాలంటున్న సంఘాల నేతలు

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** ఒడిశాలోని బలాసోర్ జిల్లా బహనాగ్ వద్ద శుక్రవారం జరిగిన ఘోర రైలు ప్రమాదం రైల్వేలో భద్రతను మరోసారి ప్రశ్నార్థకం చేసింది. సామూహిక రవాణా వ్యవస్థలో ప్రపంచంలోనే రెండస్థానం దేశంలో మొదటిగా వున్న భారతీయ రైల్వేలో నిన్నటి వరకు మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు జరగగా ఇప్పుడు బహనాగ్‌లో సిగ్నలింగ్ వ్యవస్థ కారణంగా కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఏకంగా ఆగివున్న గూడ్స్ రైలును ఢీకొంది. మెయిన్‌లో వెళ్లేందుకు అనుమతి పొందిన ఈ రైలు వున్నట్లుండి లూప్‌లైన్‌లో వెళ్లి అక్కడ ఆగివున్న గూడ్స్ రైలును 128 కిలోమీటర్ల వేగంతో ఢీకొనడంతో మొత్తం 20 బోగీలు పట్టాలు తప్పాయి. ఇదే సమయ ంలో ఎదురుగా బెంగళూరు నుంచి హౌరా వెళుతున్న మరో ఎక్స్‌ప్రెస్ రైలు సైతం ఈ ప్రమాదంలో చిక్కుకుంది. ఈ దుర్ఘటనలో 300 మంది వరకు ప్రయాణీకులు మరణించగా సుమారు వెయ్యి మందికి పైగా గాయపడ్డారు. ఈ ప్రమాదంపై విచారణకు రైల్వే శాఖ హై లెవల్ కమిటీని నియమించగా ఉద్యోగ సంఘాలు, సంఘాల నే తలు మాత్రం కేంద్రంపై దుమ్మెత్తి పోయసాగారు. బహనాగ్ దుర్ఘటనకు రైల్వే శాఖ వైఫల్యం కారణమని, ముఖ్యంగా రైల్వేలో కొనసాగుతున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్దతి ఉద్యోగాలకు స్వస్తి పలికి, ఖాళీగా వున్న 2.60 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేయసాగారు.

రైలు ప్రయాణం గాలిలో దీపంలా మారిందని బహనాగ్ దుర్ఘటన మరోసారి తేల్చింది. ఇటీవల కాలంలో రైల్వే శాఖలో భద్రతకు పెద్దపీట వేయడంతో పాటు అనేక చర్యలు చేబట్టిన తరువాత ప్రమాదాల సంఖ్య తగ్గిందని గణాంకాలు చెబుతున్నా అనేక సందర్భాలలో మానవ తప్పిదాల వల్ల దుర్ఘటనలు జరగడం తెలిసిందే. నాలుగేళ్ల క్రితం కాచిగూడ స్టేషన్‌లో ఎంఎంటిఎస్ రైలు ఎదురుగా వస్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును ఢీకొనడం, అంతకు ముందు తెలుగు రాష్ట్రాల్లో జరిగిన పలు ప్రమాదాలు ఇదేరీతిన జరగడం గమనార్హం. రైల్వేలో ప్రమాదాలు తగ్గినట్లు అధికారులు చెబుతున్నా బహనాగ్ దుర్ఘటన రైల్వేలో భద్రత అంతా డొల్లగా వుందని తేటతెల్లం అయి ్యంది. బహనాగ్ దుర్ఘటనకు సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం వుందని ప్రాథమిక విచారణలో తేలింది. మెయిన్ లైన్‌లో వెళ్లేందుకు అనుమతి తీసుకున్న రైలు లూప్‌లైన్‌లో ఎలా వెళ్లిందనేది ఇప్పటికీ మిస్టరీగానే వుంది. ఇలా ఎందుకు జరిగిందనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. రైల్వేలో ఇటీవల కాలంలో సిగ్నలింగ్ వ్యవస్థ అంతా ఆటోమేటిక్‌గా మారింది. గతంలో మాన్యువల్‌గా వున్నదానిని ఆటోమేటిక్‌గా మార్చి సమయపాలనను పెంచారు. అంతవరకు బాగానే వున్నా ఆటోమేటిక్‌గా మారిన సిగ్నలింగ్ వ్యవస్థను నిపుణులైన వారు నిత్యం పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా వుందని ఉద్యోగ సంఘాల నేతలు అంటున్నారు. ఎంత పెద్ద టెక్నాలజిని అమలు చేయాలన్నా దానికి నిపుణులు అవసరమని వారంటున్నారు. రైల్వేలో ఇప్పుడు పదవీ విరమణ చేసిన నిపుణుల స్థానంలో కొత్తవారిని నియమించుకునే బదులు కాంట్రాక్ట్ పద్దతిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకుంటున్నారని ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు సరైన శిక్షణ వుండడం లేదని, వారంతా కేవలం తూతూ మంత్రంగా ఉద్యోగాలు చేయడం వల్ల సిగ్నలింగ్ వ్యవస్థ సహా అనేక వ్యవస్థలు సరిగ్గా పనిచేస్తున్నాయా,,,? లేదా...? అనేది తెలియకుండా పోయిందని వారంటున్నారు. దేశ వ్యాప్తంగా రైల్వేలో రెండు లక్షల 60 వేల ఉద్యోగాలు ఖాళీగా వున్నాయని, ఇంత భారీ స్థాయిలో ఖాళీలు వుండడం రైల్వే శాఖ లో ఇదే తొలిసారని ఉద్యోగ సంఘాల నేతలు అంటున్నారు. రైల్వేలో సిగ్నలింగ్ వ్యవస్థ ఆటోమేటిక్‌గా మార్చడం మంచిదే అయినా ఇదే సమయంలో ఈ వ్యవస్థ నిపుణులైన అధికారుల పర్యవేక్షణలో నిరంతరం వుండాల్సిన అవసరం కూడా వుందని వారంటున్నారు. సిగ్నలింగ్ వ్యవస్థ అంటే రైళ్లు ముందుకు వెళ్లేందుకు, ఆగేందుకు మాత్రమే కాదని, రైళ్లన్నీ సవ్యంగా రాకపోకలు సాగించేందుకు అనే విషయాన్ని అధికారులు మరచిపోకూడదని వారు చెబుతున్నారు. సిగ్నలింగ్ వ్యవస్థను నిపుణులైన వారు పర్యవేక్షించకుంటే ఏం జరుగుతుందో...? బహనాగ్ దుర్ఘటన తేటతెల్లం చేసిందని ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. బహనాగ్ దుర్ఘటనకు నిపుణులైన వ్యక్తులు సిగ్నలింగ్ వ్యవస్థను అజమాయిషీ చేయకపోవడం వల్లే జరిగిందని వారంటున్నారు. సిగ్నలింగ్ వ్యవస్థ ఆటోమేటిక్‌గా మారిపోయిన తరువాత అనేకచోట్ల లోపాలు తలెత్తినా దీనిపై ఎవరూ నోరుమెదడం లేదని వారంటున్నారు.

**వానకాలం ప్రమాదాలపై అప్రమత్తత అవసరం**

ఇదిలావుండగా రైల్వే శాఖకు వానా కాలం గడ్డు కాలంగా చెప్పాలి. ఈ సమయంలో వానల వల్ల కాలువలు, చెరువులు పొంగి రైలు పట్టాల మీదుగా వరదనీరు ప్రవహించి అనేకచోట్ల పట్టాల కింద మట్టి, కంకర కొట్టుకుపోవడం జరుగుతుంటుంది. ఇటువంటి సమయలో అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వుంటుంది. 2003లో ఉమ్మడి నల్లగొండ జిల్లా వలిగొండ వద్ద డెల్టా ప్యాసింజర్ రైలు వరదల కారణంగా పట్టాలు తప్పడంతో వంద మందికిపైగా ప్రయాణీకులు మరణించారు. వానాకాలం లో అనేక రైలు ప్రమాదాలు జరిగిన ఉదంతాలున్నాయి. గతంతో పోలిస్తే రైల్వే శాఖలో ప్రస్తుతం కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఖ్య భారీగా పెరిగిందనేది వాస్తవం. పట్టాల పై ఈ క్రమంలోనే పర్యవేక్షణ లోపించిందనేది ఉద్యోగ సంఘాల నేతల వాదన. ఈ నేపథ్యంలో బహనాగ్ దుర్ఘటన తరువాత రాబోయే వానాకాలంలో ప్రమాదాల నివారణకు రైల్వే శాఖ ఎటువంటి చర్యలు తీసుకుంటుందో...? చూడాల్సి వుంది.

# రెండో ట్రైలర్‌పై పెరిగిన క్రేజ్



ఇండియా సినిమా లవర్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాల్లో 'ఆదిపురుష్' కూడ ఉంది.. పాన్‌ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా బాలీవుడ్ దర్శకుడు ఓంరౌత్‌తోచేసిన ఈ మూవీ విజువల్ వండర్ రామాయణం ఆధారంగా తెరకెక్కింది.. .ఈసినిమాపై ఒక్కసారిగా ఇంత హైప్ రావటానికి కారణం ఈసినిమా మొదటి ట్రైలర్ అనే విషయం తెలిసిందే.. ప్రభాస్‌ని విజువల్స్‌ని నెక్ట్స్ లెవల్‌లో ప్రజెంట్ చేసి రిలీజ్ చేసి ఈ ట్రైలర్‌తో ఒక్కసారిగా మారి పోయింది.. దీంతో ఇక్కడి నుంచి సెన్సేషనల్ హైప్ తెచ్చుకున్న ఈచిత్రం నుంచి రెండో ట్రైలర్ కూడ ఉందని టాక్ విన్పి స్తోంది.. దీనిపై లేటెస్ట్ బజ్ ఒకటి విన్పిస్తోంది. ఈ ట్రైలర్‌ను ప్రీరిలీజ్ ఈవెంట్ అంటే జూన్ 6న రిలీజ్ చేయనున్నారని తెలిసింది.. ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఉంటుందని భావిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 16న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమైంది.

# పవన్ సాదినేని వెబ్‌సిరీస్



ప్రేమ ఇష్క్ కాదల్, సావిత్రి సేనాపతి వంటిసినిమాలతో ప్రేక్షకుల నుంచి మంచి పేరు అందుకున్న యువ దర్శకుడు పవన్ సాదినేని.. తాజాగా ఆయన ఒక వెబ్‌సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు. ఏడాదికి పైగా కొత్త సిరీస్‌పై కసరత్తు చేస్తూ ఎట్టకేలకు తాజాగా టైటిల్ అనౌన్స్ చేశారు.. ప్రముఖ ఓటిటి డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ఈ వెబ్‌సిరీస్ ప్రసారం కానుంది.. ఈ తెలుగు వెబ్‌సిరీస్ టైటిల్ 'దయ'గా ఫిక్స్ చేశారు. ఈసిరీస్ పోస్టర్‌ను చిత్ర నిర్మాత అధికారికంగా ప్రకటించారు.. దీనికి సంబంధించిన వివరాలను త్వరలోనే తెలియజేస్తామని తెలిపారు.. జెడి చక్రవర్తి ఈసిరీస్‌లో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు.. ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. ఈ సిరీస్‌కు సంబంధించి మరిన్ని వివరాలను త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు.

# పాన్‌ఇండియా హీరో తదుపరి చిత్రం సంగతులు

పాన్ ఇండియా స్టార్ హీరో విజయ్ దేవరకొండ తాజాగా 'ఖుషి' అనేచిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే.. ఈచిత్రంలో స్టార్‌బ్యూటీ సమంత రూత్‌ప్రభు హీరోయిన్‌గా నటిసోతంది.. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతోంది చిత్రం. మైత్రీమూవీమేకర్స్ సంస్థ నిర్మిస్తోంది.. ఈ మూవీ తర్వాత విజయ్ దేవరకొండ ఏసినిమాలో నటిస్తున్నారనే విషయంపై ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉండగా ఇప్పటికే ఆయన పలు ప్రాజెక్టులను ఒప్పుకున్నారని తెలిసింది.. తాజాగా ఈ విషయంపై ఒకింత క్లారిటీ వచ్చింది.. ఖుషి సినిమా షూటింగ్ పూర్తయిన వెంటనే ఆయన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం



వహించనున్న చిత్రం షూటింగ్‌లో జాయిన్ కానున్నారని తెలిసింది.. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైన వెంటనే దిల్‌రాజు నిర్మాణంలో దర్శకుడు పరశురామ్ దర్శకత్వంలో చేయబోతున్న సినిమా కూడ స్టార్ట్ కానుంది.. దీంతో ఒకవైపు గౌతమ్‌తో మరోవైపు పరశురామ్ చిత్రాల్లో విజయ్ దేవరకొండ పనిచేయనున్నారు. ఒకేసారి ఈ రెండు చిత్రాల షూటింగ్‌ల్లో పాల్గొనున్నారని టాలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది.. పూర్తివివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.

# కలెక్షన్ల వర్షం... 'మేమ్ ఫేమస్'

సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన తాజాగా చిత్రం 'మేమ్ ఫేమస్'... చాయ్ బిస్కెట్ ఫిలిమ్స్, లహరి ఫిలిమ్స్ సంస్థలపై నిర్మించారు. ఈ యూత్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి సక్సెస్ అందుకుంది.. ఈ మూవీ ద్వారా చాలా మంది నూతన నటులు టాలీవుడ్‌కు పరిచయం అయ్యారు. కాగా తమ చిత్రానికి రెండో వారం



లో కొత్త సెంటర్లు కూడ యాడ్ చేయబడుతున్నాయని మేకర్స్ తెలిపారు. ఈ విలేజ్ డ్రామా మూవీలో సుమంత్ ప్రభాస్‌కు జోడీగా సారయా నటించింది.. మణి ఏగుర్ల, మౌర్యచౌదరి, సిరి రాసి, కిరణ్ మచ్చ, అంజిమామ, నరేంద్ర రవీ,మురళీధర్ గౌడ్, శివ నందన్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. కల్యాణ్ నాయక్ సంగీతం అందించారు. ఈచిత్రం బాక్సాఫీసు వద్ద మొదటి వారం మంచి వసూళ్లు రాబట్టుకుందని మేకర్స్ తెలిపారు. ఇప్పటిదాకా ఈచిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ.5.25కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసిందని మేకర్స్ వెల్లడించారు.. ఈమేరకు అధికార ప్రకటన చేశారు.

# పవర్ స్టార్ 'ఓజి' ముచ్చట్లు



పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ ప్రస్తుతం చేస్తున్న చిత్రాల్లో యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు సుజీత్ తెరకెక్కి స్తున్న సాలిడ్ యాక్షన్‌థ్రిల్లర్ చిత్రం 'ఓజి' కూడ ఉంది.. ఈచిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.. ఈ చిత్రాన్ని ఆల్‌రెడీ రెండు షెడ్యూల్స్ షూట్‌ని సక్సెస్‌ఫుల్‌గా మేకర్స్ కంప్లీట్ చేశారు. అలాగే మరోవైపు పవన్ ఫస్ట్ ప్రిపరెన్స్ కూడ ఈసినిమాకే ఉందని బజ్ ఉంది.. తాజాగా పవన్‌కల్యాణ్ ఈనెల 14 నుంచి తన రాజకీయ యాత్ర 'వారాహి' ను స్టార్ట్ చేయబోతున్నారనే సంగతి తెలిసిందే.. మరి ఈలోగా అన్నిడేట్స్ కూడ 'ఓజి' చిత్రానికి పవన్ ఇవ్వను న్నట్టు తెలిసింది.. దీంతో అప్పటి వరకు మాత్రం పవన్ ఓజి షూట్‌లోనే ఉంటారని అంటున్నారు. ఈచిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు.. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈచిత్రం భారీస్థాయిలో నిర్మితమవుతోంది.




# గోవా బ్యూటీ ఆసక్తికర పోస్ట్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఇలియానా.. 'దేవదాసు' మూవీతో ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ 'పోకిరి' మూవీతో స్టార్‌హీరోయిన్‌గా మారింది.. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేస్తూ వచ్చింది.. అంతేకాదు ఆపై బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది.. బర్ఫీ అనే మూవీఈతో ఎంట్రీ ఇచ్చిందక్కడ.. ఓ మాదిరి గుర్తింపు తెచ్చుకుంది.. అంతేకాదు సీనియర్ హీరోల సరనన కూడ బాలీవుడ్‌లోసినిమాలు చేసింది.. ఇదిలా ఉండగా, కొన్ని నెలల క్రితం తాను ప్రెగ్నెంట్ అంటూ ఇలియానా అధికారికంగా కన్ఫర్మ్ చేసింది.. ఆపై కొద్ది రోజులకు ఆమె బేబీబంప్‌తో ఫొటోలను షేర్ చేసింది. కాగా ఇలియానాకు పుట్టబోయే బిడ్డకు తండ్రి ఎవరనే ప్రశ్న సోషల్‌మీడియాలో విన్పి




స్తోంది. వాటిపై ఆమె ఎలాంటి సమాధానం ఇవ్వలేదు.. తాజాగా తనకు పుట్టబోయే బిడ్డ ఎవరనేది ఫేస్ రివీల్ చేయకుండా కేవలం అతని చేతులు ఫొటోలతో క్లారిటీ ఇచ్చింది.. వేరొక వ్యక్తితో ఇప్పటికే తనకు ఎంగేజ్‌మెంట్ కూడ అయినట్టుగా రింగ్స్ పెట్టుకుని ఉన్న ఫొటోను షేర్ చేసింది. ఈ ఫొటోకు ఒక కామెంట్ కూడ పెట్టింది.. 'నా రొమాంటిక్ ఐడియాతో ప్రశాంతంగా అతన్ని తిననివ్వలేదు..' అంటూ అర్థం కాని విధంగా పోస్ట్ పెట్టిందీ అమ్మడు. ఇపుడు ఇది వైరల్ అయ్యింది.. కాగా కొంతకాలంగా ఆమె కత్రినాకైఫ్ సోదరుడుతో లవ్‌లో ఉండదనే ప్రచారం కూడ ఉంది.. ఏదెలా ఉన్నా పూర్తివివరాలు తెలియాలంటే కొద్దిరోజులు వెయిట్ చేయక తప్పదు మరి.

# పాన్‌ఇండియా స్థాయిలో 'యానిమల్'


దర్శకుడు సందీప్ వంగ తెలుగులో 'అర్జున్‌రెడ్డి' మూవీతో ఓవర్‌నైట్ స్టార్ అయిపోయారు.. అదే తడవుగా బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు.. అర్జున్‌రెడ్డి మూవీని బాలీవుడ్‌లో కబీర్ సింగ్ పేరుతో రీమేకర్ చేసి అక్కడ కూడ స్టార్ డైరెక్టర్‌గా పేరొందారు. దీంతో వరుసగా స్టార్ హీరోల సినిమాలు క్యూకట్టాయి.. ప్రస్తుతం సందీప్ వంగ రణబీర్‌కపూర్‌తో 'యానిమల్' అనే చిత్రం చేస్తున్నారు.. గ్యాంగ్ స్టర్ కథాంశంతో యానిమల్ సినిమా మోస్ట్ వైలెంట్‌గా రానుంది.. రణబీర్‌కపూర్ హీరోగా రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. బాబీ డియోల్ ముఖ్యపాత్రలో నటించారు.. రణబీర్ కపూర్ యానిమల్ మూవీని పాన్‌ఇండియా రేంజ్‌లో విడుదల చేయాలని మేకర్స్ భావించారు.. హిందీతో పాటు పలు భాషల్లో విడుదల చేయాలని నిర్ణయించారు. ఈచిత్రాన్ని 2024 ఆగస్టు 11న పాన్‌ఇండియా రిలీజ్ చేస్తామని గతంలోనే ప్రకటించారు కూడ.. తాజా విషయం ఏంటంటే.. ఈ మూవీ సెట్స్ నుంచి ఒక వీడియో ఆన్‌లైన్‌లో లీక్ అయ్యిది.. దీంతో ఇది ఒక్కసారిగా సోషల్ మీడియాలో వైరల్‌గా ఆరింది. ఇందులో రణబీర్ లెక్చరర్‌గా కన్పించారు. అలాగే ఈ వీడియోలో ఆయన లుక్ చూసిన అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. మరో సూపర్‌హిట్ ఖాయమని అభిమానులంటున్నారు. రష్మిక మందన్న ఈచిత్రంలో హీరోయిన్‌గా నటించనుండటంతో ఈసినిమాకు మరో అదనపు బలంగా మారింది. టీసిరీస్ ఫిల్మ్స్, భద్రకాళీ పిక్చర్స్ సినీ 1 స్టూడియోస్ పతాకంపై భూషణ్ కుమార్, ప్రణయ్‌రెడ్డి వంగా తదితరులు నిర్మిస్తున్నారు. హర్షవర్థన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు.



# 'బేబీ' షూటింగ్ కంప్లీట్

యువ నటుడు ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా తెరకెక్కుతున్న తాజా యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఏబీ.. ఈ మూవీపై ప్రారంభం నుంచి సినీ ప్రేక్షకుల్లో మంచి బజ్ ఏర్పడింది.. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజ్ అయిన టీజర్‌తోపాటు ఓ రెండు ప్రేమ మేఘాలిలా ,... దేవరాజా పాటు సాలిడ్ చార్ట్ బస్టర్లుగా నిలిచాయి.. అలాగే ఇటీవల విడుదలైన ప్రేమిస్తున్నా.. అనే పాట మూడవ సింగిల్‌గా వచ్చి మంచి స్పందన అందుకుంది. తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ శనివారంతో ప్రొడక్షన్ పార్ట్ షూట్ మొత్తం పూర్తిచేసుకుంది.. ఇక బేబీ మూవీ జూలై 14న రిలీజ్ కానుంది.. మాస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎస్‌కెఎన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి రాజేష్ దర్శకుడు.. విరాజ్ అశ్విన్, నాగబాబు, లిరీషా, కుసుమ దేగలమర్రిఇ, సాద్విక్ ఆనంద్, బబ్లూ, సీత, మౌనిక , కీర్తన తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు.. విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు.




# న్యూ ట్రెండీ స్టైల్

మెగా ఫ్యామిలీ బ్యూటీ నిహారిక కొణిదెల తొలుత టివిలో యాంకరింగ్‌తో తన కెరీర్‌ను స్టార్ట్ చేసింది.. ఆ తర్వాత సినిమా ల్లోకి ఎంట్రీ ఇచ్చింది.. క్యూట్ లవ్‌స్టోరీలు సరదాగా నవ్వుకునే సినిమాలు ఎంచుకున్నారామె.. నటిగా ఆమెను అందరూ గుర్తించారు కూడ. అపై ఆమె నిర్మాణ రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది.. నిర్మాతగా కొనసాగుతోంది.. ఇదిలా ఉండగా ఆమె మరోసారి ప్రేక్షకులను అలరించటానికి రెడీ అయ్యిందని తెలిసింది.. డెడ్ పిక్సెల్స్‌తో తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిం చారు.. కాగానిహారిక సోషల్‌మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుందనే సంగతి తెలిసిందే.. ఇటీవల తాను ట్రిప్‌కి వెళ్లినఫొటోలను షేర్ చేసింది.. తాజాగా ఓక్యూట్ ఫొటోను పోస్ట్‌చేసింది.. పింక్ టాప్‌లోమైండ్ బ్లోయింగ్ ఫోజు ఇచ్చింది. ఈ ఫొటోలు నెట్టింట బాగా వైరల్ అవుతున్నాయి. కొందరు యూట్యూబర్స్‌తో కలిసి ఆమె ట్రిప్‌కు వెళ్లటం విశేషం. కెరీర్ విషయానికొస్తే.. డెడ్‌పిక్సెల్స్ అనే వెబ్‌సిరీస్‌లో నటించిది. అందులో గేమ్ తప్ప మరో ప్రపంచం తెలియని అమ్మాయిగా నటించింది. ప్రస్తుతం ఆమె తన కెరీర్‌పైనేఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది.. అంతేకాదు ఇటీవల ఓ మూవీకి పూజాకార్యక్రమాలు నిర్వహించింది..

# ఓటిటిలో దూసుకుపోతున్న 'ఉగ్రం'



టాలీవుడ్ టాలెంటెడ్ హీరో అల్లరి నరేష్ కామెడీ ట్రాక్ మార్చి నటుడిగా తనను తాను ప్రూవ్ చేసుకుం టున్నారు. ప్రస్తుతం పలు సీరియస్ డ్రామాలు చేస్తున్నారు. ఈచిత్రాల్లో దర్శకుడు విజయ్ కనకమేడలతో చేసి ఇంటెన్స్ కోర్ట్ డ్రామా'నాంది'తో తన కెరీర్‌లో మంచి హిట్ అందుకున్నారు. మళ్లీ అదే దర్శకుడితో తానుచేసిన లేటెస్ట్ సీరియస్ యాక్షన్ డ్రామా 'ఉగ్రం'.. అల్లరి నరేష్‌లోని సరికొత్త కోణాన్ని చూపించి అబ్బురపరిచింది.. ఈచిత్రం తాజాగా ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్‌కు వచ్చింది. ఇందులో ఈ చిత్రం అపుడే ట్రెండింగ్‌లోకి వచ్చేసింది.. ప్రస్తుతం ఈ మూవీ ఇండి యా వైడ్ రెండోస్థానంలో ట్రెండింగ్‌లో నిలవటం విశేషం..

# తాజాదనాన్నిచ్చే మాస్క్‌లివీ !



వేసవిలో జిడ్డు, చెమట వంటి ఇబ్బందుల్ని అధిగమించి.. ముఖాన్ని మెరిపించాలంటే.. ఈ చిట్కాలు ప్రయత్నించండి. ఇందుకోసం ఇంట్లో ఉండే సహజ పదార్థాలే సరిపోతాయి. అవేంటంటే..

**ఆలివ్ నూనె వర్దన :** కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ని ముఖానికి రాసుకుని మర్దనా చేయాలి. ఆలివ్ ఆయిల్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని మృదువుగా చేస్తాయి.

**చక్కెరతో స్క్రబ్ :** ఈ స్క్రబ్ చర్మంపై ఉండే మృతకణాలను తలగిస్తుంది. దీని తయారీకి పంచదార, ఆలివ్ నూనెల్ని సమాన పరిమాణంలో తీసుకోవాలి. దీన్ని మోముకి రాసి.. మృదువుగా రుద్దాలి. ఇలా కనీసం 15 నిమిషాలు చేస్తే సరి.

**తేనె-నిమ్మ ఫేస్‌ప్యాక్:** తేనె, నిమ్మ రసాలను సమపాళ్లలో తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి ఆరనివ్వాలి. పదిహేను నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. తేనె చర్మాన్ని తేమగా ఉంచి మృదువుగా మారుస్తుంది. నిమ్మరసంలో ఉండే సి విటమిన్ చర్మాన్ని ప్రకాశవంతంగా కనిపించేలా చేస్తుంది.

**గులాబీనీరు:** రోజ్‌వాటర్ సహజటోనర్‌గా ఉపయోగపడుతుంది. ఇది చర్మ పిహెచ్ స్థాయుల్ని సమతుల్యం చేస్తుంది. ఫేస్ ప్యాక్‌లు పూర్తయ్యాక దీన్ని రాస్తే చర్మం కాంతిమంతంగా కనిపిస్తుంది. ❑

# బహుళజాతి సంస్థలతో పోటీపడుతూ..



నిన్నమొన్నటివరకూ ఊరే ప్రపంచం.. వంటగదే జీవితంగా బతికారు వాళ్లు. అయితే పదాన్యుల చేయూత, ఐకమత్యమూ వారిని పారిశ్రామికవేత్తలుగా మార్చాయి. వారిప్పుడు బహుళజాతి సంస్థలతో పోటీ పడుతున్నారు. సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. ఓ చిన్న ఔట్‌లెట్ నుంచి జపాన్‌కు ఎగుమతి వరకూ వీరి స్ఫూర్తి ప్రయాణంతెలుసుకుందాం...

అవకాశాలను సృష్టించుకోవడమే కాదు.. వచ్చినవి వినియోగించుకోవడమూ తెలియాలి. అప్పుడే అభివృద్ధినీ, వాటి ఫలాల్నీ చూడగలం' అనే పుల్కల్ మండలం గొంగ్లూరు మహిళల విజయానికి వారి ఐకమత్యమూ ఓ కారణం. ఈ పల్లె సంగారెడ్డి నుంచి సింగూరు జలాశయానికి వెళ్లే దారిలో ఉంది. ఈ ఊళ్లో ఎక్కువ శాతం వ్యవసాయ కుటుంబాలే. సాగు ఖర్చు ఎక్కువ కావడం, ఊళ్లో ఉపాధి దొరక్క పోవడంతో కొందరు వలసెల్లి పోయారు. మరికొందరు అలానే బతుకీడ్చేవారు. ఆ సమయంలోనే ఐఆర్ఎస్ అధికారుల బృందం ఈ గ్రామాన్ని దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చింది. అప్పుడు కొందరు మహిళలు ఉపాధి అవకాశాలు కల్పించమని వారిని కోరారు. ఎన్నో చర్చల తర్వాత 'సర్వోదయ మహిళా పారిశ్రామికవేత్తల ఆలోచనకు బీజం పడింది. వీరితో సబ్బులు పప్పులు, గానుగ నూనెల తయారీ చేయించాలని అనుకున్నారు. మరి, పెట్టుబడి ఎలా? ఎక్కడో రుణాలు తీసుకోవడం కంటే తలా కొంత జమ చేసుకుని ముందు కెళ్లడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చారందరూ. ఇందులో 135 మంది వాటాదారులున్నారు. వీరిలో 72 మంది స్థానిక మహిళలు, మిగిలిన వారిలో 63 మంది డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లూ, వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో పని చేస్తోన్న అధికారిణులు. వీరంతా సర్వోదయ మహిళలకు అండగా నిలబడటానికి ముందుకు వచ్చారు. రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకూ తలా కొంత పెట్టుబడి పెట్టారు. మొత్తం కలిపి రూ.2 కోట్లతో భవనం, యంత్రాలు, సామగ్రిని సమకూర్చుకున్నారు. జనవరి 2022 నుంచి సంస్థ కార్యకలాపాల్ని ప్రారంభించారు.

**50 రకాల ఉత్పత్తులు...** 'మంజీర బ్రాండ్‌తో మల్టీనేషనల్ కంపెనీలతో పోటీపడాలనేది వీరి తపన. అందుకే ఉత్పత్తుల తయారీ నుంచి మార్కెటింగ్ వరకూ ఎక్కడా రాజీపడటం లేదు. వీరందరికీ నిపుణులతో శిక్షణ ఇప్పించారు. టోమిటో. బొప్పాయి, గులాబీ వంటి 15 రకాల నేచురల్ హ్యాండ్‌మేడ్ సబ్బులను విపణిలోకి తెచ్చారు. పల్లీలు, పొద్దుతిరుగుడు, నువ్వులు, కొబ్బరినూనెలను కోల్డ్ ప్రెస్డ్ విధానంలో తీసి అమ్ముతున్నారు. అన్ని రకాల పప్పుదినుసులనూ ప్రాసెస్ చేసి, మార్కెటింగ్ చేస్తున్నారు. ఇలా మొత్తం 50కి పైగా ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వీటికి ఎఫ్ఎస్ఎస్ఎఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా), జిఎంపి (గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రొడక్ట్) వంటి జాతీయ సంస్థల లైసెన్సలూ, కాస్మెటిక్ ఉత్పత్తులకు ఆయుష్ విభాగం అనుమతులూ సాధించారు. ప్రస్తుతం కోల్డ్‌ప్రెస్ నూనెల్ని జపాన్‌కి ఎగుమతి చేసే సన్నాహాల్లో ఉన్నారు. సంగారెడ్డిలో ఔట్‌లెట్ తెరిచారు. ఐఐటి హైదరాబాద్ సాంకేతిక సహకారంతో ఆన్‌లైన్ అమ్మకాల కోసం వెబ్‌సైట్‌నీ తెచ్చారు. ఈ కృషితో సంస్థ మొదటి ఏడాదలోనే రూ.70లక్షల టర్నోవర్ సాధజంచగలిగింది. 8 మంది కీలక సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహణంతా సాగుతోంది.



**మార్పు ఎంతో...** వాటాదారుల్లోని 22 మంది మహిళలు. ఇందులోనే పనిచేస్తూ నెలవారీ వేతనాలు పొందుతున్నారు. 'ప్రైవేటు టీచర్‌గా చేసేదాన్ని. కరోనా తర్వాత ఉద్యోగం పోయింది. అదే సమయంలో సర్వోదయమహిళా పారిశ్రామికవేత్తల అంశం తెరమీదకు వచ్చింది. నేనూ రూ.50వేలు పెట్టుబడి పెట్టా, ఇక్కడే పనిచేస్తున్నా. ఉన్న ఊళ్లోనే.. సొంత సంస్థలో పనిచేస్తుండటం ఎంతో తృప్తి నిస్తోంది. అంటున్నారు' ఎస్.సునీత. పిల్లల బాధ్యత చూసుకుంటూ ఇంట్లోనే ఉండే దాన్ని. ఇప్పుడు నాకూ ఒక సంస్థలో వాటా ఉంది. ఏడాది పొడవున్నా అక్కడ ఉపాధి దొరుకుతోంది. కుటుంబ అవసరాల కోసం సంపాదించగలగడం గర్వంగా ఉందని చెబుతున్నారు పి. సంతోష్. ❑

### చెలి చిట్కా

చపాతీలు మిగిలిపోతే మర్నాడు వాటిని నూనెతో కాకుండా వెన్నతో కొద్దిగా కాల్చితే రుచిగా ఉంటాయి.

# దంత ఆరోగ్యానికి లవంగం !



లవంగంలేని మాంసాహార వంటకాలని ఊహించలేం కదా! మసాలాల్లో రారాజులాంటి లవంగానికి కేవలం ఘాటు రుచి మాత్రమే కాదు.. బోలెడు ఆరోగ్య ప్రయోజనాలూ ఉన్నాయి.

- పంటి నొప్పి వచ్చినప్పుడు లవంగం నూనె వాడితే ఉపశమనంగా ఉంటుంది. లవంగంలోని నూనెలు పంటిపై బ్యాక్టీరియా విస్తరించకుండా చేసి, దంతాల ఆరోగ్యాన్ని కాపాడతాయి అందుకే లవంగ సుగుణాలున్న పేస్ట్‌ని వాడితే ప్రయోజనం
- చురుగ్గా నిర్ణయాలు తీసుకోవడానికి అవసరమైన మాంగనీస్, పీచు ఈ లవంగాల్లో అధికంగా ఉంటాయి. ఎముకలు బలంగా ఉండాలంటే లవంగాలని మోతాదు మేరకు ఆహారంలో తీసుకుంటే మంచిది.
- లైంగిక జీవితంలో ఎదురయ్యే సమస్యలకు లవంగాలు చక్కని పరిష్కారం. ముఖంపై నల్లని మచ్చలు. యాక్నెవంటివి తొలగిపోవడానికి చక్కని ఆహారం.
- కాసిని నీళ్లలో లవంగాలని వేసి మరిగించి దానికి కొద్దిగా తేనె, పెప్పెర్‌మింట్ ఆయిల్ కలిపితే చక్కని మౌత్ ఫ్రెషనర్‌గా మారిపోతుంది. ❑

# వేసవి చిక్కులకు నిమ్మగడ్డి చెక్



చూడ్డానికి మామూలు గడ్డిలా అనిపించినా నిమ్మగడ్డి లేదా లెమన్ గ్రాస్‌కి ప్రత్యేకమైన పరిమళం ఉంటుంది. దీంతో చేసిన టీ ఎన్నో సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

- ఈ కాలంలో ఆహారాన్ని సరిగా నిల్వచేయకపోతే ఈ-కొలి బ్యాక్టీరియా వచ్చి చేరుతుంది. అలాంటి పదార్థాలు తినడం వల్ల మూత్రా భయం ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. నిమ్మగడ్డితో చేసిన టీ మన శరీరంలో చేరిన బ్యాక్టీరియాని పేగుల్లోనే చంపేసి, ఇన్‌ఫెక్షన్లు రాకుండా అడ్డుకుంటుంది.
- ఎప్పుడైనా ఆందోళనగా, విచారంగా అనిపించినప్పుడు వేడివేడిగా, నిమ్మగడ్డితో చేసిన టీని తాగి చూడండి. ఎంత ఉపశమనంగా ఉంటుందో! దీనిని చేయడం చాలా తేలిక. బజారులో ఎండబెట్టిన లెమన్ గ్రాస్ దొరుకుతుంది. దీనిని చెంచా తీసుకుని గ్లాసు నీళ్లలో మరిగించి, వడకట్టుకోవాలి. తర్వాత తగినంత పంచదార కలిపితే సరి. టీ సిద్ధం. ఇది కొలెస్ట్రాల్‌నీ అదుపులో ఉంచుతుంది.
- చాలాదేశాల్లో ఈ ఆకులని భోజనం తర్వాత నములు తుంటారు. ఇలా నమలడం వల్ల నోట్లోని దుర్వాసన పోవడమే కాక, పళ్లలో రంధ్రాలు రావటానికి కారణమైన బ్యాక్టీరియా నశించిపోతుంది.
- నెలసరికి ముందు కొందరిలో పొట్ట ఉబ్బినట్టుగా ఉంటుంది. అలాంటి వారికి నిమ్మగడ్డితో చేసిన టీ మంచి ఉపశమనం ఇస్తుంది. ❑

# వన్నెచిన్నెల చల్లని పానీయాల గ్లాసులు









వేసవి అంటే చల్లచల్లని పానీయాలు తాగే సమయం. మరి వాటిని సాదాసీదా గ్లాసుల్లో తాగేస్తామా ఏంటి? చూడ్డానికి ఇలా వన్నెచిన్నెలున్న గ్లాసులని ప్రయత్నించండి. ముచ్చటగా ఉంటాయి. పార్టీలకు డైనింగ్ టేబుళ్లకి కొత్త దనం మోసుకొస్తాయి.









# అనాసతో అందం, ఆరోగ్యం

కొంతమంది అనాస పండుని తొక్క తీసేసి నేరుగా తినడానికి ఇష్టపడితే మరికొందరు జ్యూస్ తాగడానికి ఆసక్తి చూపిస్తారు. అయితే ప్రత్యేకించి వేసవిలో దీనివల్ల అటు ఆరోగ్యపరంగానే కాకుండా ఇటు సౌందర్యపరంగా కూడా అనేక ప్రయోజనాలున్నాయంటున్నారు నిపుణులు.



**చర్మమెరిసేలా....** మిన్‌సి మరియు అమైనో యాసిడ్ చర్మంలో కొలాజెన్ ఎక్కువగా ఉత్పత్తయ్యేలా చేసి తద్వారా చర్మం బిగుతుగా, పట్టుత్వం కోల్పోకుండా చేసా_యి. అలాగే చర్మంపై పేరుకొనే మృతకణాలను తొలగించి కాంతివంతంగా మారుస్తాయి. ఇందులో ఉండే విటమిన్‌సి వల్ల మొటిమలు తగ్గ ముఖం పట్టడమే కాకుండా వాటి వల్ల ఏర్పడిన మచ్చలు కూడా క్రమంగా చర్మఛాయలో కలిసిపోతాయి. ఫలితంగా ప్రకాశవంతమైన చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు.

దీని కోసం తొక్క చెక్కిన పైనాపిల్ ముక్క ఒకటి తీసుకుని నేరుగా చర్మంపై రుద్దుకోవాలి. కాసేపు ఆరనిచ్చి తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకుంటే సరిపోతుంది.

**జుట్టు రాలకుండా...** ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ బాధపెడుతున్న సమస్య. జుట్టు రాలడం అనాసలో పుష్కలంగా ఉండే విటమిన్ సి జుట్టు రాలడం నివారించడంలో సమర్థంగా పని చేస్తుంది. అయితే ఈ ప్రయోజనాన్ని పొందాలంటే ప్యాక్స్, జ్యూస్‌ల రూపంలో కాకుండా పైనాపిల్‌ని రోజు తీసుకునే ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది. అప్పుడే సత్ఫలితాలను ఆశించే అవకాశం ఉంటుంది.

**యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా...** అనాసలో విటమిన్ సితో పాటు పొటాషియం కూడా పుష్కలంగా లభిస్తుంది. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి శరీరంలో వ్యాధినిరోదక శక్తి పెంచడమే కాదు చర్మం నవయవ్వనంతో నిగనిగలాడేలా కూడా చేస్తాయి.

**అదనపు ప్రయోజనాలు....**

- అనాస గుజ్జులో కొద్దిగా ఆలివ్ ఆయిల్ కలిపి పెదాలకు రాసుకుంటే అధరాల్లో తేమ ఎక్కువ సమయం నిలిచి ఉంటుంది. ఫలితంగా పెదవుల పొడిబారకుండా ఉంటాయి. పాదాలపై ఉండే పగుళ్ల తగ్గడానికి కూడా పైనాపిల్ బాగా సహాయపడుతుంది.
- అనాసలో ఉండే మాంగనీస్ శరీరంలో ఎముకల ఎదుగుదలకు బాగా ఉపయోగపడుతుంది. ఫలితంగా ఎముకలు బలంగా తయారవడంతో పాటు ఆరోగ్యంగా కూడా ఉంటాయి. ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఇది చక్కని ఫలితాలనిస్తుంది. ఎముకల సంబంధిత సమస్యలేవీ దరి చేరకుండా సంరక్షిస్తుంది.
- పైనాపిల్ జ్యూస్ తాగడం వల్ల నెలసరికి సంబంధించిన సమస్యలు కూడా తగ్గుతాయి. ముఖ్యంగా పిరియడ్స్ సమయంలో బాగా నొప్పితో సతమతమయ్యేవారు పైనాపిల్ జ్యూస్ తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. ❑

# శివనిలయం స్మశానం సందేశం

పరమ శివుడు జగతిలో సర్వంతార్యామి. శివుని ఆజ్ఞ లేనిదే చీమ అయినా కుట్టదు. అనే సామెత మీరు వినే వుంటారు. పరమ శివుడి నివాసం స్మశానం, ఎందుకంటే నిశాచరుడు కనుక ఆయన నివాసం స్మశానం ఎంచుకున్నాడు. దానిలోనే ఎంతో పరమార్థందాగి వుంది. అజ్ఞానములో వున్న మానవుడి మేలు కొలిపే సందేశం ఈ పరమార్థంలో దారి వుంది. ఈ లోకంలో మానవుడికి ఏది శాశ్వతం కాదు శాశ్వతం కాని ఈ దేహంపై మోహం ఎందులకు అన్న పరమ నగ్న సత్యం ఈ స్మశానం మనకు ప్రబోధిస్తుంది. మోక్షం, సాధన కర్తవ్యం ఇవన్నీ పరమ ధర్మములు కలిగినవి శివ పంచాక్షరీ స్తోత్రంలో ఈ విషయం మనకు అర్థం కాగలదు. అందుకే ఈ దేహంపై వ్యామోహం ఎందులకు అన్న సందేహానికి సమాధానం ఈశ్వరుడు తన నివాసం స్మశానంగా మార్చుకున్నాడని శైవ భక్తులు అంటారు. ఇది ఒక ప్రభోద సందేశం పరమాత్మసందేశం చివరకు మిగలేది ఏమిటంటే.. ఆ విషయం అందరికీ విదితమే మానవుడు చివరిగా చేరుకేనేది ఇక్కడికే అన్న సందేశం అందరికీ అర్థం కాగలదు. ఆదది స్మశానంలో పరమ శివుడు కొలువై ఉంటాడన్నది నగ్నం సత్యం. ఈ విషయం జ్ఞానోదయం ద్వారా సనాతన ధర్మంతో ఒక సందేశం లా మిగిలింది ఇహం. పరం, అనే సగుణాలు కలబోసిన సందేశాలు అందరికీ మార్గదర్శకాలు కాగలవు. ఇకనైనా మానవుడు అహంకారం వీడి, స్వార్థం పరిత్యజించి, పపరోపకారం ఇదర శరీరం అన్న విషయం గ్రహించాలి. శశ్వతం కాని ఈ దేహం పాప కార్యముల కోసం గాక కాసింతపుణ్యకార్యక్రమాలు అమలు చేయాలి అన్న సిద్దాంతం గుర్తించాలి.



- ఎల్. ప్రపుల్ల చంద్ర.

ఆధ్యాత్మికం

# చలువ చేసే సింగాడాలు



సింగాడా..

ఈ పేరు ఎప్పుడైనా విన్నట్టుగా ఉందా? పోనీ మీరు బజారుకి వెళ్లినప్పుడు నల్లటి దుంపల్ని తోపుడు బండిమీద పెట్టి అమ్మడం గమనించారా? చాలామంది చూసే ఉంటారు. కానీ అవేంటో అర్థం కాక తికమకపడు తుంటారు. అవే సింగాడాలు. ఇవో రకం నీటి దుంపలు. ఇంగ్లీష్‌లో వీటిని వాటర్ చెస్ట్‌నట్ అంటారు. సింగాడాలు నీటిలో దొరికే దుంపలు. తాజాగా ఉన్నప్పుడు ఇవి పచ్చగా, ఎర్రగా ఉంటాయి. వీటిని పచ్చిగా కూడా తింటారు. ఉడికించినవి రుచిగా ఉంటాయి. అవే మనం మార్కెట్లో చేసే నల్లని సింగాడాలు. పైకి దుంప నల్లగా ఉన్నా.. కోసి చూస్తే లోపల తెల్లగా ఉంటుంది. వీటి ఆకృతి కారణంగా వీటిని బ్యాట్ నట్. బుల్‌నట్ అని కూడా ఉంటారు. ఉత్తరాదిన ఈ దుంపల్ని మర పట్టించి ఆ పిండితో వంకాలు కూడా చేసుకుంటారు.

- వీటికి సంతాన సామర్థ్యాన్ని పెంచే శక్తి ఉందట. ముఖ్యంగా హార్మోన్ల అసమతుల్యత నుంచి ఉపశమనం కలిగిస్తారు.
- అధిక రక్తపోటు తో బాదపడే వాళ్ల ఈ దుంపల్ని ఆహారంలో చెర్చుకుంటే మేలు జరుగుతుంది.
- కెలోరీలు తక్కువగా, పీచు ఎక్కువగా ఉండటంతో బరువు తగ్గాలను కొనే వారికి మంచి ఆహారం. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండే ఆహారం కాబట్టి వీటితో చేసి రొట్టెని ఉపవాసాల ప్పుడు తింటే శక్తి పుంజుకుంటారు. ❑



# తొలివన్డే ఓటమికి శ్రీలంక ప్రతీకారం

## అఫ్ఘాన్‌పై 132 పరుగుల తేడాతో విజయం



**కొలంబో:** తొలివన్డేలో ఆఫ్ఘనిస్తాన్‌చేతిలో ఓటమి ఎదుర్కొన్న శ్రీలంక రెండో వన్డేలో పుంజుకుంది. హాంబన్‌తొట్టె వేదికగా ఆదివారం జరిగిన రెండో వన్డేలో ఆఫ్ఘనిస్తాన్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ తర్వాత బౌలింగ్‌లోనూ శ్రీలంక జట్టు రెచ్చిపోయింది. పర్యాటక జట్టుపై పూర్తి పట్టుసాధించి గెలిచింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సీరీస్‌ను 1:1తో సమంచేసుకున్నారు. ఇరుజట్లమధ్య నిర్ణయాత్మక మూడో వన్డే జూన్ ఏడున ఇదే వేదికపై జరుగుతుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌చేసిన శ్రీలంక పథుమ్ నిస్సంక 43, కరుణరత్నే 52, కుశాల్‌మెండిస్ 78, సమర విక్రమ 44, ధనంజయ డిసిల్వ 29నాటౌట్, షనక 23, హసరంగ 29 నాటౌట్‌గా రాణించడంతో నిర్ణీత ఓవర్లలో ఆరువికెట్ల నష్టానికి 323 పరుగులుచేసింది. తొలివన్డేలో సత్తాచాటిన అసలంక ఆరుపరుగులు మినహా లంక ఇన్నింగ్స్‌లో ప్రతి ఒక్కరూ బ్యాట్‌ను ఝుళిపించారు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో నబీ, ఫరీద్ అహ్మద్ తలొక రెండు వికెట్లుతీస్తే ముజీబ్ ఉర్ రెహ్మాన్ ఒక వికెట్‌తీసాడు. భారీ లక్ష్యఛేదనలో బరిలోకి దిగిన ఆఫ్ఘన్‌జట్టు ఒకదశలో 146/2 విజయం దిశగా సాగుతున్నా స్పిన్నర్ ధనంజయ డిసిల్వా ఆజట్టును భారీగా దెబ్బకొట్టాడు. సెట్ బ్యాటర్లు ఇబ్రహీం జద్రాన్ 54, హస్మతుల్లా షాహిది 57లను ఔట్‌చేసి ఆఫ్ఘన్ల ఓటమికి బీజం వేసాడు.

అనంతరం హసరంగ వారి పతనాన్ని శాసించాడు. వీరితోపాటే చమీరా 2/18, తీక్షణ 1/35, షనక 1/29 తలో వికెట్‌తీసారు. ఆఫ్ఘన్లు 42.1 ఓవర్లలో 191 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యారు. ఫలితంగా 132 పరుగులు భారీ తేడాతో ఓటమి పాలయ్యారు. ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్‌లో జద్రాన్, షాహిది హాఫ్‌సెంచరీలతో రాణించగా రహ్మత్‌షా 36, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 28పరుగులతో ఒక మోస్తరుగా రాణించారు. మిగిలిన వారంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితం అయ్యారు.

# ఓవల్‌లో ఫీల్డింగ్‌పైనా టీమిండియా ఫోకస్



**పోర్ట్స్‌మత్(ఇంగ్లండ్):** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియాపై విజయం సాధించేందుకు టీమ్ ఇండియా అన్ని రకాలుగా సన్నద్ధం అవుతోంది. ఓవల్‌లో మరో రెండు రోజుల్లోప్రారంభం అవుతున్న ఈపోరుకోసం ఇంగ్లండ్‌లోఉన్న భారత్‌జట్టు అక్కడిపరిస్థితులపై అవగాహనకు ప్రయత్నిస్తోంది. ఫీల్డింగ్‌పై ఎక్కువగా రోహిత్‌సేన ఫోకస్ పెంచింది. రంగురంగుల రబ్బరు బంతులతో క్యాచ్‌ప్రాక్టీస్‌చేస్తోంది. మ్యాచ్ చివరినిమిషాల్లో బంతి గమనంలో మార్పునకు తగినట్లుగా సర్దుబాటుచేసుకోడంకోసం టీమిండియా ఈ కసరత్తులుచేస్తోంది. శుభ్‌మన్‌గిల్ ఆకుపచ్చ బంతితో క్యాచ్‌ప్రాక్టీస్‌చేసాడు. పసుపుపచ్చ బంతులు కూడా ఉన్నాయి. ఫీల్డింగ్ కసరత్తులకోసమే ఈ రంగు రంగుల రబ్బరు బంతులను ప్రత్యేకంగా తయారుచేసారు. ఇవి గల్లీక్రికెట్‌లో కనిపించే బంతులు కావని, వీటిని రియాక్షన్ బాల్స్ అంటారని నిర్వాహకులు తెలిపారు. ఎక్కువ గాలి, చల్లని వాతావరణం ఎక్కువ ఉండే ఇంగ్లండ్ లేదా న్యూజిలాండ్‌లలో ఎక్కువగా ఫీల్డింగ్‌ప్రాక్టీస్‌కోసం వాడతారు. స్లిప్ ఫీల్డర్లు, వికెట్ కీపర్ల క్యాచ్‌ప్రాక్టీస్‌లోనే వీటిని వినియోగిస్తారు. తేమ మైదానంలో వలయం బయట ఎక్కువ పచ్చిక ఉండటంతో ఇంగ్లండ్‌లో బంతికి అస్థిర చలనం అధికంగా ఉంటుంది బ్యాటర్లకు ఔట్‌సైడ్ ఎడ్జ్ అయ్యే బంతులు ఎక్కువగా కదులుతూ ఉంటాయి. ఈ రబ్బరు బంతులు తేలిగ్గా ఉండటంతో అస్థిర చలనంతోపాటు స్వింగ్‌కూడా లభిస్తుంది. వీటిద్వారా క్యాచ్‌అందుకునే చివరినిమిషంలో గమనంమారే బంతిని పట్టుకునేందుకు ప్రాక్టీస్ దొరుకుతుందని ఎన్‌సిఎలోని ఫీల్డింగ్‌కోచ్ తెలిపాడు.

# శామ్‌కర్రన్‌కు పంజాబ్‌కింగ్స్ గుడ్‌బై!

**చండీఘడ్:** ఐపిఎల్‌ముగిసినా కూడా ఫ్రాంఛైజీలు ఇప్పటికీ మల్లగుల్లాలుపడుతున్నాయి. ఒక్కో టీమ్ ఇపుడు వదిలేసే ప్లేయర్ల జాబితాలు తయారుచేస్తుంటే ఫ్యాన్స్‌లో ఎవరెవరు ఎవరిని వదిలేస్తారన్న అంచనాలువేస్తూ పోస్టులు వెల్లువెత్తిస్తున్నారు. ఈక్రమంలో కనీసం ప్లే ఆఫ్స్‌కూడా చేరలేకపోయిన పంజాబ్‌కింగ్స్ కఠిన నిర్ణయం తీసుకోవచ్చని కామెంటేటర్ ఆకాశ్‌చోప్రా అన్నాడు. మిని వేలంలో ఏకంగా 18.5 కోట్లుపెట్టి కొనుగోలుచేసిన శామ్ కర్రన్ వచ్చే సీజన్‌లో ఈజట్టుతో ఉండటం కష్టమని అంటున్నాడు. ఈ ఏడాది పంజాబ్‌తరపున 13 మ్యాచ్‌లు ఆడిన ఆతడు 135.96 స్ట్రైకరేట్‌తో 276 పరుగులేచేసాడు. అంతకుముందు చెన్నై తరపున అద్భుతంగా ఆడిన కర్రన్ పంజాబ్ తరపున అంత గొప్పగా రాణించలేదు. మినీవేలంలో భారీధర పలకడం కూడా ఆతనిపై ఒత్తిడిపెంచింది. సెహ్వాగ్, గవాస్కర్ వంటి వారు బహిరంగంగానే అంతభారీ ధరకు కొన్న కర్రన్ పంజాబ్ టీమ్‌కు ఏంచేసాడని ప్రశ్నించారు. ఈక్రమంలోనే ఆతడిని వచ్చేసీజన్‌కు వదిలేయాలని పంజాబ్ భావిస్తోంది. మినీ వేలంలో భారీ ధరకు కొనుగోలుచేసిన ఆటగాళ్లలో కర్రన్‌పై పెట్టిన పెట్టుబడికి ఏమాత్రం న్యాయం జరగలేదని చోప్రా అన్నాడు. శామ్‌కర్రన్‌ను భారీ మొత్తానికి కొన్నారు. ఐపిఎల్ చరిత్రలోనే అత్యధికధరపలికిన ప్లేయర్ ఇతని ప్రదర్శన 50:50 కంటే ఎక్కువని చెప్పలేమని మాజీలు పేర్కొంటున్నారు. పెట్టుబడికి తగిన ఫలితంలేదని చెపుతున్నారు. అదేసమయంలో ఏడమచేతివాటం పేసర్ కర్రన్‌ను పవర్‌ప్లేలో ఉపయోగించుకున్న పంజాబ్ దీనివల్లకూడా నష్టపోయిందని చోప్రాచెప్పాడు. ఒక పక్క కర్రన్ బౌలింగ్‌చేస్తే మరో ఎండ్‌నుంచి అర్షదీప్ బౌలింగ్‌చేసినా పెద్దగా ఫలితం లేకపోయిందన్నాడు. ఇద్దరూ లెఫ్ట్‌ఆర్మ్‌పేసర్లే కావడంతో బ్యాటర్లు త్వరగా అలవాటుపడిపోయారని దీనితో అర్షదీప్‌కూడా ప్రభావంచూపించలేకపోయాడని ఆకాష్‌చోప్రా విశ్లేషించాడు.




# ఆసీస్‌కు హేజిల్‌వుడ్ షాక్

**సిడ్నీ:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ మరో మూడురోజుల్లో ప్రారంభం కానుండగా ఆసీస్ జట్టుకు షాక్ తగిలింది. జట్టు కీలక పేసర్ జోష్ హేజిల్‌వుడ్ గాయం కారణంగా ఫైనల్‌మ్యాచ్‌కు దూరం అయ్యాడు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఈసమాచారం ప్రకటించింది. కొంతకాలం మోకాలు, మడమ గాయంతో జోష్ హేజిల్‌వుడ్ ఇబ్బందిపడుతున్నాడు. ఇటీవల జరిగిన ఇండియన్ ప్రీమియర్‌లీగ్ 2023లోనూ గాయంతో కొన్ని మ్యాచ్‌లకు దూరం అయ్యాడు. అయితే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌నాటికి హేజిల్‌వుడ్ గాయం నుంచి పూర్తిగా కోలుకుంటాడని క్రికెట్ ఆస్ట్రేలియా భావించింది. ఫైనల్‌లో ఆడతాడని ఇటీవల ప్రకటించింది. కానీ తాజాగా నిర్వహించిన పరీక్షల్లోకూడా హేజిల్‌వుడ్ పూర్తిగా గాయంనుంచి కోలుకోలేదని నిర్ధారణ అయింది. జూన్ 7నుంచి 11 వరకూ ఇంగ్లండ్‌లోని ఓవల్ వేదికగా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ జరగనుంది.

భారత్ ఆస్ట్రేలియా జట్లు టైటిల్‌కోసం తలపడను న్నాయి. అది ముగిసిన వెంటనే ఇంగ్లండ్‌తో జూన్ 16 నుండి యాషెస్ సిరీస్ ప్రారంభం కానుంది. హేజిల్‌వుడ్ గాయంనుంచి కోలుకుంటే యాషెస్‌లో కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండే అవకాశం ఉంటుంది. హేజిల్ వుడ్‌స్థానంలో పేసర్ మైకేల్ నేసర్‌ను ఆసీస్ ఎంపికచేసింది. 33 ఏళ్ల నేసర్ ఆస్ట్రేలియా తరపున రెండు వన్డేలు, రెండు టెస్టుమ్యాచ్‌ల్లో ఆడాడు. హేజిల్‌వుడ్‌స్థానంలో జట్టులోకి వచ్చినా నేసర్‌కు తుదిజట్టులో చోటుదక్కడం కష్టమే. హేజిల్‌వుడ్‌కు బదులుగా స్కాట్ బోలాండ్‌కు తుదిజట్టులో స్థానం దక్కేఅవకాశం ఉంది. కాగా జట్టులో డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, అలెక్స్ క్యారీ, కామెరూన్‌గ్రీన్, మార్నస్ లబుషేన్, ట్రావిస్ హెడ్, ఉస్మాన్ ఖవాజా, స్టీవ్‌స్మిత్, స్కాట్ బోలాండ్, మార్కస్‌హ్యారీస్, జోష్ ఇంగ్లీష్, నాథన్‌లియాన్, టాడ్‌మర్ఫీ మైకేల్‌నేసర్, మిచెల్‌స్టార్క్ వంటివారున్నారు.

# ఐసిసి గుత్తాధిపత్యానికి ఐపిఎల్ బ్రేక్

## ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్



**సిడ్నీ:** ఐపిఎల్‌పై ఆసీస్ కెప్టెన్ పాట్‌కమిన్స్ కీలక వ్యాఖ్యలుచేసాడు. ఆటలో ఏవిధంగా మార్పులు తెచ్చిందో కూడా వివరించాడు. డబ్ల్యుటిసి ఫైనల్‌కోసం క్రికెట్ ఫ్యాన్స్ ఎదురుచూస్తున్న తరుణంలో ఆసీస్, భారత్ జట్లు ఇప్పటికే సిద్ధం అయ్యాయి. ఐపిఎల్‌పై పాట్‌కమిన్స్ వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. ఆటగాళ్ల సమయంపై ఐసిసి గుత్తాధిపత్యానికి ఐపిఎల్‌ముగింపు చెప్పిందని అన్నాడు. ఫ్రాంఛైజీ క్రికెట్‌కంటే జాతీయ జట్టుకోసం ప్రాధాన్యత ఇచ్చేలా ఆటగాళ్లను ఒప్పించడం సవాల్‌గా మారనుందని అన్నాడు. లాభదాయక టి20 లీగ్‌లకారణంగానే న్యూజిలాండ్ సెంట్రల్ కాంట్రాక్ట్‌ను కూడా ట్రెంట్‌బౌల్ట్ వద్దన్నాడన్న విషయాన్ని కమిన్స్ అంగీకరించాడు. గతంలో ఉన్న మాదిరిగా ఇపుడు ఆటగాళ్ల సమయంపై అంతర్జాతీయ క్రికెట్‌కు గుత్తాధిపత్యం లేదు. దశాబ్దం క్రితమే దీనిని ఐపిఎల్‌మార్చివేసిందని, మరింత అప్రమత్తంగా ఉండాలన్నాడు. ఇక నాజట్టు సభ్యులు ఇతర విషయాలకంటే జాతీయ జట్టుకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటున్నట్లు చెప్పాడు. ఎక్కువ లాభదాయకత ఉండే ఫ్రాంఛైజీలీగ్‌ల కారణంగా ఇది సవాలుతో కూడుకున్న అంశం అని కమిన్స్ అన్నాడు. ఆస్ట్రేలియా తరపున ఆడటంన ప్రత్యేకం. ఎంత ఎక్కువ వీలైతే అంత ఎక్కువగా జాతీయ జట్టుకు ఆడాలి. ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని, కొన్నేళ్లు గడిస్తే 12నెలల అంతర్జాతీయ క్యాలెండర్ కొంత భిన్నంగా కనిపిస్తుందని కమిన్స్ అన్నాడు.

# పోస్టాఫీస్ పథకాలకు ఇ-కెవైసి తప్పనిసరి

**న్యూఢిల్లీ, జూన్ 4:** తక్కువ రిస్క్, కచ్చితమైన రాబడి నేపథ్యంలో చాలా మంది చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. అందులోనూ పెట్టుబడికి భద్రతా ఉంటుందని భావించి పోస్టాఫీసు స్కీమ్‌లను ఎంచుకుంటుంటారు. ఇటీవల భారత పోస్టల్ విభాగం కీలక ఉత్తర్వులు



జారీచేసింది. చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో రూ.10 లక్షలు ఆపై పొదుపు చేసే వారి నుంచి కెవైసి పత్రాలతో పాటు ఆదాయ ధ్రువీకరణ డాక్యుమెంట్లు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించింది. మనీలాండరింగ్, ఉగ్రవాద చర్యలకు నిధుల మళ్లింపు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిరోధించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఖాతా తెరవడానికి, క్రెడిట్ సర్టిఫికెట్ల కొనుగోలుకు లేదా పొదుపు సాధనాల గడువు ముగిసిన తర్వాత అందే మొత్తం లేదా అన్ని సేవింగ్స్ పథకాల్లో ఉన్న డిపాజిట్ల మొత్తం రూ.50వేలు దాటిన కస్టమర్లను తక్కువ రిస్క్ ఉన్నవారిని వర్గీకరించారు. పైన పేర్కొన్న మొత్తం రూ.50వేలు మించి రూ.10 లక్షలలోపు ఉంటే అలాంటి కస్టమర్లను మీడియం రిస్క్ కింద వర్గీకరించారు. ఒకవేళ పైన తెలిపిన మొత్తం రూ.10 లక్షలు దాటితే వారిని హై రిస్క్ కేటగిరీలో చేర్చారు. అలాగే రాజకీయాలతో సంబంధం ఉండి భారత్ వెలుపల నివసిస్తున్న కస్టమర్ల ఖాతాలను కూడా ఈ కేటగిరీ కిందే వర్గీకరించారు. పైన తెలిపిన మూడే కేటగిరీల వారు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోగ్రాఫ్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. జాయింట్ ఖాతా అయితే అందరూ ఇవ్వాలి. గుర్తింపు ధ్రువీకరణ పత్రం కింద ఆధార్, పాన్ సమర్పించాలి. చిరునామా ధ్రువీకరణ కోసం ఆధార్ లేదా పాన్ లేదా చిరునామా ఉన్న పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ గుర్తింపు కార్డు, యుటిలిటీ బిల్స్ వంటి వాటిని ఇవ్వొచ్చు. ఒకవేళ జాయింట్ అకౌంట్ అయితే, ఖాతాలో ఉన్నవారంతా పై పత్రాలను సమర్పించాలి. అన్ని డాక్యుమెంట్లను ఇన్వెస్టర్లు సెల్ఫ్ అటెస్ట్ చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు హైరిస్క్ కేటగిరీలో ఉన్న కస్టమర్లు పెట్టుబడి పెడుతున్న ఆదాయం ఎక్కడి నుంచి వచ్చింది రుజువు చేసే పత్రాన్ని కూడా సమర్పించాల్సి ఉంటుంది. దీని కోసం బ్యాంకు లేదా పోస్టాఫీస్ ఖాతా స్టేట్‌మెంట్, ఐటి రిటర్నులు, సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్, వీలు నామా, సక్సెషన్ సర్టిఫికెట్ వీటిలో ఏవైనా ఇవ్వొచ్చు.

# రిస్క్ స్టాక్స్‌పై ఇన్వెస్టర్లు జాగ్రత్త!

**ముంబై, జూన్ 4:** స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే వారు ఆచి తూచి అడుగులు వేయాలి. ఎందుకంటే మార్కెట్ ఎప్పుడూ ఒకేలా ఉండదు. కొన్నిసార్లు వృద్ధి దశలో కొనసాగుతోంది. మరోసారి పతనపు అంచున పయనిస్తుంది. కానీ దీర్ఘకాలిక దృష్టితో ఎలాంటి పరిస్థితుల్లోనైనా మార్కెట్లో కొనసాగుతున్న వారికే లాభాలు కనిపిస్తాయని ఇప్పుడు రుజువైంది. అంతర్జాతీయ పరిణామాలతో తగ్గిన మార్కెట్లు మళ్లీ పెరిగాయి. దీన్ని బట్టి మార్కెట్ పడినప్పుడు కొనుగోళ్లకు మంచి సమయమని గుర్తించొచ్చు. పెట్టుబడిలో ఎంత మొత్తాన్ని ఈక్విటీలకు కేటాయించాలనే దానికీ ఒక నిబంధన ఉంటుంది. ఉన్నదంతా ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత పథకాలకే కేటాయించినప్పుడు నష్టభయం అధికంగా ఉంటుంది. కాబట్టి మీ ఆర్థిక లక్ష్యాలు, వయసు, నష్టభయం ఆధారంగా పెట్టుబడులు కేటాయించాలి. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు దీర్ఘకాలంలోనే మంచి ఫలితాలు ఇస్తాయన్న విషయం విదితమే. కాబట్టి కనీసం 5యేళ్లకుపైన వ్యవధి ఉన్నప్పుడే



ఈక్విటీ పెట్టుబడుల జోలికి వెళ్లాలి. దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించేందుకు ఇవి సరిపోతాయి. అప్పుడు కొంత అధిక మొత్తం వీటికి కేటాయించినా ఇబ్బంది ఉండదని చెప్పొచ్చు. ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులు కొనసాగించాలి. పదవీ విరమణ ప్రణాళిక, పిల్లల ఉన్నత చదువులు వంటి వాటికి దీర్ఘకాలిక వ్యవధి ఉంటుంది. ఇలాంటప్పుడు ఈక్విటీలు పనికొస్తాయి. 1-5 యేళ్లలోపు వ్యవధి ఉన్న లక్ష్యాలకు డెట్ ఆధారిత పథకాలు అనువుగా ఉంటాయి. పెట్టుబడులు ఎప్పుడూ వైవిధ్యంగా ఉండేలా చూసుకోవాలి. ఒకే రంగానికి చెందిన కంపెనీలు లేదా ఒకే తరగతికి చెందిన ఫండ్ పథకాలను ఎంచుకోవడం మంచిది కాదు. షేర్ల పనితీరును నిరంతరం గమనించే సమయం, అవగాహన లేని వారికి ఈక్విటీ ఫండ్లు మంచి ప్రత్యామ్నాయం. ఇందులో క్రమానుగత పెట్టుబడి విధానాన్ని అనుసరిస్తూ ఇన్వెస్ట్ చేయొచ్చు.

# ఇన్వెస్టర్లకు సిరులు కురిపిస్తున్న మల్టీబ్యాగర్స్

**ముంబై, జూన్ 4:** దేశంలోని మౌలిక సదుపాయాల రంగం చాలా వేగంగా పుంజుకుంటున్న తరుణంలో అనుబంధ రంగాల కంపెనీలు వృద్ధి చెందుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని కంపెనీలు తమ ఇన్వెస్టర్లకు స్వల్ప కాలంలోనే మల్టీబ్యాగర్ రాబడులను అందిస్తున్నాయి. ఆంధ్రా సిమెంట్స్ లిమిటెడ్ ప్రస్తుత ధర రాకెట్‌లా దూసుకెళుతోంది. గత కొంతకాలంగా స్టాక్ వరుసగా అప్పర్‌సర్క్యూట్లను తాకుతోంది. ఈసిమెంట్ స్టాక్‌యేడాది కాలంలోనే ఇన్వెస్టర్లకు దాదాపు 150 శాతం రాబడిని అందించింది.



సాగర్ సిమెంట్స్ యాజ మాన్యంలో పనిచేస్తున్న కంపెనీ షేర ధర రూ.143.90గా ఉంది. జూన్ 6, 2022న స్టాక్ ధర రూ.9.25 వద్ద ఉంది. అప్పట్లో ఎవరైనా ఇన్వెస్టర్ ఈ కంపెనీ షేర్లలో లక్ష రూపాయలు ఇన్వెస్ట్ చేసి ఉంటే ఇప్పుడు మార్కెట్ ధర ప్రకారం రూ.15.55 లక్షలుగా ఉండేది. ఇలా యేడాది కాంలోనే సిమెంట్ కంపెనీ తన ఇన్వెస్టర్లకు బలమైన రాబడులను అందించింది. ఇదే క్రమంలో స్టాక్ యేడాది కనిష్ట ధర రూ.4.90 వద్ద ఉండగా, యేడాది గరిష్ట ధర రూ.143.90గా ఉంది. కేంద్ర ప్రభుత్వం దేశ నిర్మాణాన్ని గతంలో ఎన్నడూ లేని వేగంతో ముందుకు తీసు కెళ్తున్న క్రమంలో సిమెంట్ రంగం కూడా భారీగా లాభపడు తోంది. అందుకే ఇన్వెస్టర్లు కూడా ఇటీవల ఈ రంగంలో పెట్టుబడి అవకాశాలపై దృష్టిసారించారు. ఈ కంపెనీ స్వాతంత్ర్యానికి ముందర డిసెంబరు 1936లో ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు.

# ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ 12% వృద్ధి

**న్యూఢిల్లీ, జూన్ 4:** గత కొంత కాలంగా కంపెనీలు తమ ఉద్యోగులను హైబ్రిడ్ వర్క్ మోడల్‌లో పని చేయించుకుంటున్న నేపథ్యంలో దేశీయ ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ విభాగం గణనీయంగా వృద్ధి చెందుతోందని ఒక నివేదిక వెల్లడించింది. కంపెనీలు ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న కారణంగా 2019లో కరోనాకు ముందు 5-8 శాతం ఉన్న ఈ విభాగం వాటా ఈ యేడాది చివరి నాటికి 10-12 శాతానికి చేరుకుంటుందని కూడా వెల్లడించింది. ముఖ్యంగా ఆసియా పసిఫిక్ ప్రాంతంలో కంపెనీల ఆఫీస్ స్పేస్ వినియోగంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని కూడా వెల్లడించింది. ఆఫీస్ స్పేస్ రంగంలో సవాళ్లు ఉన్నప్పటికీ, ఫ్లెక్సిబుల్ స్పేస్ విభాగం మద్దతు కొంత సానుకూలంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఫ్లెక్సిబుల్ స్పేస్ వినియోగంలో గణనీయమైన వాటాను ఐటి కంపెనీలు సొంతం చేసుకోగా, ఆ తర్వాత బిజినెస్ సర్వీసులు, లైఫ్ సైన్సెస్, రిటైల్ రంగాలున్నాయి. ఫ్లెక్సిబుల్ స్పేస్ నిర్వహణదారులు స్వల్పకాలానికి జరిగే ఒప్పందాలు, సౌకర్యవంతంగా ఉండే నిబంధనలతో సేవలు అందిస్తున్నాయి. ఈ కారణంగానే క్లయింట్లకు ఖర్చులు తగ్గుతున్నాయని కూడా ఆ నివేదిక వెల్లడించింది.

## వాణిజ్యం

# భారత్ బ్యాంకులపై సైబర్ నేరగాళ్ల నజర్

**న్యూఢిల్లీ, జూన్ 4:** భారతీయ బ్యాంకులు 2023 సంవత్సరం మొత్తం 13,530 మోసాలను నివేదించినట్లు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా వెల్లడించింది. 2022లో నమోదైన 9,097 కంటే ఇవి చాలా ఎక్కువ అని స్పష్టం చేసింది. అయితే విలువపరంగా చూస్తే మాత్రం గత యేడాదిలో పాల్పడిన మోసాల మొత్తం 59,819 కోట్ల నుంచి 30,252 కోట్లకు తగ్గినట్లు పేర్కొంది. 'గత మూడేళ్లలో బ్యాంకుల్లో జరిగిన మోసం కేసుల అంచనా ప్రకారం, ప్రైవేట్ రంగ బ్యాంకులు గరిష్ట సంఖ్యలో మోసాలను నివేదించాయి' అని తెలిపింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు 2023లో మొత్తం 3,405 మోసాలను నమోదు చేశాయి. వీటి విలువ మొత్తం 21,125 కోట్లుగా అంచనా వేశారు. అయితే ఇది 2022 లో నమోదైన 40,0015 కోట్ల కంటే తక్కువ. ప్రైవేట్ బ్యాంకులు 2023లో 8,727 కోట్ల విలువైన 8,932 మోసాలను నివేదించాయి. 2022లో జరిగిన 17,387 కోట్ల విలువైన మోసాలు దాదాపుగా సగానికి తగ్గాయన్నమాట. కార్డ్స్ లేదా ఇంటర్నెట్ ఆధారిత చెల్లింపులతో కూడిన డిజిటల్ పేమెంట్స్ విభాగంలో ప్రధానంగా మోసాలు జరిగినట్లు రిజర్వ్‌బ్యాంకు తెలిపింది. ఈమోసాలకు సంబంధించిన విలువ ప్రధానంగా అడ్వాన్స్‌ల కేటగిరీలో నివేదించబడ్డాయి. 2021తో పోలిస్తే 2022లో నమోదైన మోసాల విలువలో 55శాతం క్షీణత ఉంది. అదే విధంగా 2022కంటే 2023లో మోసాల విలువ 49శాతం తగ్గింది. ప్రైవేట్ రంగ బ్యాంకులు నివేదించిన మోసాలు ఎక్కువగా చిన్న వాల్యూ కార్డ్స్, ఇంటర్నెట్ సంబంధించినవి. అయితే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మాత్రం ప్రధానంగా రుణ పోర్ట్‌ఫోలియోలో విభాగంలో ఉన్నాయని ఆర్‌బిఐ వెల్లడించింది.




# పాన్ కార్డుదారులకు ఐటి హెచ్చరిక

**న్యూఢిల్లీ, జూన్ 4:** దేశ ప్రజలకు కొన్ని ఐడెంటిటీ కార్డులు కీలకం అయ్యాయి. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో లబ్ధి పొందాలన్నా, ఇతర ట్రాన్సాక్షన్స్ చేయాలన్నా కొన్ని డాక్యుమెంట్లు కచ్చితంగా కావాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఆర్థిక పరమైన లావాదేవీలకు పాన్‌కార్డు తప్పనిసరిగా మారి పోయింది. పాన్ కార్డు ఉంటేనే చట్టపరంగా లావాదేవీలు చేసేందుకు వీలు కలుగుతుంది. పాన్‌కార్డుపై చేసే ప్రతి ట్రాన్సాక్షన్ రికార్డుల్లో నమోదవుతుంది. దీంతో ఆదాయ పన్ను అధికారులకు పన్ను వసూలు చేయడం సులువుగా ఉంటుంది. అయితే పాన్ కార్డు విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. లేదంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. పాన్ కార్డు సమాచారం ఆధారంగానే ప్రభుత్వం పన్ను వసూలు చేస్తుంటుంది. అయితే కొంత మంది ఒకటి కంటే ఎక్కువ పాన్ కార్డులు వాడుతుంటారు. పన్ను నుంచి తప్పించుకోవడానికి, ప్రభుత్వాన్ని మోసం చేయడానికి ఇలా చేస్తుంటారు.



ఇలా ఒకటి కంటే ఎక్కువ పాన్ కార్డులను ఉంచుకోవడం చట్ట రీత్యా నేరం. దేశంలో ఒక వ్యక్తి పేరిట ఒకే పాన్ కార్డు ఉండాలి. ఈ నిబంధన అతిక్రమిస్తే వారిపై అధికారులు తగిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇలా ఉన్నవారికి ప్రభుత్వం రూ.10వేలు జరిమానా విధిస్తుంది. ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 271బి కింద పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఆదాయ పన్ను శాఖ అధికారులు పాన్‌కార్డు జారీచేస్తారు. అయితే కొన్ని సార్లు అభ్యర్థులు రెండు, మూడు సార్లు పాన్ కార్డు కోసం దరఖాస్తులు చేస్తారు. ఫలితంగా కొందరికి రెండు పాన్ కార్డులు జారీ అవుతుంటాయి. ఒక్కోసారి అధీకృత ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల నుంచి పాన్ పొందే వీలుంటుంది. కానీ ఇలా రెండు కార్డులను ఉంచుకోవడం చట్టరీత్యా నేరం. కాబట్టి ఒక పాన్ కార్డుని వ్యక్తులు రద్దు చేసుకోవాల్సి ఉంటుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.